www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 10-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 355
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం తిథి: త్రయోదశి రా.1:01 తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుబ్బ మ.12:24 తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.8:25-10:12, దుర్ముహూర్తం: ఉ.10:13-11:02, మ.3:09-3:58, అమృతఘడియలు: శేషం ఉ.7:06, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:06, సూర్యాస్తమయం: 6:26 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రుణగ్రహీతలకు ఊరట



సంజయ్ మల్హోత్రా

తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణ రేట్లు.. ఈఎంఐ భారం కూడా

రిజర్వు బ్యాంకు రెపో రేటు 6.25% నుంచి 6 శాతానికి

ముందుముందు మరింత తగ్గిస్తామని సంకేతాలు

పరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన ఆర్‌బీఐ

11

నేను సంజయ్.. భారతంలో సంజయుడిని కాను

నాకు దివ్య దృష్టి లేదు.. వడ్డీరేట్లు ఇంకెంత తగ్గుతాయో ఇప్పుడే చెప్పలేను: ఆర్‌బీఐ గవర్నర్



రాజధాని అమరావతిలో సొంత ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు, మనవడు దేవాన్ష్, చిత్రంలో మంత్రి లోకేశ్, బ్రహ్మణి

రాష్ట్రానికి కేంద్రం వరాలు

రాజధాని, రైల్వే ప్రాజెక్టులపై మోదీ సర్కారు కీలక నిర్ణయం

అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు పచ్చజెండా

తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

వెనుకబడిన జిల్లాలకు త్వరలో 350 కోట్లు


మరో పెట్రోలియం రిఫైనరీకి సన్నాహాలు

విభజన చట్టంలోని అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఏజీ సూచన పాటింపు

కీలక ప్రాజెక్టుల సత్వర పూర్తికి నిర్ణయం

న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌పై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. పలు పెండింగ్ అంశాలతోపాటు.. విభజన చట్టంలోని అపరిష్కృత సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఏపీ రాజధాని అమరావతి-తెలంగాణ రాజధాని హైదరాబాద్ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి కేంద్ర హోం శాఖ పచ్చ జెండా ఊపింది. అలాగే, తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ డబ్లింగ్ పనులకు రూ.1,332 కోట్లను వెచ్చించనున్నట్టు తెలిపింది. మొత్తం 104 కిలో మీటర్ల మేర డబ్లింగ్ పనులు

మిగతా 12వ పేజీలో...



రాజధానికి రాజమార్గం

సత్వరం అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే డీపీఆర్‌కు ఆదేశం

విశాఖ-విజయవాడ-హైదరాబాద్-కర్నూలు రైలు కారిడార్‌పై ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ విస్తరణ పనుల పూర్తికి తక్షణ చర్యలు

12



నెరవేరిన దశాబ్దాల కల

రూ.1,332 కోట్లతో తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు ఆమోదం

ఏటా 40 లక్షల టన్నుల సరుకు రవాణాతో పరిశ్రమలకు లబ్ధి.. పర్యాటకానికి ఊపు



2

నేవీ అమ్ములపొదిలో రాఫెల్ ఫైటర్లు

రూ.64 వేల కోట్లతో 26 మెరైన్ జెట్లు

ఫ్రాన్స్ నుంచి కొనుగోలుకు సీసీఎస్ ఆమోదం

ఐఎన్ఎస్ విక్రమాదిత్య, విక్రాంత్‌లపై మోహరింపు

ప్రతీకార సుంకాల అమలు 90 రోజులపాటు

నిలుపుదల

చైనా మినహా 75కు పైగా దేశాలకు ఊరటనిస్తూ ట్రంప్ ప్రకటన



ఫార్మా ఉత్పత్తులపైనా భారీగా సుంకాలు విధించబోతున్నాం. ఆ ప్రకటన చేయగానే ఫార్మా కంపెనీలన్నీ చైనాను, ఇతర దేశాలను వదిలి అమెరికాకు బారులు తీరుతాయి. ఎందుకంటే.. వారి ఉత్పత్తుల్లో అధిక భాగాన్ని ఇక్కడే అమ్ముకోవాలి.

\- డొనాల్డ్ ట్రంప్

అప్పటిదాకా 10 శాతమే వసూలు చేస్తామని వెల్లడి

తమపై చైనా విధించిన 84% సుంకానికి ప్రతిగా..

ఆ దేశంపై టారిఫ్ 125 శాతానికి పెంచేస్తూ నిర్ణయం

ట్రంప్ ప్రకటనతో దూసుకుపోయిన అమెరికా మార్కెట్లు

సుంకాలపై తమతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు

పలు దేశాల నేతలు తహతహలాడుతున్నారని వ్యాఖ్య

ప్లీజ్ సర్ ప్లీజ్ అంటూ ప్రాధేయపడుతున్నారని వెల్లడి

ఆ నేతలపై అసభ్యకరమైన భాషలో నీచమైన వ్యాఖ్య

మా కార్లపై దిగుమతి సుంకాన్ని సున్నాకు తగ్గించండి

భారతదేశానికి యూరోపియన్ యూనియన్ విజ్ఞప్తి

కనీసం 30 శాతం ఉంచాలంటున్న పరిశ్రమ వర్గాలు

అమెరికాపై 25% సుంకాల విధింపునకు ఈయూ సై

కలిసి పనిచేద్దాం.. భారత్‌కు డ్రాగన్ ప్రతిపాదన!

బీజింగ్, వాషింగ్టన్, ఏప్రిల్ 9: ప్రతీకార సుంకాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒకింత వెనక్కి తగ్గారు. తమతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సుముఖంగా ఉన్న.. తన సూచన మేరకు అమెరికాపై ఎలాంటి ప్రతీకార సుంకాలూ విధించని 75కుపైగా దేశాలపై 'బాదుడు'ను వాయిదా వేశారు. వీటిపై ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ 90 రోజులూ ఆయా దేశాల ఉత్పత్తులపై నామమాత్రంగా 10 శాతం దిగుమతి సుంకాలను వసూలు చేస్తామని వెల్లడించారు. వాస్తవానికి ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలు బుధవారం ఉదయం నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. ట్రంప్ నిర్ణయంతో అది వాయిదా పడినట్టయింది. అదే సమయంలో.. ఢీ అంటే ఢీ అంటూ తమకు పోటీగా సుంకాలను విధిస్తున్న చైనాపై ట్రంప్ మరింత భారం మోపారు! అమెరికా తమపై సుంకాల భారాన్ని 104 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. చైనా కూడా అమెరికాపై సుంకాలను 84 శాతానికి పెంచుతున్నట్టు బుధవారం ప్రకటించింది. దీంతో ట్రంప్ మరింత

మిగతా 2వ పేజీలో...



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మార్క్ శంకర్

కోలుకుంటున్న మార్క్ శంకర్

మరో మూడు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలోనే

ఐసీయూ నుంచి వార్డుకు మార్చిన వైద్యులు

సింగపూర్‌లో ఆస్పత్రికి డిప్యూటీ సీఎం పవన్

కుమారుడి ఆరోగ్యంపై వైద్యుల వద్ద ఆరా

14

తిట్టించు.. ఇరికించు!

మళ్లీ మొదలెట్టిన వైసీపీ అధినేత

చంద్రబాబు, పవన్, లోకేశ్ సహా కూటమి నాయకులే టార్గెట్

సొంత నేతలను కేసుల్లో ఇరికించి వైసీపీని వీడకుండా వ్యూహం

గత ఐదేళ్లూ బూతుల దండకం

ఇప్పుడు మళ్లీ నోళ్లకు పని

పోలీసులపై స్వయంగా జగన్ తీవ్ర వ్యాఖ్యలు

టీడీపీ వాళ్లను నరికేస్తారన్న కారుమూరి

ఇదేబాటలో తోపుదుర్తి, లేళ్ల, పేర్ని నాని

జగన్ రాజకీయ వ్యూహం ఇదే.. సొంత పార్టీ నేతలు, కార్యకర్తలే బలి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సొంత పార్టీ నేతలతో ప్రత్యర్థి పార్టీల నాయకులను బూతులు తిట్టించడం.. వాళ్ల కేసుల్లో ఇరుక్కునేలా ప్రేరేపించడం.. భవిష్యత్తులో మరో పార్టీలోకి వెళ్లే అవకాశం లేకుండా, తన దగ్గరే పడుండేలా చేయడం.. వైసీపీ అధినేత జగన్ మొదట్నుంచీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహం. అధికారంలో ఉన్న గత ఐదేళ్లూ సొంత పార్టీకి చెందిన పలువురు నేతలతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ సహా ప్రతిపక్ష నేతలను బండ బూతులు తిట్టించారు. ఇప్పుడు ఆ బూతుల నేతలు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. గత ఎన్నికల్లో

మిగతా 13వ పేజీలో...

అసలేం జరిగింది?

జగన్ పరామర్శ పర్యటనపై పోలీసు దర్యాప్తు ప్రారంభం

'విండ్ షీల్డ్'పై వాస్తవాల విచారణకు బెంగళూరుకు బృందం


జగన్ రెచ్చగొడుతున్న తీరుపై విచారణ జరపాలి

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంపీ లావు వినతి

అదంతా క్రిమినల్ లీడర్ ప్రీ ప్లాన్: హోం మంత్రి అనిత

విచారణ జరుగుతోందని, చర్చకు సిద్ధమని స్పష్టీకరణ





12

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'ఆగస్టు సంక్షోభం'లో స్పీకర్‌గా చేయాల్సిందే చేశా!

చంద్రబాబుకు ప్రత్యేకంగా మేలు చేయలేదు

ఎమ్మెల్యేల బలాబలాలను నేనే లెక్కించా

బాబుకు 163 మంది ఎమ్మెల్యేల మద్దతు

అందుకే.. అప్పుడు ఆయన సీఎం అయ్యారు

ఎన్టీఆర్‌కు మైక్ ఇవ్వలేదని నాపై దుష్ప్రచారం

స్పీకర్‌గా ఎన్నో కీలకమైన రూలింగ్స్ ఇచ్చా

11సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టా

'ఆంధ్రజ్యోతి'తో యనమల రామకృష్ణుడు

42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై నేడు పుస్తకావిష్కరణ

వక్ఫ్ జోలికి ఎందుకెళ్లారు?



వక్ఫ్ భూములకు ఎసరు

ఆ భూముల్ని వాణిజ్య అవసరాలకు వినియోగించవద్దని చెప్పానా? లేదా?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

'ఆంధ్రజ్యోతి' వార్తలోని అంశాలపై ఆరా

ప్రభుత్వానికి మాట మాత్రం చెప్పరా?

నోటిఫికేషన్ రద్దుకు ఆదేశాలు

ఆ వెంటనే రంగంలోకి దిగిన సీఎంవో

మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి వివరణ

ప్రకటనను ఉపసంహరించాలంటూ వక్ఫ్‌బోర్డుకు ఆ శాఖ కార్యదర్శి ఆదేశం

నలుగురు కాదు.. 50 మంది ఇంటి దొంగలు.. అందరినీ ఏరేస్తాం: చైర్మన్

అమరావతి, ఏప్రిల్ 9 ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాల వక్ఫ్ భూములను వాణిజ్య అవసరాలకు కట్టబెట్టే ప్రయత్నాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీవర్గాల అభివృద్ధి, సంక్షేమానికి మాత్రమే ఆ భూములను ఉపయోగించాలని లోగడ సీఎం ఆదేశించారు. అయినా, ప్రభుత్వానికి మాట మాత్రమైనా చెప్పకుండా వాణిజ్య అవసరాలకు ఇచ్చేందుకు నోటిఫికేషన్‌ను ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆసక్తిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తూ ఈనెల 3వ తేదీన వక్ఫ్‌బోర్డు ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దుచేయాలని ఆయన ఆదేశించారు. వక్ఫ్ భూములను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మైనారిటీ సంక్షేమశాఖకు నిర్దేశాలు జారీచేశారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో, ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని వక్ఫ్‌బోర్డును ఆదేశించినట్లుగా మైనారిటీ సంక్షేమశాఖ

మిగతా 14వ పేజీలో...



2

నేడు భారత్‌కు రాణా

ఎట్టకేలకు ముంబై పేలుళ్ల సూత్రధారిని అప్పగించిన అమెరికా

జైలు నుంచి ఎన్ఐఏ కస్టడీలోకి

ప్రత్యేక విమానంలో బయల్దేరిన బృందం



12

'ఆక్వా'పై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

సుంకాలు, సవాళ్లకు పరిష్కారమే లక్ష్యం

కమిటీ సభ్యులు, విధి విధానాలు ఖరారు

సూచనలు ఇచ్చేందుకు నిర్దిష్ట కాల పరిమితి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నైరుతిలో సాధారణ వర్షపాతం!

ఆగస్టు, సెప్టెంబరులో ఎక్కువ వర్షాలు

3

ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా

ఐఎండీ బులెటిన్ వచ్చే వారం విడుదల

దేశమంతా తెలంగాణ ఫార్ములా

50% రిజర్వేషన్ల పరిమితిని బద్దలు కొడతాం



వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇకపై క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనార్టీల హక్కులపై పడతాయి

2

ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు మోదీ లొంగిపోయారు.. 56 అంగుళాల ఛాతీ ఎక్కడ?: రాహుల్

దేశంలో 10% కార్పొరేట్ శక్తుల చేతుల్లో 90 శాతం సంపద పోగుపడిందని వ్యాఖ్య

జగన్ పత్రికవి తప్పుడు రాతలు



స్వార్థంతో రాష్ట్రానికో తీరున కథనాలు

చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి టీడీపీ ఫిర్యాదు

14



కాకాణికి హైకోర్టు షాక్

క్వార్ట్జ్ కేసులో అరెస్టు నుంచి రక్షణకు నిరాకరణ

ఎఫ్ఐఆర్, రికార్డులు పరిశీలిస్తే ఆయన పాత్ర స్పష్టమవుతోందని న్యాయమూర్తి వ్యాఖ్య

మద్యం 'సిట్' విచారణకు కసిరెడ్డి డుమ్మా



సహకరించాలని హైకోర్టు ఆదేశించినా గైర్హాజరు

మొత్తం కక్కేస్తారని వైసీపీ పెద్దలే దాచారని అనుమానం

14



జోగి రమేశ్‌కు సీఐడీ నోటీసులు

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో రేపు విచారణ

వంశీకి మరో ఎదురుదెబ్బ



భూకబ్జా కేసులో ముందస్తు బెయిల్‌కు నో

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో రిమాండ్ పొడిగింపు

14

నేడు భారత్‌కు తహవ్వుర్ రాణా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ముంబై పేలుళ్ల సూత్రధారి తహవ్వుర్ రాణాను అమెరికా జైలు నుంచి భారత్‌కు తీసుకొస్తున్నారు. నేరస్థుల అప్పగింత ఒప్పందం కింద కస్టడీలోకి తీసుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయలుదేరింది. గురువారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకుంటుంది. పాకిస్థాన్‌కు చెందిన రాణా కెనడా పౌరుడు. పాకిస్థాన్ ఆర్మీలో డాక్టర్‌గా పనిచేసిన అతడు 1997లో కెనడాకు వలస వెళ్లాడు. అనంతరం అమెరికాకు వెళ్లి ఇమిగ్రేషన్ సంస్థను ఏర్పాటు చేశాడు. భారత్‌లోని ఆ సంస్థ కార్యాలయంలోనే లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ ఆశ్రయం పొంది ముంబై పేలుళ్లకు కీలక భవనాల వద్ద రెక్కీ నిర్వహించినట్టు భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. 2008 నవంబరు 26న ముంబైపై జరిపిన ఉగ్రదాడిలో 174 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 300 మందికిపైగా గాయాలపాలయ్యారు. అమెరికా వెళ్లిన ఎన్ఐఏ బృందం రాణాను తీసుకుని ప్రత్యేక విమానంలో భారత్‌కు బయలుదేరింది. ఎన్ఐఏ, ముంబై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో అతడు విచారణను ఎదుర్కోనున్నాడు.

ఎల్బీనగర్ కోర్టులో మోహన్‌బాబుకు చుక్కెదురు

» ఆయనకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు కొట్టివేత ?

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు కుటుంబంలో రేగిన వివాదం చల్లారడం లేదు. జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ బుధవారం ధర్నాకు దిగారు. మనోజ్ ఈ సందర్భంగా తన తండ్రి మోహన్‌బాబు, సోదరుడు విష్ణుపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనని ఇంట్లోకి రానివ్వకూడదని మోహన్‌బాబు కోర్టును తప్పుదారి పట్టించి స్టే తెచ్చుకున్నారని విలేకరులతో అన్నారు. తాను ఇంట్లోకి వెళ్లేందుకు అనుమతినిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎల్బీనగర్ కోర్టులో చూపుగా.. ఎల్బీనగర్ న్యాయస్థానం ఆ స్టేను కొట్టేసిందని తెలిపారు. జల్‌పల్లిలోని ఇంటి విషయంలో చిన్న కొడుకు మనోజ్‌తో వివాదం నేపథ్యంలో మోహన్‌బాబు ఎల్బీనగర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మనోజ్ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అతను తన ఇంట్లోకి ప్రవేశించకుండా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం మోహన్‌బాబుకు అనుకూలంగా గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఇంట్లోకి ప్రవేశించేందుకు హైకోర్టు మనోజ్‌కు అనుమతి ఇచ్చిందనే విషయాన్ని దాచడంతోపాటు, తప్పుడు ఆధారాలు సమర్పించి మోహన్‌బాబు న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని మనోజ్ తరఫున న్యాయవాదులు ఎల్బీనగర్ కోర్టులో వాదనలు వినిపించారు. వాటిని పరిశీలించిన ఎల్బీనగర్ న్యాయస్థానం మోహన్‌బాబుకు అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలను మంగళవారం కొట్టేసినట్టు తెలిసింది. అంతేకాక ఈ తప్పిదం జరగడానికి కారణమైన కోర్టు క్లర్క్‌కు మెమో కూడా జారీ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంచు మనోజ్ జల్‌పల్లి నివాసంలోకి వెళ్లేందుకు బుధవారం ప్రయత్నించగా మోహన్‌బాబు సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మనోజ్ ఇంటి గేటు వద్ద గంటన్నరకు పైగా బైఠాయించి నిరసనకు దిగారు.

ప్రభుత్వ బడులపై ఆర్టీఈ దెబ్బ!

» ఇప్పటికే పాఠశాలల్లో తగ్గిపోతున్న విద్యార్థులు

» 2025-26లో ఆర్టీఈ ప్రవేశాలకు అనుమతిస్తూ ఉత్తర్వు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా హక్కు చట్టం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంటే, ఆర్టీఈ వల్ల వీరి చేరికలు మరింతగా పడిపోతున్నాయి. మరోవైపు ఆర్టీఈ కింద ప్రవేశాలు పొందే విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజులపై కూడా సందిగ్ధత నెలకొంది. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలి. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం... ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేని ప్రాంతాల్లోనే ఆర్టీఈ అమలు చేయాలి. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు కిలో మీటరు పరిధిలో, 6 నుంచి 8 తరగుల విద్యార్థులకు 3 కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. రాష్ట్రంలో దీనికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నామని, ఇవి అన్ని ప్రాంతాల్లోనూ విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని, అందువల్ల ఆర్టీఈ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆర్టీఈ అమలు వల్ల ప్రభుత్వ బడులకు రావాల్సిన పిల్లలు ప్రైవేటు బాట పడుతున్నారని వివరించింది. కాగా, రాష్ట్రంలో గత మూడేళ్ల నుంచి విద్యా హక్కు చట్టాన్ని అమలుచేస్తున్నారు. సుమారు 34వేల మంది విద్యార్థులు ప్రస్తుతం ఆర్టీఈ కింద ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. పట్టణాల్లో రూ.8వేలు, గ్రామాల్లో రూ.6500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100 ఫీజులుగా గత ప్రభుత్వం నిర్ణయించింది. ఒకటి నుంచి 8వ తరగతి వరకు అవే ఫీజులు అమల్లో ఉండటంపై ప్రైవేటు పాఠశాలలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ఎంత ఖర్చు చేస్తున్నారో, అంతే మొత్తం ఆర్టీఈ విద్యార్థులకు ఫీజు కింద చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశం కోర్టుకు వెళ్లడంతో కొత్త ఫీజుల ఖరారుకు ప్రభుత్వం ఇటీవల కమిటీని నియమించింది. ఇదిలా ఉండగా, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విద్యా హక్కు చట్టం కింద 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే నియమించిన కమిటీ సిఫారసు మేరకు ఆర్టీఈ ఫీజులుంటాయని పేర్కొంది. ఈ నెలాఖరు నాటికి ఫీజులు ఖరారు చేయాల్సి ఉంది. ఆర్టీఈ కింద ఉచిత ప్రవేశాలు పొందే వారికి తల్లికి వందనం పథకం మినహాయించాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

నేవీ అమ్ములపొదిలో రాఫెల్ ఫైటర్లు

» 64 వేల కోట్లతో 26 మెరైన్‌జెట్లు ఫ్రాన్స్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 9: భారత నౌకాదళం అమ్ముల పొదిలో భారీ యుద్ధ విమానాలు వచ్చి చేరనున్నాయి. రూ.64 వేల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్ ఫైటర్ల కొనుగోలుకు భద్రతావ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) బుధవారం ఆమోదం తెలిపింది. విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లపై ప్రస్తుతం ఉన్న మిగ్-29కే ఫైటర్ల స్థానంలో రాఫెల్-ఎం ఫైటర్లు రానున్నాయి. ఇవి నౌకాదళ అవసరాల కోసం రూపొందించిన దసాల్ట్ రాఫెల్ ఫైటర్ జెట్లు. 9.5 టన్నుల ఆయుధాలు, చమురు ట్యాంకులను తీసుకెళ్లడానికి వీటిని ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. భారత్, ఫ్రాన్స్ నడుమ ప్రభుత్వాల స్థాయిలో కొనుగోలు ఒప్పందం చేసుకోనున్నారు. ఇది ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత అటు వాయుసేనకు, ఇటు నౌకాదళానికి ఒకేరకమైన యుద్ధవిమానాలు ఉన్న దేశంగా భారత్ మారుతుంది. గగనతలం, సముద్రతలంపై ఆధిపత్యానికి ఇది తోడ్పడుతుంది. కొనబోతున్న 26 మెరైన్ ఫైటర్లలో 22 సింగిల్ సీటర్లు కాగా.. 4డబుల్ సీటర్లు. ఒప్పందం కుదిరిన ఐదేళ్లలో సరఫరా ప్రారంభమవుతుంది. జెట్ల నిర్వహణ, సిబ్బందికి శిక్షణ, అవసరమైన పరికరాలను భారత్‌లోనే ఉత్పత్తిచేయడం దీని ప్రత్యేకతలు. ఇప్పటికే భారత వాయుసేన వద్ద 36 రాఫెల్ ఫైటర్లు ఉన్నాయి. గగనతలంలోనే ఇంధనం నింపుకోవడానికి రాఫెల్-ఎం జెట్లు వీటికి ఉపయోగపడతాయి. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద ప్రత్యేక సబ్‌స్కీంగా 2025-26 సంవత్సరానికి రూ.1,600 కోట్ల వ్యయంతో కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్-వాటర్ మేనేజ్‌మెంట్ ఆధునికీకరణ (ఎం-సీఏడీడబ్ల్యూఎం) కార్యక్రమం అమలుకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఈఏ) ఆమోదం తెలిపింది. నిర్దేశిత క్లస్టర్‌లో కెనాల్స్, ఇతర నీటి వనరుల ద్వారా జరిగే సాగునీటి సరఫరా నెట్‌వర్క్‌ను ఆధునికీకరించడం దీని ఉద్దేశం. పంజాబ్-హరియాణాల్లో వాహనాల రద్దీని నియంత్రించేందుకు పంజాబ్‌లోని మొహాలీ జిల్లా జిరాక్‌పూర్ వద్ద బైపాస్ నిర్మాణానికి సీసీఈఏ ఆమోదించింది. రూ.1,878.31 కోట్లతో 19.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారి ఇది.

90 రోజులు నిలుపుదల

(మొదటిపేజీ తరువాయి)



రెచ్చిపోయారు. ప్రపంచ మార్కెట్ల పట్ల ఏమాత్రం మర్యాద చూపని డ్రాగన్ దేశంపై.. సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్టు తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు. మిగతా దేశాల్లాగా 90 రోజుల వెసులుబాటు కూడా ఇవ్వకుండా.. ఆ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ పోస్టులో ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికాను, ఇతర దేశాలను సుంకాల పేరుతో దోచుకోవడం ఇకపై ఎంతమాత్రం కుదరదనే నిజాన్ని చైనా త్వరలోనే తెలుసుకుంటుందన్న ఆశాభావాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు. అంతకుముందు.. అమెరికాపై 84 శాతం సుంకాలను విధిస్తూ తీసుకున్న నిర్ణయం గురువారం నుంచే అమల్లోకి వస్తుందని చైనా ప్రకటించింది. సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అమెరికా మార్కెట్లు దూసుకుపోయాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ 8.5 శాతం పెరగ్గా.. డౌజోన్స్ సూచీ 7.2%, నాస్‌డాక్ 10.8% మేర పెరిగాయి. 2020 నుంచి మార్కెట్లు ఒక్కరోజే ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి.

అంతేకాదు.. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికాకు వ్యతిరేకంగా మరో దావా వేయబోతున్నట్టు వెల్లడించింది. చైనా కంపెనీలతో వ్యాపారం చేసే అమెరికన్ కంపెనీలపై మరిన్ని ఆంక్షలు విధిస్తున్నట్టు తెలిపింది. ఇప్పటికే ఇలా చాలా కంపెనీలపై ఆంక్షలు విధించిన చైనా.. తాజాగా 11 కంపెనీలను ఆ జాబితాలో చేర్చింది. సుంకాలను పెంచడం అమెరికా సమస్యలను పరిష్కరించదని చరిత్ర, గణాంకాలు చెబుతున్నాయని పేర్కొంది. అమెరికా చర్యలు ఆ దేశానికే ముప్పుగా పరిణమిస్తాయని హెచ్చరించింది. సుంకాల పేరుతో అమెరికా తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని.. కానీ, అలాంటి ఆధిపత్య చర్యలను తాము ఎన్నటికీ అంగీకరించబోమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పష్టం చేశారు. తమ దేశ సార్వభౌమాధికారానికి, భద్రతకు, అభివృద్ధి ఆకాంక్షలకు విఘాతం కలిగించే ఎటువంటి ప్రయత్నాలనూ తాము సహించబోమని.. అమెరికాపై దృఢమైన, శక్తిమంతమైన చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు. మరోవైపు.. యూరోపియన్ యూనియన్ దేశాలు సైతం అమెరికాపై 25 శాతం సుంకాల విధింపు ప్రతిపాదనకు అనుకూలంగా ఓటువేశాయి. ఈ సుంకాలు ఏప్రిల్ 15, మే 16, డిసెంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్టు వెల్లడించింది.

కలిసి పనిచేద్దాం.. డ్రాగన్ ప్రతిపాదన!

అమెరికాతో వాణిజ్య యుద్ధం ముదిరిన నేపథ్యంలో డ్రాగన్ దేశం భారతదేశ మద్దతును కోరింది. అమెరికా సుంకాల వేధింపులను ఎదుర్కోవడానికి, కష్టాలను అధిగమించడానికి రెండు అతిపెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలు (భారత్, చైనా) కలిసి నిలబడాలని భారత్‌లో చైనా దౌత్యకార్యాలయ అధికార ప్రతినిధి యు జింగ్ 'ఎక్స్'లో పెట్టిన ఒక పోస్టులో పేర్కొన్నారు. రెండు దేశాల ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పరస్పర సహకారం, ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయని ఆమె గుర్తుచేశారు. అమెరికా అనుసరిస్తున్న సుంకాల వేధింపుల కారణంగా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు నష్టపోతున్నాయని, ఆవేదన వెలిబుచ్చిన యు జింగ్.. వాణిజ్య, సుంకాల యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని హెచ్చరించారు. సంరక్షణ వాదం, ఏకపక్ష వాదం ఏ రూపంలో ఉన్నా వాటిని ప్రపంచదేశాలన్నీ కలిసి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సాక్షాత్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైతం.. ఇండియా, చైనా మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఏప్రిల్ 1న బీజింగ్‌లో మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ సందర్భంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య సంబంధాలు 'ఏనుగు-డ్రాగన్ నృత్యం'లా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ట్రంప్ సుంకాల నేపథ్యంలోనే అయినప్పటికీ.. చైనాలో అత్యున్నత స్థాయి నేత నుంచి అలాంటి వ్యాఖ్యలు రావడం చెప్పుకోదగ్గ విషయమే. చైనా విదేశాంగ మంత్రి కూడా.. న్యూఢిల్లీ, బీజింగ్ కలిసి పనిచేయాలని, ఆధిపత్యవాదాన్ని, పవర్ పాలిటిక్స్‌ను వ్యతిరేకించడంలో నాయకత్వ పాత్ర పోషించాలని గత నెలలో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, కొన్ని దేశాలకు ప్రపంచ ఆహార పథకం(డబ్ల్యూఎఫ్‌పీ)లో భాగంగా యూఎస్ఎయిడ్‌ను పునరుద్ధరించాలని అమెరికా నిర్ణయించింది. అంతర్యుద్ధం జరుగుతున్న దేశాల్లో యూఎస్ఎయిడ్ అందకపోవడంతో లక్షల మంది ఆకలిచావులను ఎదుర్కోవాల్సి వస్తుందని డబ్ల్యూఎఫ్‌పీ ఎక్స్‌లో పోస్టు చేసిన నేపథ్యంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 14 దేశాల్లో డబ్ల్యూఎఫ్‌పీకి యూఎస్ఎయిడ్ అందుతుండగా.. ట్రంప్ అధికారంలోకి వచ్చాక దాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే.! ఇప్పుడు లెబనాన్, సిరియా, ఇరాక్, జోర్డాన్, ఈక్వెడార్, సోమాలియాల్లో సహాయాన్ని కొనసాగించాలని అమెరికా నిర్ణయించింది.

తగ్గించండి...

విదేశీ కార్ల దిగుమతులపై భారత్ విధిస్తున్న భారీ సుంకాలకు ప్రతిగా ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించిన నేపథ్యంలో.. యూరోపియన్ యూనియన్ కూడా ఆ అంశంపై దృష్టి సారించింది. విదేశీ కార్లపై సుంకాలను సున్నా శాతానికి తగ్గించాలని భారతదేశానికి విజ్ఞప్తి చేసింది. నిజానికి దీనికి సంబంధించిన వాణిజ్య ఒప్పందం చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. భారత్ కూడా.. విదేశీ కార్లపై 100 శాతానికి పైగా ఉన్న సుంకాలను దశలవారీగా 10 శాతానికి తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలను, ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ రాయ్‌టర్స్ వార్తాసంస్థ ఒక కథనాన్ని వెలువరించింది. కిందటివారం జరిగిన ఒక సమావేశంలో కేంద్ర వాణిజ్య శాఖ అధికారులు ఈయూ అభ్యర్థనను, దానిపై ప్రభుత్వ వైఖరిని.. భారీ పరిశ్రమల శాఖ అధికారులు, ఆటో ఇండస్ట్రీ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చినట్టు అందులో పేర్కొంది. భారతీయ కార్ల పరిశ్రమ మాత్రం.. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కార్లపై సుంకాన్ని కనీసం 30 శాతంగా ఉంచాలని, ఈవీలపై విధిస్తున్న దిగుమతి సుంకాలను మరో నాలుగేళ్ల పాటు తగ్గించొద్దని పైరవీ చేస్తున్నట్టు వెల్లడించింది. ఈయూ విజ్ఞప్తి మేరకు భారతదేశం సుంకాలను తగ్గిస్తే.. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఫోక్స్‌వ్యాగన్ వంటి యూరోపియన్ కార్ల తయారీ దిగ్గజాలకు, అటు అమెరికాకు చెందిన టెస్లా సంస్థకు ప్రయోజనం కలుగుతుంది.

ట్రంప్ దారుణ వ్యాఖ్యలు

అమెరికా విధించిన అడ్డగోలు సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. పుండు మీద కారం జల్లినట్టుగా ట్రంప్ ఆ సుంకాలతో ప్రభావితమవుతున్న దేశాలపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేశారు. ఆయా దేశాల నేతలందరూ అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి తహతహలాడిపోతున్నారని.. సుంకాల బారి నుంచి తప్పించుకోవడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నారని, "ప్లీజ్ సర్, ప్లీజ్ సర్ మేం ఏమైనా చేస్తాం సర్" అంటూ తమను పదేపదే సంప్రదిస్తున్నారని ఆయన గొప్పలు చెప్పుకొన్నారు. అంతటితో ఆగక.. 'కిస్సింగ్ మై యా....' అంటూ రాయడానికి వీల్లేని అసభ్యకరమైన భాషలో దారుణంగా మాట్లాడారు. అలాగే.. ఫార్మా ఉత్పత్తులపైనా భారీగా సుంకాలు విధించబోతున్నట్టు మరోసారి వెల్లడించారు. "ఆ ప్రకటన చేయగానే ఫార్మా కంపెనీలన్నీ చైనాను, ఇతరదేశాలను వదిలి బారులు తీరుతాయి. ఎందుకంటే.. వారి ఉత్పత్తుల్లో అధిక భాగాన్ని ఇక్కడే అమ్ముకోవాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

లోకం తీరు



అమెరికాలో 'ఓపీటీ' రద్దుకు చట్టసభలో బిల్లు

వాషింగ్టన్, ఏప్రిల్ 9: అమెరికాలో పని అనుభవాన్ని పొందడానికి విదేశీ విద్యార్థులను అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రాంను తొలగించే బిల్లును అక్కడి చట్ట సభలో ప్రవేశపెట్టారు. దీంతో అక్కడి విదేశీ విద్యార్థుల్లో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ సభ్యుడు పాల్ గోసర్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. 'విద్యార్థి వీసాలపై అమెరికాలో చదువుకునేందుకు వస్తున్న ఏటా లక్ష మంది విదేశీయులు ఓపీటీ కింద నమోదు చేసుకొని విద్యాభ్యాసం అయిపోయాక కూడా ఇక్కడే మూడేళ్ల పాటు ఉంటున్నారు. దురాశపరులైన ఇక్కడి వ్యాపారులు నైపుణ్యం, ఉన్నత విద్యావంతులైన అమెరికన్లను కాదని చవకగా వస్తున్న విదేశీ విద్యార్థులకే ఉద్యోగాలు ఇస్తున్నారు. ఓపీటీ విధానం విదేశీ కార్మికులనే ప్రోత్సహిస్తోంది' అని బిల్లులో పేర్కొన్నారు. అయితే ఈ బిల్లు సెనెట్‌లో ఆమోదం పొందే అవకాశం లేదని, ఈ బిల్లు ఆమోదానికి కావాల్సిన సంఖ్యాబలం రిపబ్లికన్లకు లేదని ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు అంటున్నారు.

అమెరికాను విడిచి వెళ్లొద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: వలసదారులపై ట్రంప్ సర్కారు కఠిన వైఖరి అవలంబిస్తున్న నేపథ్యంలో అమెరికాలోని టెక్ ఉద్యోగుల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశం విడిచి వెళ్తే తిరిగి ప్రవేశించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున అమెరికా వెలుపల ప్రయాణాలు పెట్టుకోవద్దని వీసాదారులైన తమ ఉద్యోగులను అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్ వంటి ప్రముఖ టెక్ దిగ్గజ సంస్థలు హెచ్చరించాయి. భారత్ వస్తే, అమెరికాలోకి తిరిగి ప్రవేశాన్ని నిరాకరిస్తారనే భయంతో స్వదేశానికి వెళ్లే ఆలోచనను విరమించుకున్నామని భారత్‌కు చెందిన ఇద్దరు హెచ్-1బీ వీసాదారులు మీడియాకు తెలిపారు.

ఆగస్టులోగా సారాను తరిమి కొట్టండి

» గంజాయి కనిపించకుండా గట్టిగా పనిచేయాలి

» రాష్ట్రస్థాయి ఎక్సైజ్ అధికారుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఆగస్టు తరువాత నాటు సారా కనిపించకూడదు. ఆమేరకు లక్ష్యాలు నిర్దేశించుకొని పనిచేయాలి' అని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'నవోదయం-2 లక్ష్యం నెరవేర్చి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గంజాయి, నాటు సారా, మాదక ద్రవ్యాలను పూర్తిగా కట్టడి చేయాలి. అన్ని జిల్లాల ఎక్సైజ్ అధికారులు సమన్వయం చేసుకుని సరిహద్దు ప్రాంతాల్లో గట్టిగా నిఘా ఉంచాలి' అని సూచించారు. రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ... 'గంజాయి నియంత్రణ, నాటు సారా కట్టడి, మాదక ద్రవ్యాలు కనిపించకుండా చేయడానికి అన్ని ప్రాంతాల్లో టోల్ ఫ్రీ నంబరు 14405 పై ముమ్మరంగా ప్రచారం చేయాలి' అని ఆదేశించారు. 'మద్యం నాణ్యతపై మందుబాబుల నుంచి కంపారిటివ్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. తిరుపతిలో ఎక్కువగా విద్యాసంస్థలు ఉన్నాయి. ఎక్కువ ఫోకస్ పెట్టండి. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలి' అని రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. మద్యం వల్ల నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అధికారుల పనితీరుపై ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈస్ట్ గోదావరి, రాజమహేంద్రవరం, పల్నాడు, శ్రీకాకుళం, పలాస వంటి ప్రాంతాల్లో ఎక్కువగా నేరాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. అతి తక్కువగా నేరాలు జరుగుతున్న చిత్తూరు జిల్లాను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని ఆదేశించారు. బహిరంగ తాగుడు ఎక్కడా కనిపించకుండా అధికారులు పనిచేయాలని కోరారు.

లిక్కర్ మాఫియాను వదిలిపెట్టం: కొల్లు

గత ఐదేళ్ల కాలంలో జగన్ జమానాలో సాగిన లిక్కర్ మాఫియా కేసులో ఎవరినీ వదలి పట్టేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మద్యంలో జరిగిన అవినీతి అక్రమాలను ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారన్నారు. క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో దాదాపు రూ.లక్ష కోట్లు లావాదేవీలు జరగడంపై సీఐడీ విచారణ జరుగుతోందని తెలిపారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన జగన్.. మద్యం వ్యాపారాన్ని చేతుల్లోకి తీసుకున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆరు రాష్ట్రాల్లో మద్యం పాలసీని అధ్యయనం చేసి, నూతన విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. మద్యం నాణ్యతపై 13 రకాల పరీక్షలను 5 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీది నకిలీ జాతీయవాదం

కాంగ్రెస్ జాతీయవాదం ప్రజలను ఏకం చేస్తే.. బీజేపీ సమాజాన్ని విభజిస్తోంది

» సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రతీ ప్రయత్నాన్ని అడ్డుకుంటాం

» అహ్మదాబాద్ ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ తీర్మానం



అహ్మదాబాద్, ఏప్రిల్ 9: జాతీయవాదం అంటే కాంగ్రెస్ దృష్టిలో ప్రజలను ఏకం చేసేదని.. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ల నకిలీ జాతీయవాదం పక్షపాతంతో ప్రజలను విభజించేదని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. అవి స్వార్థపూరిత అధికారం కోసం కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. రాజ్యాంగాన్ని రక్షించేది తామేనని, దేశ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు పోరాటం చేస్తామని తెలిపింది. ఈ మేరకు బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో 'న్యాయపథం' పేరిట కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసింది. "దేశంలో మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. ముస్లింలు, క్రిస్టియన్లలో చాలా మంది భయంతో బతుకుతున్నారు. ఇది దారుణమేకాదు రాజ్యాంగ వ్యతిరేకం కూడా. వక్ఫ్ బోర్డుల చట్టానికి సవరణలు, చర్చిల భూములను లక్ష్యంగా చేసుకోవడం, మతపరమైన ప్రాంతాల వద్ద ఉద్దేశపూర్వక ప్రదర్శనలు వంటివి వ్యూహాత్మకంగా సాగుతున్నాయి. మతం, భాష, ప్రాంతం ఆధారంగా విభజన జరుగుతోంది. కానీ భారతీయ సాంప్రదాయమైన లౌకికత్వానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుంది. మా మార్గం సుస్పష్టం.. 'విద్వేషాన్ని వీడాలి.. దేశాన్ని ఐక్యం చేయాలి" అని తీర్మానంలో పేర్కొంది.

అందరికీ న్యాయమే జాతీయ వాదం..

"అణచివేతకు గురైనవారి హక్కులను కాపాడటమే కాంగ్రెస్ సిద్ధాంతం. దురదృష్టవశాత్తూ నాడు దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారు ఇప్పుడు జాతీయవాదం గురించి మాట్లాడుతున్నారు. భారత్ లౌకిక దేశంగా ఉంటుందని సర్దార్ పటేల్ ఆనాడే స్పష్టం చేశారు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశ ప్రత్యేకత. ప్రాంతం, కులం, మతం, భాష ఆధారంగా వివక్ష ఉండకూడదనేదే కాంగ్రెస్ సిద్ధాంతం. దానికి కట్టుబడి ఉంటాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్ ప్లాన్ కోసం కేంద్రంలో చట్టం చేస్తాం. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం" అని కాంగ్రెస్ తెలిపింది. బీజేపీ ప్రభుత్వంలోని నేతలు వ్యక్తిగత ప్రతిష్ఠ, స్వప్రయోజనాల కోసం భారత విదేశాంగ విధానాన్ని తాకట్టు పెట్టారని, బలహీనమైన నాయకత్వంతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని కాంగ్రెస్ ఆరోపించింది.

న్యాయవ్యవస్థకు జవాబుదారీతనం కావాలి

"దేశంలో ప్రతి వ్యవస్థను బలంతోనో, ప్రలోభంతోనో, అధికారంతోనో లొంగదీసుకోవడం సాధారణమైపోయింది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు జడ్జి నివాసంలో నోట్ల కట్టలు బయటపడటం అప్రమత్తం కావాల్సిన అంశం. దేశంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతినకుండా చూస్తూనే.. దాని జవాబుదారీతనం పెంచే వ్యవస్థ అత్యవసరం" అని కాంగ్రెస్ తీర్మానంలో అభిప్రాయపడింది. "జీఎస్టీ ఆదాయంలో వాటాను తగ్గిస్తూ రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనం చేస్తున్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక పేరిట సమాఖ్య వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నారు" అని ఆరోపించింది. మరోవైపు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆ రాష్ట్రానికి సంబంధించి కాంగ్రెస్ ప్రత్యేకంగా మరో తీర్మానం చేసింది.

పనిచేయకుంటే తప్పుకోండి: ఖర్గే

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని, తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించని నేతలు తప్పుకుంటే మంచిదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హెచ్చరించారు. పార్టీలో జిల్లా అధ్యక్షుల అధికారాలు, బాధ్యతలు పెరగనున్నాయని.. అందుకే వారి ఎంపికలో కఠినంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించనున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైనవారు ఏడాదిలోపు జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో జిల్లా అధ్యక్షులను భాగస్వామ్యం చేయనున్నట్టు తెలిపారు. ఈవీఎంలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయని. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తిరిగి బ్యాలెట్ పేపర్లకు మళ్లాయని ఖర్గే చెప్పారు. మన ఎన్నికల సంఘం మాత్రం ఈ విషయాన్ని గుర్తించదని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగేలా మోదీ సర్కారు ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణ వల్ల దేశంలో రిజర్వేషన్లకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కాగా, పార్టీ సీనియర్ నేత శశి థరూర్ మాట్లాడుతూ.. ప్రజల భవిష్యత్తుకు కాంగ్రెస్ ఆశాదీపంగా ఉండాలని సూచించారు.

దేశమంతా తెలంగాణ ఫార్ములా

» సమాజంలో 90 శాతం బలహీనవర్గాలు, పేదలేనని తెలంగాణ సర్వేలో తేలింది

» వారి గోడు పట్టించుకునేవారే లేరు

» ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే కులగణన చేపట్టాల్సిందే: రాహుల్ గాంధీ

అహ్మదాబాద్, ఏప్రిల్ 9: తాము అధికారంలోకి వస్తే దేశంలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి బద్దలు కొడతామని, ఇందుకోసం తెలంగాణ ఫార్ములాను అమలు చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛపై దాడి అని అభివర్ణించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు త్వరలోనే క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనారిటీల హక్కులపై పడతాయని వ్యాఖ్యానించారు. బుధవారం ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రాహుల్ మాట్లాడారు. "నేను బలహీనవర్గాల వారి కోసం పనిచేస్తున్నాను. దేశ వనరుల్లో ఎవరి వాటా ఎంత అనేది తేలాల్సి ఉంది. అందుకు కులగణన చేయాలి. మేం తెలంగాణలో చేశాం. ఢిల్లీలో, దేశవ్యాప్తంగా కూడా చేసి చూపిస్తాం. రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం పరిమితి అడ్డుగోడను బద్దలుకొడతాం. తెలంగాణలో చేసిన కులగణనలో సమాజంలో 90% మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారని తేలింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. కానీ వారి గోడు పట్టించుకునేవారు లేరు. దేశవ్యాప్తంగా కులగణన చేపడితే ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది. నిర్ణయాధికారంలో వారి వాటా ఏమిటో వెల్లడవుతుంది" అని రాహుల్ చెప్పారు. టారిఫ్‌లపై ట్రంప్ ఒత్తిళ్లకు ప్రధాని మోదీ లొంగిపోయారని, దేశంలో ఆర్థిక తుఫాను రాబోతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "56 అంగుళాల ఛాతీ ఎక్కడ పోయింది?" అని ప్రశ్నించారు. దేశంలో పది శాతం కార్పొరేట్ శక్తుల చేతుల్లో 90 శాతం సంపద పోగుపడిందని వ్యాఖ్యానించారు.

నైరుతిలో సాధారణ వర్షపాతం!

ఆగస్టు, సెప్టెంబరులో ఎక్కువ వర్షాలు.. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా

- సీజన్ ఆశాజనకంగా ఉంటుందన్న ఇంగ్లండ్ శాస్త్రవేత్త
- ఐఎండీ బులెటిన్ వచ్చే వారం విడుదల

విశాఖపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. దీర్ఘకాల సగటు (96 నుంచి 104 శాతం)లో 103 శాతం(ఐదు శాతం అటూఇటుగా) వర్షపాతం నమోదుకానుందని ప్రకటించింది. దీర్ఘకాల సగటు అంటే జూన్ నుంచి సెప్టెంబరు వరకూ గల నాలుగు నెలల నైరుతి సీజన్‌లో 865.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాలి. అయితే 895 మి.మీ. వర్షపాతం కురుస్తుందంటూ రైతాంగానికి స్కైమెట్ తీపికబురు అందించింది. ఇంకా యూకే(యునైటెడ్ కింగ్‌డమ్) వాతావరణ శాఖ, యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ అంచనా మేరకు భారతదేశంలో సగటు, అంతకంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుందని యూకే వర్సిటీ ఆఫ్ రీడింగ్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియర్ సైన్స్ శాస్త్రవేత్త అక్షయ డియోరాన్ వెల్లడించారు. కాగా, నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి ముందస్తు అంచనా బులెటిన్‌ను భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వచ్చేవారం విడుదల చేయనుంది. గతేడాది డిసెంబరులో పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన లానినా ప్రస్తుతం బలహీనపడుతోంది. ఈ నెలలో తటస్థ పరిస్థితులు ఏర్పడి ఆగస్టు వరకూ కొనసాగుతాయని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఇప్పటికే అంచనా వేశాయి. ఎట్టి పరిస్థితుల్లో నైరుతి సీజన్‌లో ప్రతికూల ఫలితాలు ఇచ్చే ఎల్‌నినో రాదని ఇప్పటికే ఐఎండీ స్పష్టం చేసింది. దీనికితోడు ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో తటస్థంగా ఉన్న ఇండియన్ ఓషన్ డైపోల్(ఐవోడీ) జూన్‌కల్లా పాజిటివ్ దశకు చేరుకుంటుంది. పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు, హిందూ మహాసముద్రంలో జూన్ నాటికి వచ్చే పాజిటివ్ దశ వల్ల రానున్న నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని స్కైమెట్ పేర్కొంది. జూన్, జూలై కంటే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎక్కువ వర్షాలు కురుస్తాయని వివరించింది. పశ్చిమ కనుమలు, దక్షిణ భారతంలో మంచి వర్షాలు కురుస్తాయి. నైరుతి సీజన్‌లోనే కోర్ ఏరియాగా గుర్తించే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో సమృద్ధిగా వర్షాలు కురవనున్నాయి. పశ్చిమ కనుమల వెంబడి అంటే కేరళ, కోస్తా కర్ణాటక, గోవాల్లో అధిక వర్షపాతం, ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఇతర కొండ ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకానుంది.

ఏ నెలలో ఎంత వర్షపాతమంటే?

జూన్‌లో సాధారణ వర్షపాతం 165.3 మి.మీ. కురవాల్సి ఉండగా 159.7 (96 శాతం), జూలైలో 280.5 మి.మీ.కుగాను 286.1 మి.మీ (రెండు శాతం ఎక్కువ), ఆగస్టులో 254.9కి 275.3 (8శాతం ఎక్కువ), సెప్టెంబరులో 167.9కి. 174.6 మి.మీ. వర్షపాతం(4 శాతం ఎక్కువ) నమోదవుతుందని అంచనావేసింది. జూన్‌లో కేరళ, కర్ణాటక, కొంకణ్, గోవాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం, మధ్యభారతంలో సాధారణం, జూలైలో పశ్చిమ కనుమల్లో సాధారణం కంటే ఎక్కువగా, అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఆగస్టులో మధ్య తూర్పుభారతంలో సాధారణం కంటే ఎక్కువగా, దక్షిణ, ఉత్తర భారతాల్లో సాధారణంగా, సెప్టెంబరులో పశ్చిమ కనుములు, మధ్యభారతంలో సాధారణం కంటే ఎక్కువగా, కోస్తాంధ్ర, తమిళనాడు, కొంకణ్, దక్షిణ గుజరాత్‌లలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని స్కైమెట్ అంచనా వేసింది. ఎల్‌నినో రాకపోతే భారత్‌లో నైరుతి సీజన్ ఆశాజనకంగా ఉంటుందని అక్షయ డియోరాన్ వెల్లడించారు. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో ఎల్‌నినో రాదని ఐఎండీ ఇప్పటికే పేర్కొన్న నేపథ్యంలో వచ్చే వర్షాకాలంలో మంచి వర్షాలు కురుస్తాయన్నారు.

బలహీనపడిన తీవ్ర అల్పపీడనం

- నేడు కొన్ని చోట్ల వర్షాలు.. మరికొన్ని చోట్ల వడగాడ్పులు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తీవ్ర అల్పపీడనం బలహీనపడింది. అల్పపీడనంగా మారి నైరుతి బంగాళాఖాతం నుంచి బుధవారం సాయంత్రానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించిందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో ఉత్తర ఈశాన్యంగా దిశ మార్చుకుని మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో మరింత బలహీనపడుతుందని పేర్కొంది. దాని ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో బుధవారం చెదురుమదురు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రాష్ట్రంలో రానున్న రెండు రోజులు ఓ వైపు ఎండ తీవ్రత, వడగాల్పులు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 17 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, బుధవారం కర్నూలు జిల్లా ఉలిందకొండలో 40.8, ప్రకాశం జిల్లా దరిమడుగులో 40.3, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 40.1, కడప జిల్లా జమ్మలమడుగులో 39.9, అల్లూరి జిల్లా ఎర్రంపేట, నంద్యాల జిల్లా దొర్నిపాడు 39.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అదో పీడకల.. మా ఇంటి దీపం ఆరిపోయింది

- నిందితులను అందరూ చూస్తుండగా ఉరి తీయాలి
- దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల మృతుడు లక్ష్మీశ్రీనివాసరెడ్డి తల్లి పుల్లమ్మ ఆవేదన

రెంటచింతల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'అదో పీడకల. మాటలకందని విషాదం. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల నిందితులను అందరూ చూస్తుండగా ఉరితీయాలి' అని నాటి ప్రమాదంలో మృతి చెందిన బొమ్మిరెడ్డి లక్ష్మీశ్రీనివాసరెడ్డి తల్లి పుల్లమ్మ కోరారు. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల నిందితులకు తెలంగాణ హైకోర్టు మంగళవారం మరణ శిక్ష ధ్రువీకరించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాతపాలువాయి గ్రామానికి చెందిన ఆమె మాట్లాడుతూ.. ఫిబ్రవరి 21, 2013న దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద పేలుళ్లలో తన ఒక్కగానొక్క కుమారుడ్ని పొట్టనపెట్టుకున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుమారుడు మృతి చెంది 12 సంవత్సరాలైనా పోలీసు శాఖ నుంచి ఉద్యోగం కానీ, పరిహారం కానీ అందలేదన్నారు. బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న తన కుమారుడు రెడ్డి ల్యాబ్‌లో ఇంటర్వ్యూకు హాజరయ్యాడని, 2013 ఏప్రిల్లో డిగ్రీ సర్టిఫికెట్లు తీసుకుని వచ్చి ఉద్యోగంలో చేరమన్నారని.. అంతలోనే మృత్యుఒడికి చేరాడని నాటి దుర్ఘటనను ఆమె గుర్తు చేసుకున్నారు.


లక్ష్మీ శ్రీనివాసరెడ్డి


తల్లి పుల్లమ్మ

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: జూలకంటి

లక్ష్మీశ్రీనివాసరెడ్డి కుటుంబీకులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన రెంటచింతలలో మాట్లాడుతూ మృతుని తల్లిదండ్రులైన పుల్లమ్మ, కౌశిక్‌రెడ్డి పరిస్థితిని సీఎం , హోం మంత్రి, డీజీపీకి వివరిస్తానని హామీ ఇచ్చారు.

సీపీఎస్ ఉద్యోగులపై అక్రమ కేసులు ఉపసంహరించండి

వైసీపీ ప్రభుత్వంలో బనాయించిన కేసులపై డీజీపీకి ఏపీజేఏసీ వినతి

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులపై గతంలో బనాయించిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని ఏపీజేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు వినతి పత్రం అందజేసింది. ఏపీజేఏసీ చైర్మన్, ఏపీఎన్జీవోస్ అధ్యక్షుడు, కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎం దాస్‌లు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన 3,023 కేసుల వివరాలను డీజీపీకి అందించామని తెలిపారు. ఈ కేసుల విషయంలో ప్రాసెస్ చేసి త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని డీజీపీ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీపీఎస్ ఉద్యోగులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేస్తామని సీఎం చంద్రబాబు అసెంబ్లీలోనే ప్రకటించిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం కూడా దీనిపై త్వరగా నిర్ణయం తీసుకుని సీపీఎస్ ఉద్యోగులపై బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

జిల్లాల వారీగా ఉద్యాన సదస్సులు

- సీఎం నిర్దేశంతో ఆరు నెలల ప్రణాళిక సిద్ధం
- నూతన సాంకేతికతపై ప్రదర్శనలు
- పండ్ల నాణ్యత, మార్కెటింగ్ సౌకర్యాలపై దృష్టి
- రేపు చిత్తూరు జిల్లాలో మామిడి పంటపై సదస్సు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పండ్ల ఉత్పత్తులకు నాణ్యత, అదనపు విలువ, మెరుగైన మార్కెట్ కల్పించేందుకు ఉద్యానశాఖ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. ఉద్యాన రంగంలో ఉత్తమ పద్ధతులు పాటించి, రైతు సాధికారత సాధించాలన్న సీఎం చంద్రబాబు నిర్దేశం మేరకు చర్యలు చేపట్టింది. ఉద్యాన రైతులు, కొనుగోలుదారులు, శుద్ధి పరిశ్రమల నిర్వాహకులు, ఎగుమతిదారులు, పరిశోధకులు సమావేశమై, నూతన ఆవిష్కరణలపై చర్చించడానికి రానున్న ఆరు నెలలపాటు పంటల వారీగా జిల్లా స్థాయి ఉద్యాన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించడానికి ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు ప్రణాళికలు రూపొందించారు. పంట వైవిధ్యాన్ని కాపాడుతూనే రైతులకు సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించడం, పంట కోతల్లో శాస్త్రీయ విధానాలను అనుసరించి పండ్ల నాణ్యతను పెంచడం, అధిక దిగుబడినిచ్చే, వాతావరణానికి అనువైన రకాల సాగు, ఆటోమేషన్‌తో బిందు సేద్యం, డ్రోన్ల వినియోగంపై అవగాహన సదస్సులు, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఏ జిల్లాలో ఏ ఉద్యాన పంట ప్రధాన పంటగా ఉందో ఆ జిల్లాలో సదస్సు నిర్వహిస్తూ, ఇతర జిల్లాల రైతులను కూడా ఆ సదస్సులో భాగస్వామ్యం చేయనున్నారు. ఆధునిక సాగు పద్ధతులపై అభ్యుదయ రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తల సలహాలతో చర్చాగోష్ఠులు నిర్వహించనున్నారు. పండ్ల ఉత్పత్తులకు అదనపు విలువ జోడింపు, త్వరగా పాడయ్యే ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయడంపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. చిన్న, మధ్య తరహా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఎంఎస్ఎంఈ పథకాలను అనుసంధానం చేయడం, మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయం పొందటంపై మార్గదర్శకం చేయనున్నారు. ఉద్యాన పంటల్లో ప్రధానమైన మామిడి, అరటి, మిర్చి, జీడిమామిడి, కూరగాయల ఉత్పత్తుల ఎగుమతులకు అందుబాటులో ఉన్న మార్కెటింగ్ సౌకర్యాలపైనా అవగాహన కల్పించనున్నారు. పంట ఉత్పత్తుల నాణ్యత ధ్రువీకరణ ప్రక్రియలు, అంతర్జాతీయ మార్కెట్లను అనుసంధానం చేయడానికి అపెడా వంటి సంస్థల మద్దతును పొందే విధానాలపై కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సదస్సుల సందర్భంగా రైతు ఉత్పత్తిదారులు, భారీ కొనుగోలుదారులు, ఇతర ఏజెన్సీలతో ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంది.

ఉద్యాన సదస్సుల షెడ్యూల్ ఇదీ..

ఈనెల 11న చిత్తూరులో మామిడి, 17న కడపలో అరటి, నారింజ, 22న ఏలూరులో ఆయిల్‌పామ్, 26న శ్రీకాకుళంలో జీడిమామిడి, 29న నంద్యాలలో అరటి, ఉల్లి, మే 8న తిరుపతిలో తోతాపురి మామిడి, 15న శ్రీసత్యసాయిజిల్లాలో దానిమ్మ, బత్తాయి, 22న కర్నూలులో ఉల్లి, టమాటా, జూన్ 3న తూర్పుగోదావరిలో అరటి, కొబ్బరి, కోకో, 10న ఎన్టీఆర్ జిల్లాలో మామిడి, విర్చి, 17న అన్నమయ్య జిల్లాలో అరటి, మామిడి, బొప్పాయి, టమాటా, 24న అల్లూరి జిల్లాలో జీడిపప్పు, పసుపు, నల్ల మిరియాలు, జూలై 1న విశాఖలో కూరగాయలు, 8న బాపట్లలో మిర్చి, పసుపు, మామిడి, 15న కోనసీమలో కొబ్బరి, అరటి, 22న నెల్లూరులో నారింజ, మామిడి, 29న పశ్చిమగోదావరిలో కొబ్బరి, కోకో, కూరగాయలు, ఆగస్టు 5న అనకాపల్లిలో జీడిమామిడి, కొబ్బరి, 12న కాకినాడలో మామిడి, జీడిమామిడి, ఆయిల్‌పామ్, కొబ్బరి, 19న విజయనగరంలో మామిడి, జీడిమామిడి, ఆయిల్‌పామ్, కోకో, 26న మన్యంలో జీడిపప్పు, అరటి, ఆయిల్‌పామ్, సెప్టెంబరు 2న కృష్ణా జిల్లాలో మామిడి, పసుపు, 9న గుంటూరులో మిర్చి, 16న ప్రకాశం జిల్లాలో మిర్చి, బత్తాయి. 23న పల్నాడులో మిర్చిపై సదస్సులు నిర్వహించనున్నారు. ఈనెల 26 లేదా 28న విజయవాడలో కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్‌పై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని భావిస్తున్నారు.

నవజాత శిశువులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల అనారోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది. విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆ తర్వాత ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రుల్లోని నవజాత శిశువుల విభాగాలను సందర్శించి అక్కడి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్నట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు పని చేస్తున్న తమ కమిషన్ ఆసుపత్రుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా శివప్రసాద్

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ఎం.శివప్రసాద్ నియమితులయ్యారు. ఈ స్థానంలో పనిచేస్తున్న రాజాబాబు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్‌కు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ ఐసెట్‌కు 35,000 దరఖాస్తులు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే ఏపీ ఐసెట్-2025కు దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసిందని కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.శశి తెలిపారు. ఇప్పటివరకూ 35 వేల దరఖాస్తులు వచ్చినట్టు ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.1000 అపరాధ రుసుముతో ఈ నెల 14వరకు, రూ.2 వేలతో 19 వరకు, రూ.4 వేలతో 24 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మే రెండో తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, ఏడో తేదీన రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష జరుగుతుందని వెల్లడించారు.

మేదర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మేదర సంఘీయులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆంధ్రప్రదేశ్ మహేంద్ర(మేదర) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావు కోరారు. గుంటూరులో బుధవారం ఏపీ మేదర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్ర అధ్యక్షుడుగా జొరిగె మస్తాన్‌రావు(వినుకొండ), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగేంద్ర(అనంతపురం), కోశాధికారి శిరిగిరి మంగారావు(ఏలూరు), ప్రచార కార్యదర్శి పిల్లి మాణిక్యాలరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా టీ నారాయణమ్మను ఎన్నికయ్యారు.

ఇండోసోల్‌కు సోమశిల నుంచి ఏటా 1.48 టీఎంసీలు

- జల వనరుల శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎస్‌పీఎల్)కు సోమశిల రిజర్వాయరు నుంచి ఏటా 1.48 టీఎంసీల నీరు సరఫరా చేయాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. ఇంటిగ్రేటెడ్ సోలార్ ప్యానళ్ల తయారీ ప్లాంటును, సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నందుకు గాను పారిశ్రామిక విధానంలో భాగంగా ఈ సంస్థకు నీటిని కేటాయించాలని నిశ్చయించినట్లు పేర్కొంటూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీ.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. నీటి సరఫరాకు అవసరమైన కార్యాచరణ చేపట్టేలా ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు ఆదేశాలివ్వాలని ఇంజనీర్-ఇన్-చీఫ్(ఈఎన్‌సీ)ని ఆదేశించారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పంచాయతీ కార్యదర్శి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెండైన మహేశ్వరయ్యను ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తిరుపతి ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో మంగళ, బుధవారాల్లో తిరుపతి, పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరులో అధికారుల బృందాలు ఏక కాలంలో సోదాలు చేశాయి. మహేశ్వరయ్యకు రూ.85 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. బుధవారం తనిఖీల్లోనూ కొన్ని డాక్యుమెంట్లను, అర కిలో బంగారాన్ని సీజ్ చేసినట్టు తెలిసింది. ఇప్పటి వరకు మహేశ్వరయ్య రూ.2,70,62,206 అక్రమార్జనకు పాల్పడినట్టు తేలిందని ఏసీబీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహేశ్వరయ్యను అరెస్టు చేసి నెల్లూరులోని అవినీతి నిరోధక శాఖ న్యాయస్థానం ఎదుట హాజరపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు అదనపు ఎస్పీ విమలకుమారి చెప్పారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రభుత్వాలే సుప్రీం

అక్కడ వేరొకరు గనుక ఉండివుంటే, ఇన్నిమాటలు పడ్డాక కూడా ఇంకా ఆ కుర్చీని పట్టుకొనివేలాడేవారు కాదు. తమిళనాడు గవర్నర్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఈ తరహా వ్యాఖ్యలు అనేకం వినబడుతున్నాయి. రవి తక్షణమే రాజీనామా చేయాలని డిఎంకె నాయకులు అనడమే కాదు, ఇంకా కొనసాగడం ఆయనకంటే ఆ పదవికే అవమానకరమన్న వ్యాఖ్యలు ప్రజాస్వామికవాదులనుంచి, రాజ్యాంగం మీద గౌరవాభిమానాలున్నవారినుంచి కూడా వినబడుతున్నాయి. న్యాయస్థానాలనుంచి ఈ తరహా తీర్పులు, కఠిన వ్యాఖ్యలు నిజంగానే విపక్షపాలిత గవర్నర్లను అవమాన భారంతో కుదిపేయగలిగితే రవి వంటివారి ఆవిర్భావమే ఉండేది కాదు. గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సిరావడం నిజానికి సర్వోన్నత న్యాయస్థానానికే పెద్ద పరీక్ష.

ఇది తమిళనాడు గవర్నర్‌కు మాత్రమే పరిమితమైన తీర్పు కాదు. విపక్షపాలిత రాష్ట్రాల్లో రవి తరహా గవర్నర్లు పెడుతున్న బాధలను అనుభవిస్తున్న పార్టీలకు ఈ తీర్పు ఎక్కడలేని శక్తినీ, ఉత్సాహాన్నీ ఇచ్చింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు, రాష్ట్రాలకు అతీతులమన్న తరహాలో వ్యవహరిస్తున్న గవర్నర్లకు ఘాటైన హెచ్చరిక ఇది. వారి అధికారాలను, పరిధిని, పాటించాల్సిన ధర్మాన్ని గుర్తుచేస్తూ, లక్ష్మణరేఖ దాటవద్దని చెబుతున్న తీర్పు ఇది. రాజ్యాంగం ఆశయాలను ఎత్తిపడుతూ, ఫెడరల్ వ్యవస్థను పునాది దిట్టం చేసేందుకు ఈ తీర్పు ఉపకరిస్తుంది. ఓ పది బిల్లులను రాష్ట్రపతికి నివేదించడంలో సదరు గవర్నర్ కుట్రను తప్పుబట్టడానికే సుప్రీంకోర్టు పరిమితం కాలేదు. నిర్దిష్టకాల పరిమితిలో ఆమోదించకుండా, శాసనసభ రెండోసారి పంపినా సంతకం చేయకుండా ఆ గవర్నర్ కుట్రలు చేసిన బిల్లులమీద సుప్రీంకోర్టే నిర్ణయం తీసుకుంది. గవర్నర్ చర్యలన్నింటినీ రద్దుపరిచి, 142వ అధికరణద్వారా తనకు దఖలుపడిన ప్రత్యేకాధికారాలను అందుకు వినియోగించుకుంది. అసెంబ్లీ రెండవసారి పంపిన బిల్లులను సైతం ఆమోదించకుండా, వాటిని రాష్ట్రపతికి నివేదించి గవర్నర్ అతితెలివి ప్రదర్శిస్తే, దానినే గడువుగా తీసుకొని ఆ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టుగా కోర్టు నిర్ధారించడం సముచితమైన చర్య. దుష్ట చేష్టలను వమ్ముచేయాలన్నా, కృత్రిమ సంక్షోభాలను పరిష్కరించాలన్నా ఈ తరహా సాహసోపేతమైన నిర్ణయాలు తప్పవు. ఇలా, గవర్నర్ ఆమోదం లేకుండా బిల్లులు చట్టాలు కావడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు.

బిల్లు ఆమోదానికి నిర్దిష్ట కాలపరిమితి లేకపోవడం రవి తరహా గవర్నర్లకు అధికారపక్షాన్ని వేధించడానికి బ్రహ్మాస్త్రంలాగా ఉపకరిస్తోంది. ఇప్పుడు, ఆమోదానికీ, తిరస్కారానికీ, రాష్ట్రపతి నివేదనకు కాలపరిమితులు విధించడం, ఏ ముచ్చటైనా మూడునెలల్లో జరగాలని కోర్టు శాసించడం బాగుంది. మళ్ళీ తనముందుకు మరోమారు యథాతథంగా వచ్చిన బిల్లును నెలరోజుల్లోగానే ఆమోదించాలనడం, ఆమోదం పొందినట్టుగానే పరిగణించాలనడం సముచితంగా ఉంది. ఈ కాలపరిమితులను దాటితే గవర్నర్ల చర్యలు న్యాయసమీక్షకు నిలవాల్సి వస్తుందన్న హెచ్చరిక అవసరమైనదే. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న రవివంటివారి వల్లనే ఆ ఉన్నత వ్యవస్థకు సర్వోన్నత న్యాయస్థానం ఇలా గడువులు విధించాల్సి వచ్చింది. ఇప్పటికే పలుమార్లు హితవులు చెప్పినా, హెచ్చరించినా నడవడిక మార్చుకోకుండా రాజ్యాంగాతీత శక్తులుగా తయారైనవారిని ఇలా దారికి తేవాల్సి వస్తున్నది.

కేంద్రప్రభుత్వం నియమించే గవర్నర్లకంటే, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే ఉన్నతమైనవని కోర్టు తేల్చింది. మీకు వీటో అధికారాలు లేవు అంటూ, రాష్ట్ర ప్రభుత్వాలకు, వాటిని ఎన్నుకున్న ప్రజలకు గవర్నర్‌లు జవాబుదారీగా ఉండాల్సిందేనని స్పష్టంచేసింది. తాము ఏదో పైనుంచి దిగివచ్చినట్టుగా, ప్రత్యేకాధికారాలు ఉన్నట్టుగా వ్యవహరిస్తూ, ఎన్నికల్లో నెగ్గివచ్చిన విపక్షపార్టీల ప్రభుత్వాలను ఇరకాటంలో పెడుతున్న గవర్నర్లకు ఈ తీర్పులో సరిపడినన్ని చీవాట్లున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలకు మిత్రుడిగా, మార్గదర్శిగా వ్యవహరించాలంటూ చెప్పిన బోలెడు హితవులూ ఉన్నాయి. ప్రజాస్వామ్యానికీ, సమాఖ్యవ్యవస్థకు సత్తువనిచ్చే తీర్పు ఇది. రవి తరహాలో పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరించే గవర్నర్లందరికీ చెంపపెట్టు. అటువంటి వారికి వెన్నుదన్నుగా నిలుస్తూ, భుజం తట్టి ప్రోత్సహిస్తూ, ప్రమోషన్లు ఇస్తున్న ఢిల్లీ పెద్దలకు ఎదురుదెబ్బ.


'ఎన్‌ఈపీ'పై విమర్శలు రాజకీయం మాత్రమే!

ప్రపంచంలో ఎన్నో దేశాల్లో అక్షర జ్ఞానం అడుగులు పడకముందే మనం నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాం. మన ఆచార వ్యవహారాలన్నింటిలో శాస్త్ర విజ్ఞానం నిగూఢంగా నిక్షిప్తమై ఉంది. ఇంతటి గొప్ప వారసత్వాన్ని సొంతం చేసుకున్న భారతీయ విద్య విదేశీ దండయాత్రలతో తన ప్రాభవం కోల్పోయింది. ముఖ్యంగా దాదాపు రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పాలనలో మన విద్యా వ్యవస్థ తీవ్రంగా విధ్వంసమైంది.

స్వాతంత్ర్యం వచ్చాక కూడా దురదృష్టవశాత్తూ ఆంగ్లేయులు అందించిన విద్యావిధానాలనే కొనసాగిస్తూ వచ్చాం. భారతీయతకు పెద్దపీట వేసి మనదైన సొంత విద్యావిధానాన్ని రూపొందించుకోవడంలో విఫలమయ్యాం. 1948లో స్వేచ్ఛాయుత భారతదేశ అవసరాలను తీర్చే విద్యా వ్యవస్థను నిర్మించే నిమిత్తం రాధాకృష్ణన్ కమిషన్ ఏర్పాటైంది. బ్రిటిష్, మెకాలే విద్యా విధానాలను రూపుమాపి, భారతీయ విలువలతో కూడిన విద్యావిధానం ప్రవేశపెట్టేందుకు మంచి అవకాశం ఈ కమిషన్‌కు లభించింది. కానీ, నాటి సామాజిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాలు తదితర కారణాలతో అది సాధ్యపడలేదు.

రాజ్యాంగ సభలో అధికార భాషపై చర్చ జరిగినపుడు హిందీని అధికారిక భాషగా ప్రకటించాలని చాలామంది సిఫార్సు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 'హిందుస్తానీ' (హిందీ, ఉర్దూ కలిసి ఉండే భాష)ని సూచించారు. చివరకు మున్షీ–అయ్యంగార్ ఫార్ములా ప్రకారం దేశంలో అత్యధిక మంది మాట్లాడే హిందీని అధికారిక భాషగా నిర్ణయించారు. హిందీతో పాటు ఒక పదేళ్ల వరకు ఇంగ్లీష్‌ను కూడా అధికార భాషగా అమలు చేయాలని, పదేళ్ల తర్వాత కేవలం హిందీని అధికార భాషగా కొనసాగించాలని నిర్ణయించారు. పదేళ్ల అనంతరం 1958 ప్రాంతంలో హిందీయేతర రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలో 'అంగ్రేజీ హటావో' నినాదాలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో నాటి ప్రధాని నెహ్రూ 1961లో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో 'చీఫ్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్' నిర్వహించారు. ఆ కాన్ఫరెన్సులోనే త్రిభాష సూత్రం ప్రతిపాదన వచ్చింది. దాని ప్రకారం పదేళ్ల వరకే అని ముందుగా అనుకున్నప్పటికీ, ఇప్పటికీ అధికార భాషగా ఇంగ్లీషును కొనసాగిస్తూ వచ్చారు. త్రిభాష సూత్రం ప్రకారం హిందీ, ఇంగ్లీషుతో పాటు మరొక భాష, అంటే ఆయా ప్రాంతం మాతృభాషను సబ్జెక్టులుగా ప్రవేశపెట్టారు. నాడు నెహ్రూ ప్రవేశపెట్టిన త్రిభాషా సూత్రాన్ని నేడు మోదీ ప్రభుత్వం మరింత మెరుగుపరిస్తే, దానిని తప్పుబట్టడం అర్థరహితం.

1964లో ఏర్పాటైన కొఠారీ కమిషన్ 1966లో నివేదికను సమర్పించింది. దీని ఆధారంగా స్వతంత్ర భారతంలో 1968లో తొలిసారి జాతీయ విద్యావిధానం రూపొందించారు. 1986లో నాటి జాతీయ విద్యావిధానంలో కొన్ని సవరణలు తీసుకొచ్చారు. మరిన్ని మార్పుల కోసం 1990లో రామ్మూర్తి కమిటీ ఏర్పాటైంది. 2005లో ఏర్పాటైన నాలెడ్జ్ సెంటర్ ఆఫ్ ఇండియా 2009లో తన నివేదికను సమర్పించింది. ఇవన్నీ ఆంగ్లేయుల ఆలోచన విధానంలో జరిగిన ప్రయత్నాలే. వీటిలో విద్యలో భారతీయ మూలాలను పాదుకొల్పాలన్న దృక్పథం కొరవడింది. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వలస పాలకుల వాసనలను వదిలించుకునే దిశగా అనేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భారతీయ విజ్ఞానానికి పెద్దపీట వేస్తూనే, ప్రస్తుత ఏఐ జనరేషన్ అవసరాలనూ తీర్చేలా, కస్తూరి రంగన్ నేతృత్వంలో విస్తృత సంప్రదింపుల తర్వాత నూతన జాతీయ విద్యా విధానం–2020 (ఎన్‌ఈపీ–2020)ను ప్రవేశపెట్టింది.



భారతీయతకు పట్టం కడుతూ ఆధునిక అవసరాలను తీర్చే, భావి పౌరులను తీర్చిదిద్దే నూతన విద్యా విధానం–2020ను తప్పుబట్టడంలో అర్థం లేదు. రాజకీయంగా మోదీని, బీజేపీని వ్యతిరేకించాలన్న ఆదుర్దాతో ఒక మంచి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడడం, కట్టుకథలు అల్లి ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం ఎంతమాత్రం భావ్యం కాదు.

మోదీ ప్రభుత్వం ఏం చేసినా తప్పుబట్టడమే పనిగా పెట్టుకున్న కొందరు సూడో మేధావులు, కొన్ని పార్టీలు యథావిధిగా ఎన్‌ఈపీ–2020 పైనా విమర్శలు ఎక్కుపెట్టాయి. త్రిభాషా సూత్రం, విద్యను కేంద్రీకృతం చేయడం, మతం రంగు పులమడం అన్న మూడు 'లోపాలు' వారికి ప్రధానంగా కనిపించాయి. త్రిభాషా సూత్రాన్ని బూచిగా చూపి, హిందీయేతర రాష్ట్రాలపై కేంద్రం హిందీని, సంస్కృతాన్ని రుద్దుతుందంటూ తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు. త్రిభాష సూత్రం ప్రస్తుత ఎన్‌ఈపీ–2020 తీసుకొచ్చినదేమీ కాదు, గతంలో ఉన్న విధానమే. ఇంకా చెప్పాలంటే పాత పద్ధతిని మరింత మెరుగుపర్చింది. పాత విధానంలో హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరి చేసి మాతృభాష కోసం మరొక భాషను ఎంచుకునే అవకాశం ఇస్తే, ఇప్పుడు కనీసం రెండు భారతీయ భాషలను తప్పనిసరి చేస్తూ ఏవైనా మూడు భాషలనూ ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పిస్తుంది. ఉదాహరణకు హైదరాబాదులో చదువుకునే ఒక బెంగాలీ విద్యార్థి ఇంగ్లీషుతో పాటు తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు, లేదా హిందీ, తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు.

3–8 ఏళ్ల వరకు మాతృభాషలోనే విద్యా బోధన జరగాలని ఎన్‌ఈపీ–2020 ప్రతిపాదిస్తుంది. మాతృభాషలో బోధన జరిగితే విద్యార్థి పాఠ్యాంశాన్ని తొందరగా, సమగ్రంగా అకళింపు చేసుకోగలుగుతాడు. ఇతర భాషలో బోధన జరిగితే విషయాలను అర్థం చేసుకోవడం కన్నా, భాషను అర్థం చేసుకోవడమే పెద్ద సవాలుగా మారుతుంది. ముప్పు ఎదుర్కొంటున్న గిరిజన భాషల్లోనూ విద్యా బోధన జరగాలనేది మోదీ ప్రభుత్వం ఆకాంక్ష. తద్వారా ఆయా గిరిజన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమవడమే కాకుండా, గిరిజన భాషను పరిరక్షించవచ్చు అనేది అభిప్రాయం. ఇప్పటివరకు ఇంగ్లీష్‌లోనే అందుబాటులో ఉన్న మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి సబ్జెక్టులను సైతం భారతీయ భాషల్లోనూ తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వాస్తవం ఇలా ఉంటే నూతన విద్యా విధానం ద్వారా మోదీ ప్రభుత్వం హిందీని బలవంతాన రుద్దుతున్నారనడం శుద్ధ అబద్ధం.

సంస్కృతం దైవభాషగా ప్రసిద్ధి. పురాణేతిహాసాలన్నీ సంస్కృతంలోనే రచించారు. భారతీయ సంస్కృతి అందించిన గొప్ప వారసత్వమైన ఈ భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ఎన్‌ఈపీ–2020లో విద్యార్థులు సంస్కృతాన్ని కూడా ఒక భాషగా ఎంచుకునే అవకాశం కల్పించారు. కానీ తప్పనిసరి చేయలేదు. ప్రపంచమే కుగ్రామంగా మారిన ఈ ఇంటర్నెట్ యుగంలో టీచర్ సాయం లేకుండానే ఒక భాష నేర్చుకునేందుకు కావాల్సిన వనరులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొలిసారి 8వ తరగతి ఆ పై స్థాయి విద్యార్థులు ఇంగ్లీషేతర విదేశీ భాషలు– జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్, కొరియా లాంటి భాషలను సబ్జెక్టులుగా ఎంచుకునే అవకాశం ఎన్‌ఈపీ–2020 కల్పించింది. విద్యార్థులు ఈ విదేశీ భాషలను సబ్జెక్టుగా ఎంచుకునేందుకు ఎంత స్వేచ్ఛ ఉంటుందో, సంస్కృతంను ఎంచుకునేందుకూ అంతే స్వేచ్ఛ ఉంటుంది. అంతేకాని, సంస్కృతంను బలవంతాన రుద్దుతున్నారన్న వాదనకు తావులేదు.

విద్యను కేంద్రం గుప్పిట పెట్టుకుని, పాఠ్యాంశాలను రాష్ట్రాలపై బలవంతాన రుద్దుతుందనేది సోకాల్డ్ మేధావుల మరో ఆరోపణ. ఇది పూర్తిగా అవాస్తవం. ఎన్‌ఈపీ–2020 స్థానికతకు, స్థానిక భాషలకు అధిక



ప్రాధాన్యమిస్తున్నది. స్థానిక జీవన విధానం, చరిత్ర, ఆర్థిక పరిస్థితులు, అవసరాల మేరకు రాష్ట్రాలు సొంతంగా పాఠ్యాంశాలను రూపొందించుకోవచ్చు. ఇందులో కేంద్రం ఎలాంటి ఒత్తిడి చేసే అవకాశం లేదు. అంతేకాదు, ఈ ఎన్‌ఈపీ–2020నే అటానమస్ హోదా పొందడాన్ని సులభతరం చేసింది. స్వయం ప్రతిపత్తి పొందిన కాలేజీలు, విద్యా సంస్థలు స్థానిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికను రూపొందించుకునే వెసులుబాటు కల్పించింది.

భారతదేశంలో 61.6శాతం పాఠశాలలు త్రిభాషా విధానాన్ని అమలుచేస్తున్నాయి. 74.7శాతం మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇదే తమిళనాడులో 3శాతం పాఠశాలలు, కేవలం 10.8శాతం మంది విద్యార్థులు మాత్రమే దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. అంటే.. తమిళనాడులో కేవలం పార్టీల రాజకీయం కారణంగా 90శాతం మంది విద్యార్థులు ఇతర భాషలను నేర్చుకోలేకపోతున్నారు. దీనివల్ల ఆయా పార్టీలు సాధించేదేమీ లేకపోయినా.. విద్యార్థులకు మాత్రం నష్టం వాటిల్లుతోంది. ఇటీవల విడుదలైన ASER (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్) నివేదిక ప్రకారం.. 2005లో ఈ నివేదిక ఇవ్వడం మొదలైనప్పటి నుంచి ఉన్న పరిస్థితులతో పోలిస్తే.. 2024 నాటికి (NEP అమలు కారణంగా) ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో నేర్చుకునే తత్వం మెరుగుపడిందని వెల్లడైంది.

విద్యకు మతం రంగు అనేది మరొక ఆరోపణ. దేశ స్వాతంత్ర్యానంతరం విద్యారంగంలో విదేశీ భావజాలం గల వ్యక్తులే కీలక స్థానాలను చేజిక్కించుకున్నారు. వీరు పక్షపాత వైఖరితో చరిత్ర పాఠ్యాంశాలను రూపొందించారు. ఇప్పటివరకు మన దేశంపై దండెత్తిన దురాక్రమణదారులను కీర్తిస్తూ చరిత్ర పుస్తకాల్లో స్థానం కల్పించారు, కానీ వారిని ఎదురించిన వీరులకు, అంతకుముందున్న సుసంపన్న వారసత్వ చరిత్రకు చోటు కల్పించలేదు. పాశ్చాత్యుల చరిత్రనే భారత చరిత్రగా నమ్మబలికారు. నా వ్యక్తిగత అనుభవమే తీసుకుంటే మా పిల్లల చరిత్ర పుస్తకాల్లో ఫ్రెంచ్ విప్లవం, రోమన్ సామ్రాజ్యం, జర్మనీ ఏకీకరణ వంటి సంఘటనలపై పాఠ్యాంశాలున్నాయే కానీ, నిజాం నుంచి విమోచనం పొంది భారతదేశంలో విలీనమైన నా తెలంగాణ గడ్డ చరిత్ర గురించి ఒక్క పాఠ్యాంశమూ లేదు. ఇలాంటి పక్షపాత వైఖరిని రూపుమాపి అసలైన భారతీయ చరిత్రకు పెద్దపీట వేయాలన్న ప్రయత్నంలో కొన్ని కొత్త చరిత్ర పాఠాలను ప్రవేశపెడితే ఈ సోకాల్డ్ మేధావులు తప్పులు వెతుకుతున్నారు.

భారతీయతకు పట్టం కడుతూ ఆధునిక అవసరాలను తీర్చే భావి పౌరులను తీర్చిదిద్దే నూతన విద్యా విధానం–2020ను తప్పుబట్టడంలో అర్థం లేదు. రాజకీయంగా మోదీని, బీజేపీని వ్యతిరేకించాలన్న ఆదుర్దాతో ఒక మంచి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడడం, కట్టుకథలు అల్లి ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం ఎంతమాత్రం భావ్యం కాదు.

• జి. కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

నీ ఋణం తీర్చుకోగలమా బాబు..!

గత సంవత్సరం ఆగస్టు 1న వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు కార్యాచరణలో భాగంగా 2024 నవంబర్ 15న విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో వన్ మాన్ కమిషన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ కమిషన్ అదే నెల 27న బాధ్యతలు స్వీకరించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి, 3,820 వినతులను స్వీకరించి, దళితుల స్థితిగతులను అధ్యయనం చేసి, ఎస్సీలను మూడు గ్రూపులుగా చేసింది. A గ్రూపులో రెల్లి, ఉపకులాలకు ఒక శాతం, B గ్రూపులో మాదిగ, వారి ఉప కులాలకు 6.5 శాతం, C గ్రూపులో మాల, వారి ఉప కులాలకు 7.5% కేటాయించాలని సిఫారసు చేసి, తన నివేదికను మార్చి 10, 2025న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. మార్చి 17న రాష్ట్ర మంత్రివర్గం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫారసులను ఆమోదించి, మార్చి 20న అసెంబ్లీలో వర్గీకరణపై విధాన నిర్ణయాన్ని ప్రకటించింది.

ఎస్సీ వర్గీకరణకు తెలుగుదేశం పార్టీ కృషి చేసినంతగా మరే పార్టీ చేయలేదంటే అతిశయోక్తి కాదు. గతంలో కూడా దళితుల అసమానతలు తెలుసుకోవడానికి 1996 సెప్టెంబర్ 10న జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను చంద్రబాబు నియమించారు. ఆ కమిషన్ ఎస్సీల్లో అసమానతలు నిజమేనని గుర్తించి, 1997 మే 28న ఎస్సీలను ఎ, బి, సి, డి లుగా వర్గీకరించాలని, A గ్రూపులో రెల్లి, ఉప కులాలకు ఒక శాతం, B గ్రూపులో మాదిగ, ఉప కులాలకు 7 శాతం, C గ్రూపులో మాల, ఉపకులాలకు 6 శాతం, D గ్రూపులో ఆది ఆంధ్ర కులానికి ఒక శాతం కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దరిమిలా చంద్రబాబు ప్రభుత్వం 1997 జూన్ 6న ఎస్సీలను ఎ, బి, సి, డి లుగా వర్గీకరిస్తూ ఆర్డినెన్స్ విడుదల చేసింది. అయితే జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించలేదన్న కారణంతో 1997 సెప్టెంబర్ 18న రాష్ట్ర హైకోర్ట్ ఆ ఆర్డినెన్సు కొట్టివేసింది. తర్వాత చంద్రబాబు నాయుడు 2000 సంవత్సరం మే నెలలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని చేశారు. దీంతో 2000–2004 సంవత్సరాల మధ్యకాలంలో మాదిగలు 24 వేల పైచిలుకు ఉద్యోగాలు పొందారని గణాంకాలు చెప్తున్నాయి.

అయితే 2004లో చంద్రబాబు అధికారం కోల్పోయిన తర్వాత నవంబర్ 6, 2004న రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారం లేదని సుప్రీంకోర్టు ఈవి చిన్నయ్య Vs ఆంధ్రప్రదేశ్ కేసులో చంద్రబాబు చేసిన చట్టాన్ని కొట్టేసింది. 2004లో చంద్రబాబు అధికారం కోల్పోవడం వల్ల మాదిగ జాతి తీవ్రంగా నష్టపోయిందని ఇప్పటికీ మాదిగలు బలంగా నమ్ముతారు. 2004లో ఏ సుప్రీంకోర్టు అయితే రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం లేదని చెప్పి చంద్రబాబు చేసిన చట్టాన్ని కొట్టేసిందో, 20 ఏళ్ల తర్వాత అదే సుప్రీంకోర్టు రాష్ట్రాలు వర్గీకరణ చేయవచ్చు అని తెలిపింది. దీని ద్వారా 20 ఏళ్ల క్రితం చంద్రబాబు చేసిన వర్గీకరణ చట్టం న్యాయమని చెప్పకనే చెప్పింది. అలాగే 2014–2019 మధ్య చంద్రబాబు నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళితుల జనాభా నిష్పత్తి ఆధారంగా నిధులు ఖర్చు చేయడానికి జీవో నెంబర్ 25 విడుదల చేసి, అమలు చేశారు.

మాదిగల దశాబ్దాల కల అయిన ఎస్సీ వర్గీకరణను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా వర్గీకరణ అమలు చేయనున్న ఘనత చంద్రబాబుకే దక్కింది. సామాజిక నిచ్చెనమెట్ల వ్యవస్థలో అణగదొక్కబడిన దళితుల్లో కూడా వైరుధ్యాలు ఉన్నాయని గుర్తించి, అందరికీ సమానత్వం అనే సత్యాన్ని వర్తింపచేయడానికి ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుపై కొన్ని పార్టీలు అపోహలు రేకెత్తించిన కారణంగా దళితుల్లో ఒక వర్గం ఆ పార్టీకి దూరం కావడం బాధాకరం. అయినప్పటికీ మాదిగలకు ఇచ్చిన మాట కోసం, సామాజిక న్యాయం కోసం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణపై చేసిన కృషికి మాదిగలు జీవితాంతం ఆయనకు ఋణపడి ఉంటారనడంలో సందేహం లేదు. నిజానికి వర్గీకరణ వల్ల ఏ వర్గానికి నష్టం జరగదు. ఆయా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కోటా కేటాయింపులు జరుగుతాయి.

– గెడ్డం గణేష్
మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకుడు

'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సభ

సుమారు 20 నవలలు రాసి, ఒక రచయితనని ప్రచారం చేసుకోవటం పట్ల ఏ మాత్రం ఆసక్తి లేని వ్యక్తి కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి. ఆయనకు బడుగు జీవులతో కలిసిమెలిసి జీవించడమే ప్రాణ సమాన కార్యకలాపం. అలాంటి వ్యక్తి ప్రజా ఉద్యమకారుడు కూడా అయితే! అందుకు అతను పొందిన పురస్కారం ఎన్‌కౌంటర్ హత్య! విశ్వమోహనరెడ్డి తన తొలి రచనా కాలంలో పుంఖాను పుంఖాలుగా డిటెక్టివ్ నవలలు రాశారు. వాస్తవ రహిత, ఆధార రహిత అభూతకల్పనలు రాయబోనని చెప్పిన ఆయన, చివరికంటా అందుకు కట్టుబడి నిలబడ్డాడు. ఆయన మానవహోమం నవల 'భోగిమంటలు' సినిమాగా విడుదలైంది. అతివాద రాజకీయాలను వదిలి ప్రజా ఉద్యమ కార్యకలాపాలలోకి నడిచి పిడుగురాళ్ళలో సున్నపురాయి కార్మికులను సంఘటితపరిచాడు. రైతుకూలీ సంఘాలు నిర్మించాడు. రాజుపాలెం నుంచి త్రిపురాంతకం దాకా రైతు కూలీలను ఉద్యమంగా ఉవ్వెత్తున కదిలించాడు. ఉద్యమకారుడుగా ప్రజల హృదయాలలోను, సాహిత్యకారునిగా పాఠకుల మనసులలోనూ జీవిస్తున్న విశ్వమోహన్ రెడ్డిని, ఆయన వ్యక్తిత్వాన్ని, సాహిత్యోద్యమ కృషిని తలచుకుంటూ 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సభ జరుగనున్నది. ఏప్రిల్ 11న సాయంత్రం ఐదు గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్, 5వ లైనులోని సీనియర్ సిటిజన్స్ సేవాకేంద్రంలో జరిగే ఈ సభలో బి.అరుణ, డా. బీరం సుందరరావు, వల్లూరు శివప్రసాద్, నల్లూరి రుక్మిణి, టి. శ్రీదేవి, దివికుమార్ పాల్గొంటారు.

– జనసాహితి

'వైకుంఠపురం' అమరావతికి జలహారం!

గుంటూరు జిల్లా, అమరావతి మండలం వైకుంఠపురం శ్రీ వెంకటేశ్వరుని పాదాల చెంత 2018లో బ్యారేజ్ నిర్మాణం చేపట్టింది అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం. వరదల సమయంలో వృథాగా పోతున్న కృష్ణా జలాలను ఒడిసి పట్టడానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన నుంచి పుట్టిందే ఈ బ్యారేజ్ నిర్మాణం. ఇది పూర్తి అయితే బహుళ ప్రయోజనాలు చేకూరేవి. ఈ ప్రాజెక్టుకు 2018 ఫిబ్రవరి 13న చంద్రబాబు శంకుస్థాపన చేశారు. కృష్ణా జలాలను ఒడిసి పట్టేందుకు 10 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టుకు రూ.2,169 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. టెండర్లు కూడా పిలిచి పనులు కూడా ప్రారంభించింది తెలుగుదేశం ప్రభుత్వం. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా నిర్మాణ పనులు నిలివేసింది. వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణం సాకారమై ఉంటే నేడు రైతులకు వరప్రదాయిని అయ్యేది.

బ్యారేజ్ నిర్మాణం చేస్తే, లోకల్ క్యాచ్‌మెంట్ ద్వారా ఆగస్టు 15 నుంచి అక్టోబర్ వరకు ఉపనదులు మున్నేరు, పాలేరు, కట్టలేరు, ఇతర వాగుల నుంచి వచ్చే వరద నీటిని నిల్వ చేసుకొని సాగునీటికి వినియోగించుకోవచ్చు. విజయవాడ–గుంటూరు, అమరావతి, చుట్టుపక్కల ఎగువ ప్రాంతాల మండలాలకు స్థిరమైన సాగు, తాగు నీరు సౌకర్యం కల్పించవచ్చు. భూగర్భ జలమట్టం పెరుగుతుంది. పర్యాటకం, నావిగేషన్ మెరుగుపరచవచ్చు. చేపల పెంపకం, హార్టీకల్చర్ అభివృద్ధి చెందుతుంది. కృష్ణా డెల్టా కింద 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చు. గోదావరి–పెన్నా నదుల అనుసంధానానికి ఉపయోగం. పులిచింతల నుంచి 62 కిలోమీటర్ల దూరంలో వైకుంఠపురం, అక్కడ నుంచి 23 కి.మీ దిగువకు ప్రకాశం బ్యారేజ్, అక్కడ నుంచి 12 కి.మీ దిగువకు చోడవరం బ్యారేజ్ ఉంటాయి. మొత్తం 97 కిలోమీటర్లు మేర నదిలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉంటుంది. అమరావతిని అందమైన నగరంగా నిర్మించాలన్నది అసలు ప్రణాళిక.

ఇరవై ఏళ్ళ నుంచి ఇసుక క్వారీయింగ్ మూలంగా కృష్ణా జిల్లా వైపు కాసరబాద గ్రామం వద్ద పెద్ద ఎత్తున రెండు కిలోమీటర్లు మేర ఇసుక మేట వేయడంతో కృష్ణా నది ప్రవాహం మొత్తం గుంటూరు జిల్లా వైపు మళ్లింది. దీంతో కృష్ణా జిల్లా వైపు నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు నీరందని పరిస్థితి నెలకొంది. కృష్ణా నది పరివాహక ప్రాంతం కృష్ణా జిల్లా చందర్లపాడు మండలంలో 28 స్కీమ్స్ ఉన్నాయి. వీటి కింద కృష్ణా జిల్లాలో 28,456 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 6 స్కీముల కింద 4,263 ఎకరాలు, మొత్తం 32,719 ఎకరాలలో వరి, మిర్చి, పత్తి ఇతర పైర్లను రైతులు సాగు చేస్తుంటారు. వీటికి నీరందక ఉత్తపోతల పథకాలుగా మిగిలిపోయాయి. వైకుంఠపురం బ్యారేజ్ పూర్తి అయితే పల్నాడు ప్రాంతం కోసూరు, అమరావతి మండలాల్లో సాగర్ కాల్వల చివరి ఆయకట్టుకు వరకు నీరు అందించవచ్చు. కాబట్టి వైకుంఠపురం బ్యారేజ్‌ను వేగంగా పూర్తి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

– నీరుకొండ ప్రసాద్

పొంచి ఉన్న సమస్యలతో 'గోదావరి – బనకచర్ల'!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టుదలగా చేపడుతున్న గోదావరి బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమస్య పక్కన బెడితే ఇతరత్రా ఎన్నో మెళకువలతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. అదే సమయంలో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి. పెండింగ్ ప్రాజెక్టుల నీళ్లు గాని గోదావరి నీళ్లు గాని రాయలసీమ చేరితే ఆ నీటి వినియోగానికి పెండింగ్ ప్రాజెక్టులకు చెందిన పంట కాలువల నిర్మాణం ఏక కాలంలో చేపట్టినపుడే ఆ ప్రాంత వాసులకు సంతృప్తి.

గోదావరి – బనకచర్ల అనుసంధానం పథకం డీపీఆర్ తయారవుతూ ఉందని, జూన్ కల్లా టెండర్లు పిలవబోతున్నారని వార్తలు వచ్చాయి. డీపీఆర్ తయారీలో ఇంజనీరింగ్ అధికారులు రాజకీయ నాయకుల ప్రచారార్భాటాలకు అనుకూలంగా వ్యవహరించకూడదు. ఉమ్మడి నదిగా ఉండి ట్రిబ్యునల్ ముందు విచారణలో ఉన్న కృష్ణా జలాలకు ఏ మాత్రం సంబంధం కలిగించకూడదు. ముఖ్యంగా బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపుల ఆయకట్టులో ఒక్క ఎకరా కూడా ఈ పథకంలో ఆయకట్టుగా గాని, స్థిరీకరణ కింద గాని చూపకూడదు. ఇందుకోసమే తెలంగాణ కాచుకుని ఉంది. గతంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మించిన రోజులు వేరు. పైగా పోలవరం పూర్తయితే పట్టిసీమ ఎత్తిపోతల పథకం తీసి వేస్తామని అప్పట్లో ప్రకటించారు. ఇప్పుడు అలా కాదు. తెలంగాణ డిమాండ్‌తో ఏర్పాటు చేసిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు మెడ మీద కత్తిలా ఉంది. ఈ 'పుణ్యం' జగన్మోహన్‌రెడ్డి – కేంద్ర ప్రభుత్వం ఇరువురూ కట్టుకొన్నారు.


ట్రిబ్యునల్ ముందు తెలంగాణ రెండు ప్రధాన అంశాలపై వాదన కొనసాగిస్తోంది. ఒకటి బేసిన్. రెండు ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నీళ్ల ఆయకట్టుకు రెండు వేపుల నుండి నీటి వసతి ఉంటే బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన జలాలు తమకు కేటాయించమని. ఈ సందర్భంలో గోదావరి–బనకచర్ల అనుసంధాన పథకం డీపీఆర్ రూపొందించే సమయంలో ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అధికారులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ సందర్భంగా తెలంగాణకు ట్రిబ్యునల్ ముందు ఏ మాత్రం అవకాశం ఇచ్చే విధంగా వ్యవహరించకూడదు.

గోదావరి బనకచర్ల అనుసంధాన పథకం కేవలం గోదావరి పెన్నా అనుసంధానంగానే జాగ్రత్తలు తీసుకోకపోతే ముమ్మందు ఆంధ్రప్రదేశ్ పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అంతేకాదు, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వెలువడే వరకు సాగు నీటికి చెంది రాజకీయ నేతలు ప్రకటనలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. అలాంటి ప్రకటనలు ఏమైనా చేస్తే ట్రిబ్యునల్ విచారణ ముందు వాటిని ఉపయోగించుకునేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది.

తెలంగాణ ప్రభుత్వం కన్నా ఎక్కువగా బీఆర్ఎస్ నేతలు, వారి మీడియా నిత్యం రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. డెల్టాకు గోదావరి నుండి నీళ్లు లభించే అవకాశం ఉన్నందున డెల్టాకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నీటిని ఎట్టి నీటి వసతి లేని బేసిన్‌లోని తమ ప్రాంతాలకు కేటాయించమని ఈ పాటికే కోరి ఉన్నారు. మొన్న మార్చి ఆఖరు వారంలో ఢిల్లీలో జరిగిన ట్రిబ్యునల్ విచారణ సందర్భంగా తెలంగాణ లాయర్ వైద్యనాధన్ అప్పుడే ఈ వాదనను వినిపించారు. కృష్ణ డెల్టాకు పట్టిసీమ నుండే కాకుండా పోలవరం నుండి కూడా 80 టీఎంసీలు వస్తాయని చెబుతుండగా ట్రిబ్యునల్ చైర్మన్ మధ్యలో కలుగచేసుకొని ఆంధ్రప్రదేశ్ బేసిన్ ఆవలకు ఎన్ని టీఎంసీల నీరు తరలించుతోందని ప్రశ్నించారు. 312 టీఎంసీలు కృష్ణ జలాలను ఆంధ్రప్రదేశ్ బేసిన్ ఆవలకు తరలించుతోందని, కేవలం 189 టీఎంసీలు మాత్రమే బేసిన్‌లో ఉపయోగించుతోందని జవాబు చెప్పారు. ఇది కీలక పరిణామమే. ఏప్రిల్ 15, 16 తేదీలకు విచారణ వాయిదా పడినా తెలంగాణ లాయర్ తన వాదనను తిరిగి రెండు రోజులు వినిపిస్తారు. తదుపరి ఆంధ్రప్రదేశ్ వంతు వస్తుంది.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పకడ్బందీగా ఈ రంగంలో నిపుణులైన లాయర్లను పెడితేనే బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు కాపాడగలరు. ఆ మధ్య ట్రిబ్యునల్ నియామకం పైనే సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు ఉన్న కేసు విచారణకు వస్తుందన్నారు. తర్వాత అతీ గతీ లేదు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు విచారణ వచ్చునట్లు చూడాలి. ఈ పూర్వ రంగంలో గోదావరి బనకచర్ల అనుసంధానం పథకంపై డీపీఆర్


గోదావరి బనకచర్ల అనుసంధానం పథకంపై డీపీఆర్ తయారు చేసే సమయంలో ట్రిబ్యునల్ చేతికి జుట్టు అందించకుండా అధికారులు జాగ్రత్తపడాలి. అంతేగాక కేంద్ర జల సంఘానికి డీపీఆర్ పంపకుండా, పర్యావరణ అనుమతులైనా పొందకుండా పథకానికి టెండర్లు పిలిస్తే న్యాయపరమైన ఇబ్బందులు తప్పవు.




తయారు చేసే సమయంలో ట్రిబ్యునల్ చేతికి జుట్టు అందించకుండా అధికారులు జాగ్రత్తపడాలి. అంతేగాక కేంద్ర జల సంఘానికి డీపీఆర్ పంపకుండా, పర్యావరణ అనుమతులైనా పొందకుండా పథకానికి టెండర్లు పిలిస్తే న్యాయపరమైన ఇబ్బందులు తప్పవు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత తొందర పడినా ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలను ఇంజనీరింగ్ అధికారులు వివరించాలి. లేకుంటే ఏ విధంగానైనా ఎవరైనా గ్రీన్ ట్రిబ్యునల్ కెళ్లి ఫిర్యాదు చేస్తే మొత్తం లక్ష్యం మూలన పడే అవకాశం ఉంది.

ఇదిలా వుండగా ఏ ప్రాంతానికైతే గోదావరి జలాలు తరలించి కరవు నేలను తడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారో ఆ ప్రాంతంలో గోదావరి బనకచర్ల అనుసంధానం పట్ల సానుకూలత కన్పించకపోవడం గమనార్హం. ముందుగా కృష్ణలో తమ వాటా నీళ్లు సద్వినియోగం చేయాలని కోరుతున్నారు. కెసి కెనాల్‌కు నికర జలాలు కేటాయింపులు ఉన్నా 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సుంకేసుల బ్యారేజీ ఒక్కటే దిక్కు. దాని నీటి నిల్వ సామర్థ్యం కేవలం 1.25 టీఎంసీలేనని, గుండ్రేవుల రిజర్వాయర్ గాని ఎత్తిపోతల పెట్టి నీరు గ్యారంటీగా ఇవ్వకుండా గోదావరి జలాలు ఇవ్వడమేమిటని అడుగుతున్నారు. కనీసం ఇందులో భాగమై పశువుల మేత భూమిగా అధ్వాన్న స్థితిలో ఉన్న 2.965టీఎంసీల సామర్థ్యం గల సమతుల అలగనూరు రిజర్వాయర్ గురించి పట్టించుకోకపోవడం జీర్ణించుకోలేకున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన వేదవతి అంగలార్చుతోంది. ఇది పూర్తయితే కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం దాహార్తి తీరుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సదుద్దేశంతో హంద్రీనీవా కాలువ లైనింగ్ కోసం రూ.940కోట్లు కేటాయించారు. ఈ లైనింగ్ వద్దని కాలువ వెడల్పు చేయాలని ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ఆందోళనలు సాగుతున్నాయి. వాస్తవంలో కాలువ వెంబడి డీపీఆర్ మేరకు పంట కాలువలు పిల్ల కాలువలు తవ్వితే ఈ ఆందోళన ఉండేది కాదు. కాలువలో నీరు పోతున్నా కాలువ వెంబడి రైతులు కళ్లప్పగించి చూడవలసి వుంది. కనీసం ఊట నీరు కూడా లేకుండా చేస్తున్నారనేది వారి ఆందోళన. ముమ్మందు గోదావరి జలాలు రాయలసీమ చేరినా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిగాక, అదే సమయంలో పంట కాలువలు నిర్మాణం జరగకపోతే గోదావరి జలాలైనా వృథానే!

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు




బాలయ్య అఖండ2 షుటింగ్ కోసం దర్శకుడు బోయపాటి శ్రీను పరిశీలించిన గుడిమెట్ల ప్రాంతంలోని అందాలు


విశ్వంభర మొదటి భక్తిగీతం విడుదలకు సన్నద్ధమవుతున్న పరిటాలలోని ఆంజనేయస్వామి ఆలయం

నిన్న అఖండ.. నేడు విశ్వంభర

ఈనెల 12న చిరంజీవి 'విశ్వంభర' భక్తిగీతం విడుదలకు సన్నాహాలు

- పరిటాలలోని ఆంజనేయస్వామి ఆలయమే వేదికగా ఏర్పాట్లు
- ఇప్పటికే పశ్చిమ ఎన్టీఆర్‌లో బాలయ్య అఖండ2 లొకేషన్ల పరిశీలన
- కృష్ణాతీరం, గుడిమెట్ల ప్రాంతంలో బోయపాటి పర్యటన

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : చిత్రసీమకు కేరాఫ్‌గా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా కళకళలాడుతోంది. నిన్నటికి నిన్న బాలయ్య అఖండ-2 సినిమా షూటింగ్ కోసం చందర్లపాడు మండలంలో కృష్ణానది తీరంలో దర్శకుడు బోయపాటి శ్రీను లొకేషన్లు పరిశీలించగా, నేడు పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా పాటను విడుదల చేసేందుకు దర్శకుడు వశిష్ఠ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలోని తొలిగీతాన్ని ఈనెల 12న విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. రాముడిపై సాగే ఈ భక్తిగీతాన్ని పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అయితే బాగుంటుందని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. యూవీ క్రియేషన్స్ పతాకంపై ప్రమోద్, వంశీ, విక్రమ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, త్రిష కథానాయికగా నటిస్తోంది. ఈ భక్తిగీతంలో చిరంజీవితో పాటు మెగా యంగ్‌హీరో సాయిదుర్గతేజ్ కనిపిస్తారని చెబుతున్నారు. కాగా, బాలకృష్ణ సినిమా కోసం గత జనవరిలో బోయపాటి శ్రీను చందర్లపాడు మండలంలో పర్యటించి, గుడిమెట్ల పరిసరాలను, కృష్ణానదిని పరిశీలించగా, తాజాగా చిరంజీవి పాట విడుదల సన్నాహాల నేపథ్యంలో పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా భవిష్యత్తులో సినిమా సందడితో కళకళలాడనుంది.


ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూ సమీకరణ విధానాన్ని అవలంబించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలో కీలక నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. రాజధాని ప్రాంత పరిధిలోని అన్ని జిల్లాలకూ భూ సమీకరణ విధానాన్నే అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విధానమైతే బహుళ ప్రయోజనకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ఈ ఆలోచన చేసింది.

ఐఆర్‌ఆర్‌కు భూ సమీకరణ

2,196 ఎకరాల సమీకరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

వీలుపడని చోట భూసేకరణ ప్రయత్నాలు

- సమీకరణ అయితేనే రైతులకు, సీఆర్‌డీఏకు ప్రయోజనం
- భూములను సిద్ధం చేసుకున్నాకే రింగురోడ్డు నిర్మాణం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో 2,196 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఈ భూములను భూ సమీకరణ విధానంలో తీసుకుంటేనే సీఆర్‌డీఏకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే 75 మీటర్ల వెడల్పున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూ సేకరణ విధానంలో అయితే సగటున రూ.3,000 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే భూ సమీకరణ విధానంలో అయితే అంత భారం ఉండదు. సమీకరణ విధానంలో అయితే రైతులకు ప్రతిగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కల్పించాల్సి ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఎందుకంటే రూ.61 వేల కోట్లతో రాజధాని పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మూడేళ్లలో అమరావతి ఒక రూపును సంతరించుకోనుంది. రాజధానిలో వచ్చే బూమ్ కారణంగా రైతులకు భూ సమీకరణ కింద ఇచ్చే ప్యాకేజీకి భారీగా విలువ పెరుగుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలను చూసినా కూడా రైతులు ఇచ్చే భూముల ధరలకు సమానంగా ప్యాకేజీ వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ దిశగా రైతులను చైతన్యపరచటానికి త్వరలో గ్రామసభలు నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు.

భూములను సిద్ధం చేసుకున్నాకే ఐఆర్‌ఆర్

ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్‌ఆర్)కు అవసరమైన 2,196 ఎకరాలను సిద్ధం చేసుకున్నాకే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. భూములను సిద్ధం చేసుకోవటానికి ఏడాది సమయాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాతే రోడ్డు నిర్మాణ పనుల దిశగా అడుగులు వేయాలని

మిగతా 6లో..



ఐఆర్‌ఆర్ ప్రతిపాదిత మ్యాప్

పాత నోటిఫికేషన్ ప్రకారమే..

పాత నోటిఫికేషన్ ప్రకారమే ఐఆర్‌ఆర్‌ను కొనసాగించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులు చేపట్టకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారం 96.16 కిలోమీటర్ల పొడవున, 75 మీటర్ల వెడల్పున ఐఆర్‌ఆర్ ఉంటుంది. ఐఆర్‌ఆర్‌కు క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న 27 రోడ్లు కూడా పాత అలైన్‌మెంట్ ప్రకారమే అనుసంధానమవుతాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 11 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల పరిధిలో ఐఆర్‌ఆర్ వస్తుంది. మొత్తం 42 గ్రామాల మీదుగా సాగుతుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి చోడవరం, దాములూరు, దోనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, కొటికలపూడి, కొత్తూరు, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, వెలగలేరు, రామచంద్రాపురం, వెదురుపావులూరు, సావారిగూడెం, నున్న, పాతపాడు, నిడమానూరు, పెనమలూరు, పోరంకి తదితర గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ సాగుతుంది.

రూ. 500 కోట్లతో అభివృద్ధి!

బెజవాడలో మౌలిక సదుపాయాల కల్పనకు సీఆర్‌డీఏ రెడీ



- రూ.150 కోట్ల వ్యయంతో స్టామ్ వాటర్ డ్రెయిన్లు
- రూ.350 కోట్లతో రోడ్ల విస్తరణ పనులకు శ్రీకారం
- మొత్తం ఐదు రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయం
- తూర్పు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు మేలు

నగరాభివృద్ధికి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పెద్దన్నలా నేనున్నానంటోంది. రూ.500 కోట్ల వ్యయంతో భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సిద్ధమైంది. ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న స్టామ్ వాటర్(వర్షపు నీటి) డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోనుంది. ఆటోనగర్‌తో ముడిపడిన ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడను పట్టి పీడిస్తున్న వరదనీటి మళ్లింపు కాలువలకు శాశ్వతంగా పరిష్కారం చూపేందుకు సీఆర్‌డీఏ సిద్ధమైంది. విజయవాడ నగరంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి కారణంగా అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు విజయవాడ నగరంలో స్టామ్ వాటర్(వర్షపు నీటి) డ్రెయిన్ల నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనులు చాలా వరకు పూర్తయినా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యవేక్షణ లేకపోవటం, వాటిని వదిలేయటంతో అసంపూర్తిగానే ఉన్నాయి. విజయవాడలో చిన్న వర్షం పడినా కూడా నగరంలోని రోడ్లపై నీరు నిలిచే పరిస్థితి ఏర్పడింది. కొండల మీద కురిసిన వర్షం నగరంలోని లోతట్టు ప్రాంతాలను జలమయం చేస్తోంది. నగరమంతటా పటిష్ఠమైన వరద నీటి మళ్లింపు కాలువలు లేకపోవటం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది. నగరంలో బ్యాలెన్స్ వరద నీటి మళ్లింపు కాలువలను పూర్తి చేయటానికి సుమారు రూ.150 కోట్లు అవసరమవుతాయని కార్పొరేషన్ అధికారులు అంచనాలు వేశారు. విజయవాడ నగరానికి సంబంధించి రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణ ఇటీవల సమీక్ష జరిపిన సందర్భంలో వరద నీటి కాలువల అంశం చర్చకు వచ్చింది. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అనేక దఫాలుగా మంత్రి దృష్టికి తీసుకురావటం జరిగింది. బ్యాలెన్స్ వరద నీటి మళ్లింపు కాలువల పనులను సీఆర్‌డీఏ ద్వారా చేయించేందుకు మంత్రి నారాయణ నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ నగర వ్యాప్తంగా బ్యాలెన్స్ స్టామ్ వాటర్ డ్రెయిన్లను పూర్తి చేసేందుకు రూ.150 కోట్ల నిధులను సీఆర్‌డీఏ ఖర్చు చేయనుంది. బ్యాలెన్స్ స్టామ్ వాటర్ డ్రెయిన్స్‌తో పాటు ఆటోనగర్ గుంటుతిప్ప డ్రెయిన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు.

రూ. 350 కోట్ల వ్యయంతో ఐదు రోడ్ల విస్తరణ

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఆటోనగర్‌తో ముడిపడిన ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా నాలుగు రోడ్ల విస్తరణ పనులు కూడా సీఆర్‌డీఏ చేపట్టబోతోంది. దీని కోసం రూ.350 కోట్ల నిధులను ఖర్చు పెట్టనుంది. ఇప్పటికే విజయవాడ శివారున ఎనికేపాడులో శక్తి కల్యాణ మండపం రోడ్డును సీఆర్‌డీఏ తన సొంత నిధులతో అభివృద్ధి చేసింది. ఇదే క్రమంలో మరో నాలుగు రోడ్లను సీఆర్‌డీఏ అభివృద్ధి చేయనుంది.

- మహానాడు రోడ్డును మరింత విస్తరించాలని నిర్ణయించారు. మహానాడు రోడ్డు

మిగతా 6లో..

హతవిధీ

- 58 ఏళ్లు దాటి పనిచేస్తున్న వివిధ కార్పొరేషన్ల నుంచి వచ్చిన ఉద్యోగులు
- చర్యలకు వెనకడుగు

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పదవీ విరమణ గోల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పదవీ విరమణ చెందినా ఇంకా కొనసాగుతూ జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులను ఏం చేయాలో తెలియక ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా వివిధ కార్పొరేషన్ల నుంచి ఏపీకి అదనంగా వచ్చిన ఉద్యోగుల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు 50 మందిని కేటాయించారు. వీరిని ఉపాధి కల్పనశాఖ నేతృత్వంలో పనిచేసే సర్‌ప్లస్ మేనేజ్‌మెంట్ సెల్ (ఎస్ఎంసీ)కు కేటాయించారు. వివిధ డిపార్ట్‌మెంట్లకు సర్దుబాటు చేశారు. ఇలా సర్దుబాటు చేయటంపై కోర్టు సీరియస్ కావటంతో పాటు ఎవరికి వారిని వారి మాతృసంస్థలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. కానీ, ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఒక్క ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం కోర్టు ఆదేశాలను పాటించకుండా విజయవాడ, కృష్ణాజిల్లాలో కొనసాగుతున్నారు. వివిధ కార్పొరేషన్ల నుంచి వచ్చిన మిగులు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును కూడా 58 సంవత్సరాలుగానే పరిగణిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న వారంతా 58 ఏళ్లు దాటి పనిచేస్తున్నారు. ఒక్కో ఉద్యోగి దాదాపు నెలకు రూ.1.25 లక్షల జీతం తీసుకుంటున్నారు. మొత్తంగా నెలకు రూ.15 లక్షల వరకు ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు గతంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, కలెక్టరేట్ల నుంచి వచ్చిన ఆదేశాలను తొక్కిపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా కొనసాగుతున్నారు. ఆఫీసుకు వచ్చిన లేఖలను పర్యవేక్షించే

మిగతా 6లో..



అభివృద్ధి పనులు చకచకా..

- దుర్గగుడిపై శరవేగంగా నిర్మాణ పనులు
- భక్తులకు వసతుల కల్పనపై అధికారుల దృష్టి
- ఊపందుకున్న నూతన భవన సముదాయాలు
- ఏడాదిలో భక్తులకు అందుబాటులోకి..

6లో

టెక్ పోలీస్..!

కీలక కేసుల్లో కమిషనరేట్ పోలీసుల సాంకేతికత

చోరీ జరిగిందా..? ఒక్కరోజులో దొంగలను పట్టేసుకుంటున్నారు. హత్యకు పాల్పడ్డారా..? అరగంటలో నిందితుల చేతులకు బేడీలు వేసేస్తున్నారు.. కొట్లాట జరుగుతోందా? క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేస్తున్నారు. సాంకేతికతను చక్కగా వినియోగించుకుంటున్న కమిషనరేట్ పోలీసులు ఎలాంటి నేరాన్నైనా చిటికెలో పరిష్కరించేస్తున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, న్యాట్‌గ్రిడ్ వంటి ఆధునిక సాధనాల సాయంతో గంటల వ్యవధిలో కీలక కేసులను ఛేదిస్తున్నారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు పోలీసులకు ఆయుధాలుగా మారగా, 24 గంటలు తిరిగేలోపే బాధితులకు ఊరట కలిగిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 600 పైగా కేసుల్లో జరిగింది ఇదే. పోలీసు కమిషనర్‌గా ఎస్వీ రాజశేఖరబాబు బాధ్యతలు చేపట్టాక విజయవాడ యూనిట్‌ను సాంకేతికంగా బలోపేతం చేయడం వల్లే ఈ ఫలితాలు వస్తున్నాయని చెబుతున్నారు.


బందరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు

- సీసీ కెమెరాలు, డ్రోన్ల ఆధారంగా నిందితుల పట్టివేత
- 24 గంటలు తిరిగేలోపే సమస్యకు పరిష్కారం
- ఏడు మాసాల్లో సమూల మార్పులు
- శివారు ప్రాంతాల్లో నిఘాకు ప్రత్యేక డ్రోన్లు
- ఆచూకీ లేని నిందితుల కోసం న్యాట్‌గ్రిడ్

8లో

రాజమార్గాలకు ముందడుగు

రాజధానిలో ఈ-13, 15 రోడ్ల విస్తరణకు టెండర్లు

- కురగల్లు నుంచి ఎన్‌హెచ్-16 వరకు ఈ-13 రోడ్డు
- రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే యోచన
- నిడమర్రు నుంచి ఎన్‌హెచ్-16 వరకు ఈ-15 రోడ్డు
- సీడ్ యాక్సెస్ రోడ్డుకు రైతుల నుంచి సహాయ నిరాకరణ
- ప్రత్యామ్నాయ రాజమార్గాల అభివృద్ధి

8లో

7 లక్షల మందిపై భారం

- గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంచిన కేంద్రం
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏడు లక్షల కనెక్షన్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్యాస్ వినియోగదారులపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపింది. సిలిండర్‌పై రూ.50 పెంచింది. ఫలితంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఏడు లక్షల మంది వినియోగదారులపై ప్రత్యక్షంగా భారం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా 70కి పైగా గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు ఏడు లక్షల వరకు డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్‌కు రూ.50 లెక్కన చూస్తే ప్రతి రెండు నెలలకు రూ.3.50 కోట్ల మేర వినియోగదారులపై అదనంగా భారం పడుతోంది. రెండు నెలలకు ఒక గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి ఆరు సిలిండర్ల ప్రాతిపదికన చూస్తే రూ. 21 కోట్ల భారం ప్రజలపై పడనుంది.



వెండి రథం ఊరేగింపు ప్రారంభిస్తున్న దేవస్థాన స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకస్వాములు, అధికారులు

వెండిరథంపై ఊరేగిన ఆదిదంపతులు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణోత్సవాల్లో భాగంగా రెండవరోజు బుధవారం ఆదిదంపతులు వెండిరథంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకస్వాములు ఉదయం 8 గంటల నుంచి మూల మంత్ర హవనములు.. సాయంత్రం ఔపాసన,



బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ వాహనసేవల్లో భాగంగా సాయంత్రం 5 గంటలకు దుర్గాఘాట్ దిగువన ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గామల్లేశ్వరుల వెండి రథోత్సవాన్ని దేవస్థానం స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకస్వాములు, అధికారులు ప్రారంభించారు. సంప్రదాయ కళలైన తప్పెట్లు, కోలాట నృత్యాలు, తాళం భజన కళాకారుల ప్రదర్శనలు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గామల్లేశ్వరుల వెండి రథోత్సవం కొనసాగింది. కనకదుర్గానగర్, కుమ్మరిపాలెం సెంటర్, కామకోటినగర్, శంకర మఠం, విద్యాధరపురం, సొరంగం, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా దేవస్థానానికి చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున హారతులు ఇచ్చి టెంకాయలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఆలయ ఏఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పదోతరగతి మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు బిషప్ అజరయ్య హైస్కూల్‌లో నిర్వహించినట్టు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. బుధవారంతో క్యాంపు ప్రశాంతంగా ముగిసిందని, క్యాంపులో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఏఎంసీ చైర్మన్‌గా అన్నే

» వైస్ చైర్మన్‌గా కళ్యాణి.. సభ్యుల జాబితా విడుదల



చైర్మన్ అన్నే

కంకిపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు సభ్యుల జాబితాను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఇప్పటికే చైర్మన్‌గా ఉప్పలూరు గ్రామానికి చెందిన అన్నే ధనరామకోటేశ్వరరావు పేరును ప్రకటించగా బుధవారం వైస్ చైర్మన్‌తో పాటు కార్యవర్గాన్ని ప్రకటించారు. చైర్మన్‌గా అన్నే ధనరామకోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా మల్లెంపల్లి కళ్యాణి, కార్యవర్గ సభ్యులుగా గోగినేని వెంకటరమణ (కంకిపాడు), సుంకర శ్రీదేవి (ఈడుపుగల్లు), బడుగు సాంబశివరావు(వణుకూరు), బుక్యా బిచాలి (యనమలకుదురు), దండమూడి లక్ష్మీకుమారి (తెన్నేరు), కిలారు శ్రీనివాసరావు (పెనమలూరు), కుంపటి రమేష్‌బాబు (గొడవర్రు), పలగాని సుజాత (ప్రొద్దుటూరు), పి.రజిని (యనమలకుదురు), షేక్ మాబుబ్ సుభాని (గోసాల), సింహాద్రి కృష్ణవేణి (చోడవరం), జనసేన పార్టీ నుంచి గుడివాడ సామ్రాజ్యం (కంకిపాడు), వడ్డీ జీవరత్నం (పెనమలూరు)లను డైరెక్టర్లుగా నియమించారు. గతంలో ఎన్నడూలేని విధంగా రజక కులానికి చెందిన మహిళ మల్లెంపల్లి కళ్యాణికు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించటంతో పార్టీ క్యాడర్‌లో జోష్ నెలకొంది. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ, పార్టీకి తమ కుటుంబం కట్టుబడి ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సీనియర్ నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, తుమ్మల జగదీష్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



హనుమాన్ జంక్షన్‌లో ఫిర్యాదు చేస్తున్న పాల సంఘాల అధ్యక్షులు

అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై
తక్షణ చర్యలు తీసుకోండి

» పోలీసులకు కృష్ణా మిల్క్ సంఘాల ఫిర్యాదులు

చిట్టినగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విలువలతో విజయపథంలో దూసుకెళ్తున్న కృష్ణామిల్క్ యూనియన్, చైర్మన్, పాలకవర్గం, ఉద్యోగులపై వీడియో పోస్టింగులతో దుష్ప్రచారాలు చేస్తున్న ప్రమీల, ఆమెకు సహకరించిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన పలువురు పాలక సంఘాల అధ్యక్షులు బుధవారం వేర్వేరు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగుల భద్రత, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ కృష్ణా మిల్క్ యూనియన్ ముందుకు దూసుకెళ్తుందని, అటువంటి యూనియన్‌పై సోషల్ మీడియా గ్రూప్‌లలో అసత్య వీడియోల సంబంధించి సత్వరం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. యూనియన్ ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న దుష్టశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పామర్రు, పెడన, బంటుమిల్లి, హనుమాన్‌జంక్షన్, ఆగిరిపల్లి, నందిగామ, చిల్లకల్లు తదితర స్టేషన్‌లో పాల సంఘాల అధ్యక్షులు స్థానిక పాడి రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు.

ఐఆర్ఆర్‌కు భూ సమీకరణ

(5వ పేజీ తరువాయి)

భావిస్తోంది. భూ సమీకరణకు ఎవరైనా అంగీకరించకపోతే భూసేకరణ విధానంలో అయినా వెళ్లాల్సి ఉంటుంది.

ఐఆర్ఆర్‌కు అనుసంధానమయ్యే అమరావతి రోడ్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డుకు రాజధానిలోని మొత్తం 27 రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ-1, 2, 3, 4, 5, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, ఎన్-4, 7, 8, 9, 10, 11, 12, 13 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే వంటివి అనుసంధానమవుతాయి. ఇవన్నీ కూడా సింహభాగం 50 మీటర్లు, మిగిలినవి 60 మీటర్ల మేర ఉన్నాయి. మొత్తం 1,362.30 ఎకరాల మేర భూములు ఐఆర్ఆర్‌కు అనుసంధానమవుతాయి.



అభివృద్ధి చక చకా..

ఆంధ్రజ్యోతి విజిట్

» ఇంద్రకీలాద్రిపై శరవేగంగా నిర్మాణ పనులు
» భక్తులకు వసతుల కల్పనపై అధికారుల దృష్టి
» మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్త డిజైన్లు
» ఊపందుకున్న నూతన భవన సముదాయాలు
» ఏడాదిలో భక్తులకు అందుబాటులోకి..!
» మరింత సౌకర్యవంతంగా దుర్గమ్మ దర్శనం



మహామండపం ఎదురుగా లడ్డూ పోటు భవన సముదాయం

(ఇంద్రకీలాద్రి-ఆంధ్రజ్యోతి)

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దేవస్థానంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మందగించిన పనులు కూటమి ప్రభుత్వం రాకతో ఊపందుకున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవదాయశాఖ అధికారులు మాస్టర్ ప్లాన్ ప్రకారం డిజైన్‌లను రూపొందించి ఆ ప్రకారం పూర్తి చేస్తున్నారు. భవిష్యత్తులో భక్తుల రద్దీ దృష్ట్యా లోటుపాట్లు లేకుండా అన్ని వసతులను కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం



ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడకుండా ఏర్పాటు చేసిన ఐరన్ మెష్

ఆరు అంతస్థులతో లడ్డూపోటు

లడ్డూపోటుకు రూ.27కోట్లు అంచనాతో ఆరుఅంతస్థుల భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగు అంతస్తుల శ్లాబు పూర్తికాగా.. మరో మూడు నెలల్లో మిగతా రెండు అంతస్తులు పూర్తి కానున్నాయి. వంటశాల, లడ్డూ, పులిహోర తయారీ, ప్యాకింగ్, సరుకులను నిల్వచేసేందుకు స్టోర్, లడ్డూ కౌంటర్లు, క్యూలు, కార్యాలయం తదితర వసతులను సిద్ధం చేస్తున్నారు. కొత్త లడ్డూ పోటు నిర్మాణం పూర్తయితే బుద్ధావారి గుడి కళ్యాణమంటపంలో ఉన్న లడ్డూ తయారీ కేంద్రాన్ని ఇక్కడికి మార్పు చేస్తారు.

ఏకకాలంలో 1200 మంది కూర్చునేలా అన్నదాన భవన నిర్మాణం

రూ.26 కోట్లు అంచనాతో మహామండపానికి ముందు రెండంతస్తుల భవన నిర్మాణం చేస్తున్నారు. మొదటి అంతస్తు శ్లాబు పనులు మరో ఆరునెలల్లో పూర్తికానున్నాయి. ఇక్కడ ఏక కాలంలో 1200 మంది భక్తులు భోజనం చేయవచ్చు. అత్యాధునిక వంటశాల, కార్యాలయం, స్టోర్లు ఏర్పాటు చేస్తున్నారు.

- కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు తారు రోడ్డు నిర్మిస్తున్నారు. గతంలో వేసిన రోడ్డు పూర్తిగా పాడవడంతో మరో లేయర్ వేసేందుకు రూ.50లక్షలు కేటాయించి టెండర్లను ఆహ్వానించారు. మరో రెండు నెలల్లో ప్రక్రియ పూర్తఅవుతుంది.
- మహామండపం దక్షిణం వైపున ఉన్న అమ్మవారి పూజా మెట్ల మార్గం ముందు రేకుల షెడ్డు పూర్తిగా పాడవటంతో దానిస్థానంలో టెన్‌సైల్ షెడ్డును నిర్మించనున్నారు. రూ.90లక్షలు అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ మరో మూడు నెలల్లో పూర్తవుతుంది.
- మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.76.33 లక్షల వ్యయంతో నవగ్రహ మండప నిర్మాణం చేశారు. ముహూర్తం చూసి దీనిని వినియోగంలోకి తీసుకురానున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయం చుట్టూ నూతనంగా నిర్మించిన ప్రాకార మండపానికి నాలుగు వైపులా రూ.4లక్షల వ్యయంతో స్టీలు ఫ్రేములను బిగిస్తున్నారు. దేవస్థానంలో నిరుపయోగంగా ఉన్న స్టీలు ఫ్రేములను ఇందుకు వినియోగిస్తారు. మరో పది రోజుల్లో పనులు పూర్తవుతాయి.
- మల్లేశ్వరస్వామి ధ్వజస్తంభానికి రాగి తొడుగు వేసే పనులను పూర్తిచేసి తిరుమల దేవస్థానం నిపుణుల ఆధ్వర్యంలో స్వర్ణ తాపడం చేయించనున్నారు.
- ఆలయ ప్రాంగణంలో రాధాకృష్ణుల బొమ్మ వద్ద రూ.5కోట్లు వ్యయంతో నూతన రాతియాగశాల పనులు పూర్తవుతున్నాయి. సుమారు నెలలో పనులు పూర్తి కానున్నాయి. యాగశాల పూర్తి కాగానే ప్రత్యేక యాగాలు అందుబాటులోకి వస్తాయి.
- దేవస్థానంలో వివిధ ఆర్జిత సేవలు నిర్వహించేందుకు రూ.6కోట్ల వ్యయంతో పూజా మండపాలు నిర్మాణం చేస్తున్నారు. ఇవి మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయి.
- చిన్న రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఓం టర్నింగ్ వద్ద, మహామండపం ఏడో అంతస్తులో భక్తుల సౌకర్యార్థం రూ.2.4కోట్లతో చేపట్టిన షెడ్ల నిర్మాణం చేస్తున్నారు. ఇది నెలలో పూర్తవుతుంది. ఓం టర్నింగ్ మధ్యలో కొండరాళ్లు పడకుండా రూ.4.26 కోట్లతో రక్షణ చర్యలు చేపట్టారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారమే పనులు..



\- ఈవో రామచంద్ర మోహన్

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అభివృద్ధి పనులు ఈ ఏడాది జనవరి నుంచి శరవేగంగా జరుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం డిజైన్‌లను రూపొందించి పనులు నిర్వహిస్తున్నాం. కనకదుర్గనగర్ నుంచి మహామండపం వరకు క్యూ కాంప్లెక్స్, గతంలో నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించాం. ఆరునెలల్లో పనులు పూర్తవుతాయి. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పై అంతస్థులోని క్యూ కాంప్లెక్స్‌కు చేరుకునేందుకు కొత్త నిర్మాణం ద్వారా అవకాశం ఉంటుంది. భక్తులకు మంచినీటి సౌకర్యం, పార్కింగ్, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు తదితరాలను ఏర్పాటు చేస్తున్నాం.



పర్యావరణ పరిక్షణ, సుందరీకరణకు ఘాట్ రోడ్డులో వివిధ రకాల మొక్కలు



రాతి యాగశాల నిర్మాణం

- దేవస్థానంలో పారిశుద్ధ్య మెరుగుకు శాశ్వత చర్యల్లో భాగంగా స్టీల్ డస్ట్‌బిన్‌ల ఏర్పాటుకు టెండర్లు ఖరారయ్యాయి. త్వరలో 50 డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయనున్నారు. స్టీలు బెంచీలు, క్యూలలో తాగునీటి సౌకర్యం, ఘాట్ రోడ్డు, దుర్గాఘాట్‌లో మరుగుదొడ్ల ఏర్పాటు దేవస్థాన బస్సుల్లో సీసీ కెమెరాలు, భక్తులు బస్సులు తిరిగే వేళల బోర్డుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నాయి. ఇంకా అదనపు లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో ల్యాండ్ స్కేపింగ్‌తో సహజ సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం జరుగుతోంది. వేసవి దృష్ట్యా భక్తుల కోసం తాత్కాలిక షెడ్డులు ఏర్పాటు చేశారు.



మల్లేశ్వరాలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం

మామిడి రైతుల్ని ఆదుకోండి!

» కౌలు రైతు సంఘం డిమాండ్



రాలిన మామిడికాయలను చూపుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల దెబ్బతిన్న మామిడి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఈదురుగాలులకు దెబ్బతిన్న మామిడి తోటలను ఆయన బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొత్తూరు తాడేపల్లిలో సుమారు 70 శాతం తోటలు దెబ్బతిన్నాయన్నారు. గ్రామంలో 2,700 ఎకరాల్లో 450 ఎకరాలు మామిడి తోటలే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి స్వచ్ఛంద పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో ముగ్గురు రైతులు మాత్రమే తమ తోటలను బీమా చేయించుకోగలిగారన్నారు. మిగిలిన రైతులు ప్రీమియం ఎక్కువని బీమా చేయించుకోలేకపోయారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మామిడి రైతులు నష్టపోయారన్నారు. ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయశాఖలతో పంట నష్టం అంచనా వేసి వాస్తవంగా కౌలు చేసిన రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈక్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా వెబ్‌ల్యాండ్‌లో నమోదుకాని భూముల్లో సాగు చేసిన మామిడితోటలకు కూడా నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కొత్తూరు తాడేపల్లి మామిడి కౌలు రైతులు ముగ్గురాళ్ల నాగేశ్వరరావు, ఇండ్ల లక్ష్మీనారాయణ, గరిమెళ్ల రాంబాబు, రావూరి తిరుపతమ్మ, చప్పిడి బాబురావు, ముగ్గురాళ్ల నాగరాజు, ఇస్లావతు సాంబయ్య తదితరులు మాట్లాడుతూ, పంట చేతికి వచ్చే సమయానికి ఈదురు గాలుల వల్ల కాయ రాలిపోయి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.50 వేలనుంచి 70 వేల వరకు కౌలు చెల్లించడమే కాక రూ.50 వేల వరకు వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చిన తర్వాత అప్పులు తీర్చుకుందామంటే అంతా వర్షార్పణమైందని వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి ఉప్పే నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్ఐ నేతపై ఎస్సై దాడి
స్టేషన్ వద్ద గిరిజనుల ఆందోళన

ఎ.కొండూరు : రెండు కుటుంబాల మధ్య వివాదం పరిష్కారానికి వెళ్లిన గిరిజన సంఘం నేత, ఎస్ఎఫ్ఐ నాయకుడిపై ఎ.కొండూరు ఎస్ఐ దాడి చేశారని బాధితుల కుటుంబసభ్యులు, గిరిజనులు స్టేషన్ వద్ద బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఎ.కొండూరు చైతన్య నగర్ తండాకు చెందిన ఎం.కుమార్ నాయక్ గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్న వివాదం పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఎస్ఐ చల్లా కృష్ణ నువ్వు పెద్ద మనిషివా అంటూ చొక్కా పట్టుకొని తీవ్ర పదజాలంతో దూషించాడని ఆరోపించారు. కుమార్ నాయక్ కుటుంబ సభ్యులు, గిరిజనులు ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న తిరువూరు సీఐ గిరిబాబు బాధితులతో చర్చించి ఆందోళన విరమింప చేశారు. దీనిపై సీఐ గిరిబాబు మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు జరిగిన సంఘటనపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాట్సాప్‌లో ధాన్యం విక్రయాలు

» కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వాట్సాప్ ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ఏవిధంగా విక్రయించాలో కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. రైతులు ముందుగా తమ ఫోన్‌లో 7337359375 నెంబరును సేవ్ చేసుకోవాలని, అనంతరం 7337359375కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెట్టాలని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు స్వాగతం. ధాన్యం అమ్మడానికి షెడ్యూల్ చేసుకోండి' అనే మెసేజ్ కనిపిస్తుంది. ఇందులో షెడ్యూల్‌పై క్లిక్ చేయాలని తెలిపారు. 'దయచేసి మీ ఆధార్ సంఖ్యను నమోదు చేయండి' అనే మెసేజ్ వస్తుందని, రైతు తన ఆధార్ నెంబర్‌ను టైప్ చేయాలని, ఆధార్ నెంబరు కలిగిన రైతు పేరు, ధాన్యం అమ్మే కొనుగోలు కేంద్రం పేరు స్క్రీన్‌పై కనిపిస్తుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంపై క్లిక్ చేయగానే.. ధాన్యం అమ్మే తేదీని ఎంచుకోండి అనే మెసేజ్ కనిపిస్తుందని, మీకు నచ్చితే తేదీపై క్లిక్ చేయాలని, అనంతరం ధాన్యం అమ్మే సమయాన్ని ఎంచుకోవాలని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మూడు స్లాట్‌లు వుంటాయిన తెలిపారు. ఇందులో ఉదాహరణకు ఉదయం 8 నుంచి 10 గంటల స్లాట్ ఎంచుకొంటే..ఇందులో 8, 9, 10 గంటల స్లాట్ ఏదో ఒక సమయాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. సమయాన్ని ఎంచుకొన్న తర్వాత రైతే ఏ ధాన్యం అమ్ముతున్నారో తెలపాలని కలెక్టర్ పేర్కొన్నారు. కామన్ సార్‌టెక్స్, కామన్ నాన్ సార్‌టెక్స్ ఇలా మీ ప్రాంతానికి సంబంధించిన రకాలు కనిపిస్తాయని, రైతు ప్రభుత్వానికి అమ్మదలచిన ధాన్యంను బ్యాగ్స్‌లో తెలపాలని పేర్కొన్నారు. బ్యాగ్‌ల సంఖ్య తెలపగానే రైతు పేరు, ఏ కేంద్రంలో, ఏ తేదీన ఏ స్లాట్‌లో ఏ సమాయానికి ఎన్ని బ్యాగ్‌లో ధాన్యం కొనుగోలు వివరాలు డిస్‌ప్లే అవుతాయని వివరించారు. అదేవిధంగా కూపన్ కోడ్ వస్తుందని, ఏఐ వాయిస్ ఓవర్‌తో రైతులను గైడ్ చేస్తూ వాట్సాప్‌లో సులభంగా ధాన్యం కొనుగోలు షెడ్యూల్ చేసేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు.

హతవిధీ..!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగి ఒకరు వీటిని కప్పిపెట్టాడనే ఆరోపణలు ఉన్నాయి. తీరా చూస్తే వారందరికీ 60 ఏళ్లు దాటిపోయాయి. మరికొందరు 62 ఏళ్ల ప్రకారం పదవీ విరమణ స్టేజీకి వచ్చేశారు.

కాలాతీతం వలే.

ఈ మొత్తం వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్ హైకోర్టు జీపీకి లేఖ రాస్తూ న్యాయ సలహా కోరారు. దీనిపై హైకోర్టు జీపీ కూడా ఉద్యోగులను కొనసాగించటం కుదరదని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని ఉటంకిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్ తన ఉన్నతాధికారి అయిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)కు లేఖ రాశారు. న్యాయ సలహా ప్రకారం ఉద్యోగులపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలో స్పష్టత ఇవ్వాల్సిందిగా కోరారు. దీనిపై ఈఎన్‌సీ కార్యాలయం కూడా కాండక్ట్, సర్వీసు రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. అయితే, ఈఎన్‌సీనే చర్యలు తీసుకోవాలని ఎస్ఈ కోరారు. ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలతో పాటు ఇన్నాళ్లూ అప్పనంగా తీసుకుంటున్న జీతాలను కూడా ఉద్యోగులు తిరిగి చెల్లించాల్సి వస్తోంది. దీనిపై గట్టిగా చర్యలు తీసుకోలేకపోతున్న ఉమ్మడి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్ తలపట్టుకుని ఉన్నతాధికారులకు లేఖలు రాస్తున్నారు. ఈ లేఖల వల్ల కాలహరణం తప్ప ఫలితం శూన్యం. ఈలోగా ఒక ఉద్యోగికి త్వరలో 62 ఏళ్లు పూర్తికానున్నాయి. అతని బెనిఫిట్స్ ఫైల్ కూడా సిద్ధమవుతోంది. ఇలాగే కాలాతీతం జరిగితే ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్లను కూడా సదరు ఉద్యోగులు తన్నుకుపోయే ప్రమాదం ఉంది.

రూ. 500 కోట్లతో అభివృద్ధి!

(5వ పేజీ తరువాయి)

మీదుగా విజయవాడలోకి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ భారీ వాహనాల రాకపోకలను నియంత్రించటం కోసం మహానాడు రోడ్డును నిడమానూరు వరకు పొడిగించి అక్కడ జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 16కు అనుసంధానించనున్నారు.

- బల్లెం వారి వీధి కొన్ని చోట్ల 40, 50 అడుగులుగా ఉంది. దీనిని 80 అడుగుల రోడ్డుగా విస్తరించనున్నారు. అలాగే ఈ రోడ్డును ఎనికేపాడు వరకు విస్తరించి ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానం చేస్తారు.
- బల్లెం వారి వీధిని శక్తి కల్యాణ మండపం రోడ్డుకు అనుసంధానిస్తారు. దీని వల్ల బల్లెం వారి వీధి మీదుగా వచ్చే వాహనాలు రామవరప్పాడు రింగ్ దగ్గర కాకుండా ఎనికేపాడు దగ్గర ఎన్‌హెచ్ - 16కు శక్తి కల్యాణ మండం రోడ్డు నుంచి అనుసంధానమవుతాయి. దీని కోసం ఈ రెండు రోడ్లకు ఎలా కనెక్టివిటీ ఇవ్వాలన్న దానిపై సీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.
- ప్రస్తుతం ఆయుష్ ఆస్పత్రి దగ్గర హైటెన్షన్ లైన్ల కింద అభివృద్ధి చేసిన రోడ్డును నిడమానూరు వరకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. హైటెన్షన్ తీగల కిందుగా ఈ రోడ్డును కొత్తగా ఏర్పాటు చేస్తారు. ఈ రోడ్డుకు భారీగా వ్యయం అవుతుందని సీఆర్‌డీఏ అధికారులు అంచనాలు వేస్తున్నారు.
- ఎనికేపాడు - తాడిగడప రోడ్డును నేరుగా నిడమానూరుకు అనుసంధానం చేయాలని కూడా నిర్ణయించారు. ఈ రోడ్డును నిడమానూరుకు అనుసంధానం చేయటం ద్వారా ఎన్‌హెచ్ - 16కు కనెక్టివిటీని కల్పిస్తారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

టీటీడీకి కూరగాయల వితరణ

రామలింగేశ్వరనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వహించిన నిత్యాన్నదాన ప్రసాదానికి కూరగాయలు పంపడం అభినందనీయం అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం రామలింగేశ్వరనగర్‌కు చెందిన భక్తులు శేషగిరిరావు ఆధ్వర్యంలో తిరుమల అన్నదాన ప్రసాదానికి పంపుతున్న కూరగాయల లారీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమలలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ప్రకాశం బ్యారేజీపై నుంచి కామయ్యతోపుకు చెందిన ఓ మహిళ నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. సమాచారం తెలుసుకున్న సమీపంలో విధుల్లో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆమెను రక్షించారు. యనమలకుదురు చెందిన మేక దివ్య (29) భర్తతో విభేదాలు రావటంతో వేరుగా ఉంటోంది. ఆమె కుమార్తె (8) మొదట్లో తల్లి వద్ద ఉంది.

అయితే కొన్ని కారణాల వల్ల కుమార్తెను తండ్రి తీసుకువెళ్లాడు. దివ్య పలుమార్లు కుమార్తెను తన వద్దకు రమ్మని అడిగినప్పటికీ అందుకు ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన దివ్య ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చి నదిలో దూకింది. ఈ విషయం తెలుసుకున్న సమీప ప్రాంతంలో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం స్పందించి డ్రోన్ ద్వారా బెలూన్లు పంపించి ఆమెను రక్షించారు. నదిలో నుంచి ఆమెను బయటకు తీసుకువచ్చి వివరాలు తెలుసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియపరిచి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రాళ్లు లేచి రహదారి అధ్వానం

● సుభానీ హోటల్ పక్క రోడ్డుపై నిర్లక్ష్యం ● అంతంతమాత్రంగానే పారిశ్రామికవాడ రహదారులు



రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



గుంతలమయంగా ఉన్న రహదారి

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి

నగర నడిబొడ్డున ఉన్న ఆటోనగర్ రహదారులపై అధికారులు సవతి ప్రేమ చూపిస్తున్నారు. సుభాని హోటల్ పక్క ఉండే రహదారి రాళ్ల లేచి ప్రమాదభరితంగా ఉంది. ఇటుగా రాకపోకలు చేయాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. మట్టి, రాళ్ల లేచి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించిందని, టైర్లు పంచర్లు పడుతున్నాయని అంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం గుంతలు పూడ్చే కార్యక్రమం నిర్వహిస్తుంది. కానీ సుభానీ హోటల్ పక్క రోడ్డును పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో గుంతల పూడ్చే కార్యక్రమం ఆటోనగర్ ప్రాంతంలో ప్రారంభమైనా పారిశ్రామికవాడ రహదారులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి పోయింది. పారిశ్రామివాడలో త్వరతగతిన రహదారి నిర్మాణం చేపట్టాలని వాహన దారులు కోరుతున్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ద్వారానే రాష్ట్రాభివృద్ధితో పాటుగా ప్రజా సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం తూర్పు పరిధి మూడో డివిజన్ గుణదల సెంటర్, పుల్లేటి కట్ట రోడ్డులో కూటమి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జనసేన ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు, బీజేపీ తూర్పు ఇన్‌చార్జి పోతంశెట్టి నాగేశ్వరరావు పాల్గొని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క చోట కూటమి కార్యాలయం ఏర్పాటు చేసుకుంటామని, అందులో భాగంగానే ఈ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజా సమస్యలు, ఇతర అభివృద్ధికార్యక్రమాలపై కూటమి నాయకులు ఇక్కడ కలుసుకొని చర్చించుకొని ముందుకు వెళతారన్నారు. అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ కూటమి పార్టీలు ఇలాగే కలిసి మెలిసి ముందుకు సాగుతూ చక్కటి పాలనను అందిస్తామన్నారు. పోతంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి సహకారంతో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తూమాటి ప్రేమ్‌నాథ్, బొప్పన భవకుమార్, యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్, పార్టీ నాయకులు, జనసేన నాయకుడు గుత్తికొండ కృష్ణమోహన్, బీజేపీ నాయకులు సునీల్, యలమంచిలి పండు పాల్గొన్నారు.



కూటమి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె, అమ్మిశెట్టి వాసు



షేక్ మీరాబీని అభినందిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

నాదస్వర విద్వాంసురాలు షేక్ మీరాబీకి ఎంపీ అభినందనలు

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ని బుధవారం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం అందుకున్న నాదస్వర విద్వాంసురాలు షేక్ మీరాబీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుకాసి సరిత పాల్గొన్నారు.

డాన్‌బాస్కోలో ముగిసిన డ్రోన్ ఫెస్ట్

పటమట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గత రెండ్రోజులుగా డాన్‌బోస్కో స్కూల్లో జరుగుతున్న ఏఐ రోబో డ్రోన్‌ఫెస్ట్ బుధవారంతో ముగిసింది. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన 60 వర్కింగ్ మోడల్స్‌ను పరిశీ లించి వాటి పని తీరును అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా త్రీడి ప్రింటింగ్, రోబో హాండ్, మెడికల్ డిస్పెన్సర్, అంధులకు కళ్ల జోళ్ల తదితర వివరాలను తెలుసుకున్నారు. వారి సమక్షంలో విద్యార్థులు డ్రోన్ తయారు చేసి ఎగుర వేశారు. సుజనా చౌదరి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈవిధమైన ప్రదర్శన ఏర్పాటు చేయడం తానెక్కడా చూడలేదన్నారు. విద్యార్థులను ఈవిధంగా తీర్చిదిద్దిన పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా ఈల్యాబ్‌ను స్టార్టప్ ల్యాబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లోసాంకేతికను తీర్చిదిద్దడమే కాకుండా విద్యలో నైతిక విలువలు, తల్లిదండ్రుల పట్ల గౌరవభావం తెలుగు భాష పట్ల మమకారం పెంపొందించేందుకు పాఠశాల చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆల్ ఇండియా మనాక్ ఇన్‌స్పైర్ పోటీల్లో ఇన్‌స్పైర్ అవార్డు పొందిన లికిత్‌కుమార్ అనే విద్యార్థికి ప్రత్యేక బహుమతిని అందించారు.



నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

హైదరాబాద్ విహారయాత్రకు 101 మంది విద్యార్థులు

పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన 101మంది విద్యార్థులను హైదరాబాద్‌కు సైన్స్ విహారయాత్రకు పంపుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. విహారయాత్ర పోస్టర్‌ను విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు 22మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞాన, విహారయాత్రలో దర్శించే వివిధ జాతీయ స్థాయి సైన్స్ సెంటర్స్, ప్రయోగ, పరిశోధనా కేంద్రాల ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, సమగ్రశిక్షా ఏఎంవో అశోక్, ఏఎస్‌వో సుధాకర్, పీడీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విహారయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారి సుబ్బారావు తదితరులు



స్టెల్లా విద్యార్థినులు 150 మందికి ఉద్యోగాలు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాలలో డిగ్రీ, పీజీ చదివిన 150 మంది విద్యార్థినులకు క్యాంపస్ ఉద్యోగాలు లభించాయి. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో నైస్ ఎడ్యుకేషన్ బ్లూ స్టార్, హెచ్‌డీబీ ఫైనాన్స్, పాక్ స్కాన్, స్పీకింగ్ ట్రీ, జీఐసీఈ, టెక్‌అవుట్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని విద్యార్థినులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరు 150 విద్యార్థినులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు లక్ష్మీ హేమ, అనుపమ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్ బుధవారం అభినందించారు.

పూడికతో నిండిన సైడ్ కాల్వలు

● వర్షానికి నీటితో నిండిన రోడ్లు
● నీరు నిల్వ ఉండడంతో దోమల విజృంభణ

భారతీనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ కాలనీ జమక్ అపార్ట్‌మెంట్ సమీపంలోని గమేళబజారు రోడ్డులోని సైడు కాలువలు పూడికతో నిండిపోయాయి. పరిసరాలను శుభ్రం చేసే సిబ్బంది వీటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో కాలువలు అన్ని మట్టితో నిండిపోడంతో మురుగు నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. చిన్న వర్షం కురిసినా వాన నీరు రోడ్లపై నిలిచిపోతున్నాయి. ఇటీవల రెండు రోజుల క్రితం నగరంలో కురిసిన వర్షానికి ఈ ప్రాంతంలోని రోడ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి. ప్రసుత్తం ఈరోడ్లు వాననీరు, మురుగు నీటితో దర్శనమిస్తున్నారు. రెండు రోజులు నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో ఇంటి నుంచి కాలు బయటకు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జమక్ అపార్ట్‌మెంట్ వెనుక రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తొలగించిన కార్మికులను పనిలో పెట్టుకోండి

ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రశేఖర్ వినతి

కార్పొరేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరపాలకసంస్థలో 25, 30 ఏళ్లుగా పనిచేస్తున్న మున్సిపల్ ఆప్కాస్ వర్కర్‌లను వయసు మీరిందని విధులకు రాకుండా ఆగమనడం సరికాదని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నగర గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ వర్కర్ల కడుపు కొట్టొద్దన్నారు. వారి కుటుంబంలోని పిల్లలకైనా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు అవుతున్నా పనిభారం పెరుగుతుంది కానీ జీతాలు పెంచకుండా మీనమేషాలు లెక్కిస్తుందని అన్నారు. వెంటనే ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పంద జీవో కాపీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయస్సు మీరిందన్న కారణంతో తీసివేసిన కార్మికులను వెంటనే పనిలో పెట్టుకోవాలని, వారిని పనిలో పెట్టే విధంగా ప్రభుత్వాలు ఆలోచించాల న్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడ తామని హెచ్చరించారు. అనం తరం నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్ర శేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ జ్యోతిబస్, టి. ప్రవీణ్, టి. తిరపతమ్మ, సేలం దాసు, వి. సాంబులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు దోనేపూడి కాశీనాథ్

సమ్మర్ ఆన్‌లైన్ షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ ఆన్‌లైన్ షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్-2025కు దరఖాస్తులు ఆహ్వానించినట్టు ఆ సంస్థ అధికారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడత ఈనెల 28న, రెండో విడత మే 12 నుంచి ఆన్‌లైన్ షార్ట్‌టెర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభమవుతుందన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి మూడు, నాలుగు సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందన్నారు. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ప్రయాణికురాలి వద్ద బంగారు ఆభరణాలు, రూ.50వేలు చోరీ

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణించిన గన్నవరానికి చెందిన భీమవరపు సామ్రాజ్యం (64) వద్ద బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్ చోరీ అయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం గన్నవరం శ్రీనగర్ కాలనీలో భీమవరపు సామ్రాజ్యం కుటుంబ సభ్యులతో ఉంటుంది.

ఆమె బంధువుతో కలిసి వన్‌టౌన్ శివాలయం వీధిలో బంగారం తాడు కొనుగోలు చేయటానికి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు గన్నవరం గాంధీనగర్ వద్ద విజయవాడ వచ్చేందుకు ఆటో ఎక్కింది. ఆ ఆటోలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఎక్కారు. వారు ముగ్గురు బాధితురాలి పక్కన కూర్చొని రామవరప్పాడు వద్ద ఆటో దిగారు. బాధితురాలు, ఆమె బంధువు అదే ఆటోలో విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద దిగి మధ్యాహ్నం 2 గంటల సమయంలో నడుచుకుంటూ శివాలయం వీధిలోని ఓ బంగారు షాపు వద్దకు వెళ్లి తన వద్ద భద్రపరచిన మూడు కాసుల బంగారు తాడు, రెండు బంగారు గాజులు, రూ.50వేల నగదు భద్రపరచిన పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆటోలో తమతో పాటు ప్రయాణించిన ముగ్గురు వ్యక్తులే తమ బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్‌ను దొంగిలించి ఉంటారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా రథోత్సవం



సత్యనారాయణ పురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దేవీనగర్ కొదండరామాలయంలో కన్నుల పండువగా రథోత్సవం సాగింది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పురవీధుల్లో మేళతాళాలతో, డప్పులతో రథంపై సీతారాములను ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వీర్రాజు, గంగిశెట్టి సాంబశివరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లో జరుగుతున్న చైత్ర మాస వసంత నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షణలో అర్చకులు స్వామికి మూలమంత్ర హోమాలు, ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.

మార్గదర్శకులుగా ఎదిగేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు

తేలప్రోలు ఉషారామాలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

ఉంగుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి ప్రజోపయోగమైన నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయడం ద్వారా భవిష్యత్తులో గొప్ప మార్గదర్శకులుగా ఎదిగేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు దోహదపడతాయని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో సీఎస్‌సీ ఫైనలియర్ విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో -2025ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు 72 గ్రూపులుగా ఏర్పడి గేమింగ్, ఐఓటీ, ఎంఎల్‌అండ్‌ఏఐలపై ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వి ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, సీఎస్‌సీ విభాగాధిపతి ఎస్‌ఎం రాయ్ చౌదరి, ఏఐ విభాగాధిపతి కేపీఎన్‌వీ సత్యశ్రీ, కోఆర్డినేటర్లు ప్రవీణ్‌కుమార్, సంధ్య, సాంబశివరావు, భాగ్యశ్రీ తదితరులు ప్రాజెక్ట్ ఎక్స్‌పోను సందర్శించి విద్యార్థులను అభినందించారు.

13న అండర్ -11 చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13న పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో కృష్ణాజిల్లా అండర్ 11 బాలబాలికల చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక తెలిపారు. ఇందులో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని మే లో జరిగే అండర్-11 స్టేట్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేస్తామని, ప్రతి ఏజ్ గ్రూప్‌లో మొదటి రెండు సానాలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఈ టోర్నమెంట్ తో పాటు ఎస్ఆర్ఆర్ ఇన్విటేషన్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరుగుతుందని, ఇందులో టాప్-3లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులుంటాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునేవారు శనివారం సాయంత్రం 6గంటల లోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, వివరాలకు 9700775220, 9247153387 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

గురుకులాల్లోకి ప్రవేశ పరీక్ష 13న

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలు) 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఆదివారం జరుగుతుందని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా సమన్వయ అధికారి ఏ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు హాల్ టిక్కెట్లను హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు హాల్‌టిక్కెట్, ఏదైనా గుర్తింపు కార్డు (ఉదా.ఆధార్‌కార్డు)తో పరీక్షకు హాజరుకావాలన్నారు.



ఉండవల్లి, పెనుమాక రైతులకు ప్లాట్లను కేటాయిస్తున్న అధికారులు

ఉండవల్లి, పెనుమాక రైతులకు ప్లాట్లు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన ఉండవల్లి, పెనుమాక గ్రామాలకు చెందిన 33 మంది రైతులకు బుధవారం విజయవాడలోని ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ- లాటరీ విధానంలో 101 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 59 నివాస ప్లాట్లు కాగా 42 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఈ- లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా సీఆర్డీయే అధికారులు రైతులకు ప్లాట్లు కేటాయించారు. ఈ- లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియ చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీయే అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) వసంతరాయడు మాట్లాడుతూ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, సర్వేయర్లను నియమించామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్నికృష్ణ, సీఆర్డీయే సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు ప్రత్యేక బస్సు

బస్టేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్టలో జరుగుతున్న రాములవారి కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి ఒంటిమిట్టకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణ అధికారి ఎం.వై. దానం తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి ఒంటిమిట్టకు ఈ నెల 10వ తేదీ గురువారం రాత్రి 11 గంటలకు సర్వీసు నెంబరు 952318 బయలుదేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఒంటిమిట్ట నుంచి విజయవాడకు సర్వీసు నెంబరు 952319ను 11వ తేదీ శుక్రవారం రాత్రి 11 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. పెద్దలకు రూ.770, పిల్లలకు రూ.430 ఛార్జీ ఉంటుందని తెలిపారు. ఈ బస్సు గుంటూరులో కూడా ఆగుతుందని, కావున విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతంలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెక్ పోలీసింగ్



నేటి సమాజంలో నేరాల స్వరూపం మారుతున్న తరుణంలో, పోలీసింగ్ విధానాలూ అదే రీతిలో సాంకేతిక పరిజ్ఞానంతో అప్‌డేట్ అవుతున్నాయి. సీసీ కెమెరాలు, డ్రోన్లు, న్యాట్‌గ్రిడ్ వంటి ఆధునిక సాధనాలతో నేరాల విచారణ మరింత సమర్థవంతంగా మారుతోంది. ఎన్టీఆర్ జిల్లా పోలీసు విభాగం ఇందులో ముందంజ వేసి, సాంకేతికతను వినియోగిస్తూ క్రైమ్ కంట్రోల్‌కు మార్గదర్శకంగా నిలుస్తోంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



న్యాట్‌గ్రిడ్‌తో నిఖార్సయిన సమాచారం

న్యాట్‌గ్రిడ్ (నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్) ద్వారా దేశవ్యాప్తంగా నేరచరిత్ర ఉన్నవారి వివరాలు తెలుసుకోవచ్చు. ఎన్‌బీడబ్ల్యూలు జారీ చేయడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

- సప్త మాసాల్లో సమూల మార్పులు
- శివారు ప్రాంతాల్లో నిఘాకు డ్రోన్లు
- 'పరిధి' చుట్టూ నిఘా నేత్రాలు
- ఆచూకీ లేని నిందితుల కోసం న్యాట్‌గ్రిడ్

సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషన

డీవీ మానర్ రోడ్డులో ఒక మహిళకు బంధువులతో ఆస్తి వివాదం ఉంది. వివాదాస్పద ఇంటి వద్ద ఆమె బంధువులు చికెన్ పకోడి బండిని పెట్టించారు. అక్కడ చెత్తాచెదారం ఉండడంతో మహిళ వారం క్రితం రాత్రి ఒంటిగంట సమయంలో బయటకు వచ్చి తిట్ల దండకం మొదలుపెట్టింది. అదే సమయంలో ఐదుగురు యువకులు రెండు బైక్‌లపై వెళ్తున్నారు. ఆమె తమను తిట్టుతున్నట్టు అనుమానించిన యువకుల్లో ఇద్దరు బైక్ దిగి ఆమెను కొట్టారు. మిగతా ముగ్గురు ఆపేందుకు ప్రయత్నించినా ఆపలేకపోయారు. బాధితురాలు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. మొదటి కెమెరాలో దాడి జరిగినట్టు కనిపించినా యువకుల ముఖాలు, బైక్ నంబర్లు స్పష్టంగా కనిపించలేదు. రెండో కెమెరా పనిచేయలేదు. మూడో కెమెరాలో ఫుటేజీ చెరిగిపోయింది. చివరికి 4వ కెమెరాలో యువకుల ముఖాలు స్పష్టంగా కనిపించాయి. వెంటనే వారి ఫొటోలను తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయగా, మరుసటి రోజే వారు వడ్డేశ్వరం ప్రాంతంలోని ఓ కళాశాలకు చెందినవారని తెలిసింది. దీంతో పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కొంతమందికి విచారణకు రాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. నిందితులిచ్చిన చిరునామాలకు వెళ్లినా, బంధువుల ఇళ్లను పరిశీలించినా ఆచూకీ దొరకలేదు. న్యాట్‌గ్రిడ్‌లో వారెంట్లు ఉన్న వారి ఫొటోలను అప్‌లోడ్ చేశారు. కొద్దిరోజులకే వారి ప్రస్తుత చిరునామాల వివరాలు పోలీసులకు అందాయి. ఇలా పలువురికి ఎన్‌బీడబ్ల్యూ జారీ చేసి గుర్తించారు.



ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానది మధ్య మొలిచిన చెట్ల కింద పేకాట ఆడుతున్నవారిని పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించారు. వీరి చేతుల్లో పేకముక్కలు, మధ్యలో డబ్బులున్న దృశ్యాలు డ్రోన్‌లో నమోదయ్యాయి. వెంటనే ప్రత్యేక బృందం వెళ్లి వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించింది. ఈ ఘటనలన్నీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించిన కేసులకు ప్రత్యక్ష ఉదాహరణలు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ఎస్వీ రాజశేఖరబాబు పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు తెచ్చారు. కేసు పెద్దదా, చిన్నదా అనే తేడా లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు.



వేలిముద్రల స్కాన్..

సీసీ కెమెరాల నిఘా

ఇప్పటి వరకు 600కు పైగా కేసులు సీసీ కెమెరాల ఆధారంగా ఛేదించారు. ప్రస్తుతం 15 వేల సీసీ కెమెరాలు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటయ్యాయి. వీటిని విజయవాడ ఎంజీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ప్రతి గ్రామంలోనూ కనీసం రెండు నుంచి మూడు కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

గగనతలం నుంచి..

ఒక డ్రోన్ పనితీరు 1000 సీసీ కెమెరాలకు సమానమని అధికారులు భావిస్తున్నారు. దసరా ఉత్సవాలు, వరదల సమయంలో డ్రోన్ల ఉపయోగం ప్రభావవంతంగా ఉండటంతో, మొత్తం 28 పోలీస్ స్టేషన్లకు ఒక్కో డ్రోన్ అందజేశారు. 500 మందికి పైగా మహిళా పోలీసులను డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చారు. డ్రోన్లను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు.



ఇటీవల జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డ్రోన్ వివరాలు తెలియజేస్తున్న అధికారులు

చెరగని 'ముద్ర'

కేసు ఏదైనా సరే నిందితులు రిమాండ్‌కు వెళ్తున్నారంటే వారి చరిత్రను మొత్తం పోలీసులు భద్రపరుస్తున్నారు. ఇందులో భాగంగా నిందితుల వేలిముద్రలు, ఫొటోలను సీసీటీఎన్ఎస్‌లో భద్రపరుస్తున్నారు. ఇప్పటికే ఇంటర్‌సెప్ట్ వాహనాలు, ఈగల్ వాహనాలకు మొబైల్ స్కానింగ్ డివైస్‌లు ఇచ్చారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా ఉన్నవారి వేలిముద్రలు స్కాన్ చేయగానే వారి నేర చరిత్ర బయటపడుతుంది.

80 లక్షల ఉపాధి పనిదినాలే లక్ష్యం

- సగటు వేతనం రూ.307 వచ్చేలా అధికారులు కృషి చేయాలి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో వేతనదారులకు పనికల్పించడంలోనూ, సగటు దినసరి వేతనం రూ.370 వచ్చేలా చూడటంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డ్వామా అధికారులతో కలిసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, గ్రామాల వారీగా వేతనదారుల హాజరు, వారికి అందుతున్న వేతనం తదితరాల్లో పురోగతిని సమీక్షించారు. 2025-26కు గాను జిల్లాలో 80 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించామని, గతేడాది గణాంకాల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు 2,737 పంట కుంటల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించగా, 69 కుంటల నిర్మాణం 100 శాతం పూర్తయిందని, మరో 1,029 పంట కుంటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిని త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలన్నారు. వేసవిలో పశువులతో పాటు గొర్రెలు, మేకలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికి 277 తొట్టెల పనులు గుర్తించి, పనులు చేపట్టగా, మిగిలిన వాటికి అనుమతుల ప్రక్రియ ఈనెల 12 నాటికి పూర్తిచేయాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు 2025-26లో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 20ఎకరాలను గుర్తించాలని, జిల్లా లక్ష్యం 4వేల ఎకరాలుగా ఉందన్నారు. డ్వామా పీడీ ఏ రాము, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

చంద్ర స్ఫూర్తితో హక్కులు సాధిద్దాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ శిఖరం, సుదీర్ఘకాలంపాటు సీపీఐ కేంద్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఏకైక నేత చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో హక్కులు సాధించుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు నిచ్చారు. బుధవారం చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా విజయవాడ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రామకృష్ణ, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26ఏళ్ల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నేతృత్వం వహించి రాజేశ్వరరావు ప్రత్యేకత చాటుకున్నారన్నారు. ఉమ్మడి ఏపీలో కమ్యూనిస్టు ఉద్యమానికి బీజం వేసింది తొలితరం నేతలు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య అని చెప్పడంలో సందేహం లేదన్నారు. 13 ఏళ్ల మోదీ పాలనలో రాజ్యాంగానికి రక్షణ లేకుండా పోయిందని, లౌకికవాదాన్ని మట్టుపెట్టేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతుందన్నారు. కమ్యూనిస్టువాదులందరూ సమైక్య పోరాటంతో హక్కులు సాధించుకున్నప్పుడే చంద్ర రాజేశ్వరరావుకు ఘనమైన నివాళులన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర, జిల్లా నేతలు జి.ఈశ్వరయ్య, దోనేపూడి శంకర్, లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, వై.చెంచయ్య, ప్రొఫెసర్ సీ నరసింహారావు, కె.శివారెడ్డి, నాసర్, కె.వి.భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణరావు, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజమార్గాలకు ముందడుగు

రాజధానిలో ఈ-13, ఈ-15 రోడ్ల విస్తరణకు టెండర్లు

- కురగల్లు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్-16 వరకు ఈ-13 రోడ్డు
- రూ.70కోట్ల వ్యయంతో టెండర్లు
- నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్-16 వరకు ఈ-15 రోడ్డు
- సీడ్ యాక్సెస్ రోడ్డుకు రైతుల సహాయ నిరాకరణ
- ప్రత్యామ్నాయ రాజమార్గాల అభివృద్ధి

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి ప్రధాన రాజమార్గాలకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) టెండర్లు పిలిచింది. కురగల్లు నుంచి ఈ-13, నిడమర్రు నుంచి ఈ-15 రోడ్లను అమరావతి ప్రధాన రాజమార్గాలుగా 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కు అనుసంధానించేందుకు టెండర్లు పిలిచింది. అమరావతి రాజధానికి ప్రధాన రాజమార్గంగా సీడ్ యాక్సెస్ రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ దీన్ని ఎన్‌హెచ్ - 16కు అనుసంధానం చేయటంలో సమస్యలు ఏర్పడ్డాయి. స్థానిక ఉండవల్లి రైతులు కొందరు భూములిచ్చే విషయంలో అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు. సహాయ నిరాకరణ చేపడుతున్నారు. దీంతో సీడ్ యాక్సెస్ రోడ్డు మొదటి ఫేజ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. రెండో ఫేజ్ పనులు ఉండవల్లి నుంచి మణిపాల్ హాస్పిటల్ మీదుగా కనకదుర్గ వారధి దిగువన ఎన్‌హెచ్-16కు అనుసంధానించాల్సి ఉంది. ఇక్కడ ఉండవల్లి రైతుల సహాయ నిరాకరణతో సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో ఫేజ్ పనులు చేపట్టడం ఇప్పట్లో కష్టంగా ఉంది. సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములు తీసుకునే విషయంలో దాదాపుగా 40 కేసులకుపైగా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును విస్తరించేందుకు గతంలో మంత్రి నారాయణ రైతుల ఇంటికెళ్లి విజ్ఞప్తి చేశారు. కొంతమంది సహకరించినా, మరికొందరు సహకరించలేదు. తమవి ఖరీదైన భూములు కాబట్టి ప్యాకేజీ పెంచాలని మరికొందరు డిమాండ్ చేశారు. ప్యాకేజీ అనేది ఎవరికైనా సమానంగా ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయం. కొంతమందికి ఎక్కువగా ఇచ్చి, మరికొందరికి తక్కువగా ఇవ్వటం తప్పుడు సంకేతాలను ఇస్తుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం కూడా తాను అనుకున్న ప్రకారం కట్టుబడి ఉంది. ఎన్నో దఫాలు రైతులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇప్పటికీ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. రాజధానిలో రూ.41వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచినప్పటికీ రాజధానికి రాజమార్గాల అంశం తేలటం లేదు. దీంతో ఏడీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ-13, ఈ-15 రోడ్లను ఎన్‌హెచ్-16కు అనుసంధానించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ-13 రోడ్డును కురగల్లు నుంచి 7.29 కిలోమీటర్ల మేర మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ-15 రోడ్డును నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా 3.52 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్-16కు అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ రెండు రోడ్లకు సంబంధించి ఏడీసీ అధికారులు తాజాగా టెండర్లు పిలిచారు. ఈ-13 రోడ్డును రూ.70కోట్ల వ్యయంతో వరదనీటి కాలువలతో సహా నిర్మించేందుకు టెండర్లు పిలవటం జరిగింది. ఈ-15 రోడ్డును రూ.384.76 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవటం జరిగింది. ఈ రెండు ప్రధాన రాజమార్గాలను రెండేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం అందాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా, కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల రక్షణతోపాటు ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధకచట్టం - జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. అట్రాసిటీ కేసుల విచారణలో పురోగతి, బాధితులకు పరిహారం, క్షేత్రస్థాయిలో పౌరహక్కుల రక్షణకు తీసుకొంటున్న చర్యలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించేందుకు, కేసుల సత్వర విచారణలో అవరోధాలు ఎదురు కాకుండా చూడాలన్నారు. 2022, ఏప్రిల్ 4 నుంచి ఇప్పటి వరకు తిరువూరు డివిజన్‌లో 10 కేసుల్లో బాధితులకు రూ.10,75,000, విజయవాడ డివిజన్‌లో 150 కేసుల్లో బాధితులకు రూ.1,78,21,250, నందిగామ డివిజన్‌లో 56 కేసుల్లో బాధితులకు రూ.65 లక్షలు మేర మొత్తం 216 కేసుల్లో దాదాపు 2.54 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించామన్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ 2023 డిసెంబరు 21 నుంచి 2024 డిసెంబరు 31 వరకు పశ్చిమ, దక్షిణ, ఉత్తర, మధ్య డివిజన్లతో పాటు నందిగామ, మైలవరం డివిజన్లు, మహిళా పీఎస్ పరిధిలో వేధింపుల నిరోధక చట్టానికి సంబంధించి 31 పెండింగ్ అండర్ ఇన్వెస్టిగేషన్, 30 పెండింగ్ ట్రయల్ కేసులు ఉన్నాయన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీసీపీ కేజీవీ సరిత, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీఓలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేద్దాం

జిల్లా సమగ్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఉద్యోగులు, అధికారుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేసి ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చడంలో భాగస్వాములవుదామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగర కార్యవర్గసభ్యులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా శాఖకు నిర్వహించిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, సహాధ్యక్షుడు వీవీ ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధిపథంలో అగ్రగామిగా నిలపడంలో ఉద్యోగుల సహకారం ఎంతో కీలకమైందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువచేయడంలో ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్ సత్కరించి అభినందనలు తెలిపారు. బి.సతీష్‌కుమార్, డి.విశ్వనాథ్, జి.రామకృష్ణ, బీవీ రమణ, వి.నాగార్జున, కె.శివలీల, సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, ఎం.శ్రీనివాసరావు, కాశీం సాహెబ్, రాంబాబు, విజయశ్రీ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ యార్డులో సెక్యూరిటీ టవర్లు

- నేడు రైల్వే అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్

ఆంధ్రజ్యోతి - విజయవాడ: విజయవాడ రైల్వేయార్డులో సంఘ వ్యతిరేక శక్తులు హల్చల్ చేస్తున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో సెక్యూరిటీ వాచ్ టవర్లను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలు మితిమీరుతున్నాయి. ఇటీవల కోచింగ్ డిపో వద్ద ఆగి ఉన్న రైలుకు నిప్పుపెట్టిన సంగతి తెలిసిందే. యార్డులోని ఇనుప సామగ్రి చోరీలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా కృష్ణా కెనాల్ నుంచి విజయవాడ నార్త్ క్యాబిన్ వరకు సెక్యూరిటీ వాచ్ టవర్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ ప్రాంతంలో సెక్యూరిటీ వాచ్ టవర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఈ ప్రాంతంలో సెక్యూరిటీ టవర్ల ఏర్పాటు అంశంపై రైల్వే అధికారులు పరిశీలించనున్నారు. ఆర్పీఎఫ్ బలగాలు ప్రతిరోజూ ఈ సెక్యూరిటీ టవర్స్ వద్ద విధులు నిర్వహిస్తూ, విజయవాడ రైల్వే యార్డును పరిశీలించనున్నారు. ఎక్కడైనా సంఘ విద్రోహ శక్తులు కనిపిస్తే వెంటనే అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ఎస్‌జీటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు హామీ

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజును బుధవారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర, నగర అధ్యక్ష, కార్యదర్శులు జూలపల్లి శ్రీనివాసరావు, రొంగలి గణేష్‌లు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వీఎంసీ ఉన్నత పాఠశాలలో మంజూరయిన ఎస్‌జీటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ ఇంతవరకు జరగలేదని, రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలో 2009 సంవత్సరం నాటికి అప్ గ్రేడ్ చేశారని వారు వివరించారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ విజయరామరాజు ఎస్‌జీటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేస్తామని, అతిత్వరలో తీపి కబురు అందిస్తామని వారికి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి యాసం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దళితుల భద్రత ప్రశ్నార్థకం

- పోతుల బాల కోటయ్య

గాంధీనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దళితుల భద్రత, భరోసా ప్రశ్నార్థకంగా మారాయని, గత వైసీపీ పాలనలో దళితులపై జరిగిన అమానుష గాయాలను మరలా పునరావృతం కావడాన్ని చూస్తూ ఊరుకోమని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాల కోటయ్య హెచ్చరించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో కూడా దళిత మహిళలపై దాష్టీకం జరగడం దురదృష్టకరమన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అరికట్టాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏడాది కూటమి పాలనలో ఎస్సీ, ఎస్టీలపై చోటుచేసుకుంటున్న అఘాయిత్యాలు ప్రభుత్వ లక్ష్యాలు, విజనరీని దెబ్బతీస్తాయన్నారు. అణగారిన కులాలపై జరుగుతున్న దౌర్జనాలను అరికట్టేందుకు తక్షణమే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దళితుల సంక్షేమం, రక్షణ, భద్రతకు ఏర్పాటు చేసిన కమిషన్‌లను ఏడాదైనా నియమించకపోవడం ఆక్షేపణీయమన్నారు.



పైనాపిల్ సబ్జా షర్బత్

శరీర ఉష్ణోగ్రతలను చల్లపర్చటంలో సబ్జా గింజలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వేసవిలో సబ్జా గింజల ఆధారిత షర్బత్‌లను తాగితే ఎన్నో రకాల ఉపయోగాలు ఉంటాయి. పైనాపిల్, సబ్జా గింజలతో కలిపి షర్బత్ ఎలా చేయవచ్చో తెలుసుకుందాం.

తయారీ విధానం

- పైనాపిల్ పైన తొక్క తీసి చిన్న చిన్న ముక్కలుగా చేయాలి. ఈ ముక్కలను కుక్కర్‌లో వేసి రెండు కూతలు వచ్చే దాకా ఉడికించాలి. ఇలా ఉడికించటం వల్ల పైనాపిల్ మరింత రుచికరంగా తయారవుతుంది.
- రెండు స్పూనుల సబ్జా గింజలను ఒక గిన్నెలో నీళ్ల పోసి నానబెట్టాలి.
- ఉడికిన ముక్కలను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. ఈ ముద్ద నుంచి రసం పిండాలి.
- ఈ రసంలో కొద్దిగా తేనె, యాలకుల పొడి, నిమ్మరసం వేసి కలపాలి. ఆ తర్వాత నానబెట్టిన సబ్జా గింజలను రసంలో వేసుకోవాలి.



కౌన్సెలింగ్

వరుస గర్భస్రావాలకు అడ్డుకట్ట ఎలా?

Q డాక్టర్! నాకిప్పుడు రెండో నెల. ఇది నా మూడో ప్రెగ్నెన్సీ. గతంలో రెండు సార్లూ ఐదో నెలలోనే గర్భస్రావం అయిపోయింది. రెండో ప్రెగ్నెన్సీలో గర్భసంచికి కుట్లు వేసినా గర్భం నిలవలేదు. ప్రస్తుతం గర్భం నిలవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

A సాధారణంగా గర్భస్రావాన్ని నివారించడం కోసం కొందరు మహిళలకు గర్భసంచి ముఖద్వారం దగ్గర సర్వైకల్ స్టిచ్ అవసరమవుతుంది. 16 వారాల తర్వాత గర్భస్రావం అయిన సందర్భాల్లో, 24 వారాల లోపు కాన్పు జరిగిపోతున్న సందర్భాల్లో, ఉమ్మనీరు కోల్పోతున్న సందర్భాల్లో, సర్విక్స్ ప్రాంతంలో సర్జరీలు జరిగి ఉన్న సందర్భాల్లో, గర్భం దాల్చిన 12 నుంచి 24 వారాల మధ్య ఈ కుట్టు వేస్తారు. అయితే మీ విషయంలో గర్భం నిలవడం కోసం గర్భసంచికి కుట్టు వేసినా గర్భస్రావం అయిందని అంటున్నారు. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ట్రాన్స్ అబ్డామినల్ సర్‌క్లేజ్ చేయవలసి ఉంటుంది. పొట్ట మీద చిన్న గాటు పెట్టి, ల్యాప్రోస్కోపీ ద్వారా ఈ చికిత్స చేయడం జరుగుతుంది. అయితే వరుస గర్భస్రావాలు జరుగుతున్న మహిళలకు గర్భం దాల్చక ముందే ఈ చికిత్స చేయాలి. కానీ మీరు ఇప్పటికే గర్భం దాల్చి ఉన్నారు కాబట్టి 12 వారాల స్కాన్ తర్వాత అబ్డామినల్ సర్‌క్లేజ్ వేయించుకోవచ్చు. అందుకు ఎంతో నైపుణ్యం అవసరమవుతుంది. అందుకు నిపుణులైన వైద్యులను ఆశ్రయించాలి. సర్‌క్లేజ్ వేయించుకున్న గర్భిణులకు సాధారణ ప్రసవం సాధ్యపడదు. తప్పనిసరిగా సిజేరియన్ చేయవలసి వస్తుంది. ట్రాన్స్ అబ్డామినల్ సర్‌క్లేజ్ వల్ల గర్భం నిలిచే అవకాశం వెజైనల్ సర్‌క్లేజ్ కంటే మెరుగ్గా ఉంటుంది.



డాక్టర్ ప్రమత శిరీష
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, సికింద్రాబాద్.


బెండకాయ నీళ్లతో ఇన్ని లాభాలా..!

బెండకాయలను చిన్న ముక్కలుగా కోసి వెడల్పాటి గిన్నెలో వేయాలి. అవి మునిగేవ రకూ నీళ్ల పోసి రాత్రంతా నానబెట్టాలి. తెల్లారిన తరవాత మరో గిన్నెలోకి వడబోయాలి. ఈ నీటినే బెండకాయ నీళ్ల లేదా ఓక్రా వాటర్ అంటారు. ఈ నీటిని తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...



- బెండకాయ నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి అకాల వార్ధక్యాన్ని నివారిస్తాయి. చర్మం మీద ముడతలు, ముఖం మీద మొటిమలు రాకుండా కాపాడతాయి. గుండె జబ్బులు రావు.
- బెండకాయ నీళ్ల తాగడం వల్ల సి, కె విటమిన్లు లభిస్తాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీనివల్ల చర్మం బిగుతుగా మృదువుగా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- మలబద్ధకం రాదు. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. జీర్ణ శక్తి పెరుగుతుంది. కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.
- రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. మధుమేహ సమస్యలు తలెత్తవు.
- బెండకాయ నీళ్లలో ఫైబర్ కరిగి ఉంటుంది. ఈ నీటిని తాగితే చాలాసేపటివరకూ కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల అతిగా తినాలని అనిపించదు. శరీర బరువు అదుపులో ఉంటుంది.
- శరీరంలో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. గుండె, కాలేయం ఆరోగ్యంగా ఉంటాయి.

సంకల్పం



కాపురం అన్నాక కలహాలు సహజమే. సర్దుకుపోతే అవి టీకప్పులో తుపానులే. ఇది ఒకప్పుడు. మరి ఇప్పుడు..! చిన్న చిన్న మనస్పర్థలకే ఇక కలిసి ఉండలేమని నిర్ణయానికి వచ్చేస్తున్నాయి జంటలు. లోపం ఎక్కడుంది? ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడంలోనా? వారికి అర్థమయ్యేట్టు చెప్పడంలోనా? భార్యాభర్తలు... తల్లిదండ్రులు... రెండు వైపులా లోపం ఉందంటారు ప్రముఖ న్యాయవాది జ్యోతిరావు. 'మధ్యవర్తిత్వం'తో ఎన్నో జంటలను ఆమె కలిపారు. ఇప్పటిదాకా నాలుగు వందలకు పైగా కేసులు పరిష్కరించిన ఆమె 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.



బంధాలకు భరోసా

"భార్య, భర్త, పిల్లలు... అందరూ కలిస్తేనే కుటుంబం అవుతుంది. అలా కాకుండా తల్లి దగ్గరో, తండ్రి దగ్గరో... ఒక్కరి వద్దే పిల్లలు పెరిగితే అది వారి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఎలాగైతే ఇద్దరూ కలిసి ఒక ప్రాణిని ఈ ప్రపంచంలోకి తీసుకువచ్చారో, అలాగే కలిసి వాళ్లని పెంచాల్సిన బాధ్యత కూడా భార్యాభర్తలపై ఉంటుంది. భేదాభిప్రాయాలు ఉంటే అవి వారి మధ్యనే ఉండాలి. ఎందుకంటే పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలంటే బలమైన కుటుంబ వ్యవస్థ అనేది ఎంతో కీలకం. న్యాయవాదిగా హైదరాబాద్‌లోనే కాదు, ఢిల్లీలో కూడా వివిధ కోర్టుల్లో ఇలాంటి ఎన్నో కేసులు వాదించిన అనుభవం నాది. ముప్పై ఏళ్లకు పైగా ఈ వృత్తిలో ఉన్నాను. నేను ప్రాక్టీస్ చేసే రోజుల్లో ఒక న్యాయవాదిగా క్లయింట్లు పడే ఇబ్బందులు, ఏళ్లకు ఏళ్ల వాళ్ల కోర్టుల చుట్టూ తిరగడం చూసి నాకు బాధ అనిపించేది. అప్పుడు కూడా చాలావరకు 'మధ్యవర్తిత్వం' (మీడియేషన్) ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నించాను. ముఖ్యంగా దేశంలోని కోర్టుల్లో కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని సరిగ్గా నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో 'అమికా ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ కౌన్సిల్' ప్రారంభించాను. ఇందులో శిక్షణ కూడా ఇస్తున్నాను.

నాలుగు వందలకు పైనే...

మా మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ఈ నాలుగేళ్లలో నాలుగు వందలకు పైగా కేసులు నా దగ్గరకు వచ్చాయి. అందులో అత్యధికం భార్యాభర్తల గొడవలు. అవికాకుండా కుటుంబంలో ఆస్తి తగాదాలు. వీటిల్లో తొంభై శాతానికి పైగా కేసులు నేను పరిష్కరించాను. విడాకుల వరకు వచ్చిన భార్యాభర్తలను తిరిగి ఒక్కటిగా ఇంటికి పంపగలిగాను. సీపీసీ సెక్షన్ 320 కిందకు వచ్చేవన్నీ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఏళ్లకు ఏళ్ల కోర్టుల చుట్టూ తిరిగి కాలం, డబ్బు వృథా కాకుండా మన ముందున్న చక్కని అవకాశం ఇది. ఇరు పార్టీల మధ్య సయోధ్య కుదిర్చి ఒక 'అవార్డు' పాస్ చేస్తాం. కోర్టులో డిక్రీ ఎలాగో ఇది కూడా అలానే చెల్లుతుంది. మధ్యవర్తిత్వం అంటే... రాజీ కుదర్చడం. కోర్టు బయట వివాదాలను పరిష్కరించుకొనే మార్గం.

కౌన్సెలింగ్ అవసరం...

నా దగ్గరకు వచ్చే భార్యాభర్తల కేసుల్లో ఎక్కువగా అనుగుణ్యత (కంపాటబిలిటీ) లేకపోవడం, అనవసరంగా అహానికి పోవడం... ఇలాంటివే ఉంటాయి. ముఖ్యంగా మగవారి నుంచి వచ్చే సమస్య ఏమిటంటే... పిల్లలు పుట్టకపోతే తాము సంసారిక జీవితానికి పనికివస్తారా లేదా అనే పరీక్షలు చేయించుకోరు. ప్రతిదీ భార్య మీద రుద్దేయడం, లేదంటే విడాకులు తీసుకొందామని ఒత్తిడి చేయడం. టెస్టు చేయించుకొంటే అదేదో అపచారం చేసినట్టు చాలామంది మగవాళ్ల భావిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారికి వంతపాడుతున్నారు. ఇలాంటివి చాలా కేసులు వచ్చాయి. 'నీవల్లే పిల్లలు కలగడంలేద'ని ఒక అమ్మాయితో భర్త గొడవ. వారు నా దగ్గరకు వచ్చారు. అమ్మాయికి మెడికల్ చెకప్ చేయించి చెప్పాను... 'అమ్మా... నువ్వు ఇతన్ని వదిలేసెయ్. లోపం నీలో లేదు' అని. ఒకవేళ ఇద్దరూ ఉద్యోగస్తులైతే 'నేను రెండు లక్షలు సంపాదిస్తున్నా' అంటే 'నేనూ రెండు లక్షలు సంపాదిస్తున్నా' అని ఇగోలకు వెళుతున్నారు. అంత సంపాదిస్తుండంతో ఒకరి మాట ఒకరు వినరు. అందుకే పెళ్లికి ముందు ఒకరికి ఒకరు సరిపోతారా లేదా అనేది తెలుసుకోవడానికి కౌన్సెలింగ్ అవసరం.



అతిగా కల్పించుకోకూడదు...

ఈ రోజుల్లో పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకోబోయేవరకు తల్లిదండ్రులు పెళ్లయిన పిల్లలతో ఒకటే మాట్లాడడం, ఏదోఒకటి చెప్పడం జరుగుతోంది. పిల్లలు కూడా ప్రతి చిన్న విషయాన్నీ వేరొకరితో పంచుకొంటున్నారు. గోప్యత అనేది లేకుండా పోతోంది. మనం భార్యాభర్తలం, మనది ఒక కుటుంబం అనే స్పృహ ఉండడంలేదు. తల్లిదండ్రులు కూడా పిల్లల సంసారాల్లో అతిగా కలుగచేసుకోకూడదు. ప్రతి విషయంలో దూరిపోకూడదు. దూరం నుంచి గమనిస్తుండాలి. వాళ్ల సమస్యలు వాళ్ల పరిష్కరించుకొనే అవకాశం కల్పించాలి.

ఎయిర్‌పోర్టులో వదిలేసి...

నా దగ్గరకు విదేశాల్లో ఉండేవారి నుంచి కూడా కేసులు వస్తుంటాయి. అలాంటివారికి ఫోన్‌లోనే మాట్లాడి మధ్యవర్తిత్వం చేస్తుంటాను. కొన్ని కేసులు చూసినప్పుడు గుండె బరువెక్కిపోతుంటుంది. ఒక కేసులో అయితే... తన ఆటిజమ్ పిల్లాడిని, భార్యను విమానాశ్రయంలోనే వదిలేసి విదేశాలకు వెళ్లిపోయాడు ఒకతను. 'పిల్లాడిని చంపేయనన్నా చంపేయ్. లేదా ఇక్కడే వదిలేయ్. కాదంటే నువ్వు కూడా నాతో రావద్దు' అని భర్త అంటే... అందుకు ఆ అమ్మాయి ఒప్పుకోలేదు. తనకు ఉద్యోగం కూడా లేదు. ఎలా బతుకుతుంది? నేను అతనితో ఫోన్‌లో మాట్లాడి మెయింటేనెన్స్ ఇప్పించగలిగాను.

కుటుంబ వ్యవస్థ దెబ్బతినడంవల్లే...

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కుటుంబ వ్యవస్థ దృఢంగా ఉండేది. కానీ ఇప్పుడు భార్య, భర్త, ఒకరిద్దరు పిల్లలతో అతి చిన్న కుటుంబాలు అయిపోయాయి. ఎవరి సంపాదన వారిది. మొబైల్ ఫోన్లవల్ల పక్కపక్కనే ఉన్నా ఎవరి గోల వారిది. చెప్పడానికి అనుభవజ్ఞులైన పెద్దలు లేక ప్రతి చిన్నదానికీ గూగుల్‌లో వెతికి, అలానే చెయ్యాలనే నిర్ణయానికి వచ్చేస్తున్నాం. యాంత్రిక జీవనంలో అనుబంధాలు మాయమైపోతున్నాయి. వీటన్నిటివల్ల కాపురాలు కూలిపోతున్నాయి. పెళ్లయిన మూడు రోజులకే కాదు... ముప్పై ఏళ్ల కలిసి జీవించి తెగదెంపులు చేసుకున్న బంధాలూ ఉంటున్నాయి. ఇవన్నీ కుటుంబ వ్యవస్థ దెబ్బతినడంవల్ల జరిగే పరిణామాలు అనేది నా అభిప్రాయం.

సవాళ్లతో కూడుకున్నది...

కుటుంబ కలహాలు చాలా సున్నితమైనవి. మనం వాళ్లకు దగ్గరగా వెళ్లి, ధైర్యం చెప్పి, ఒప్పించగలగాలి. అందుకు వాళ్ల చెప్పింది ఓపిగ్గా, మనసు పెట్టి వినగలగాలి. తగిన సలహా ఇచ్చి తిరిగి వాళ్లను ఆనందంగా ఇంటికి పంపగలగాలి. నా దృష్టిలో అదే అసలైన మధ్యవర్తిత్వం. ఇది ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. నా దగ్గరకు వచ్చేవారిలో అత్యధికంగా ఆర్థిక స్థోమత లేనివారే ఉంటారు. వాళ్లకు నేను ఉచితంగానే సేవలు అందిస్తాను. ఇవ్వగలిగినవారి నుంచి కూడా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే తక్కువ తీసుకొంటాను. ఎందుకంటే నాకు డబ్బు ముఖ్యం కాదు. అర్థంపర్థంలేని గొడవలతో విచ్ఛిన్నం అవుతున్న మన కుటుంబ వ్యవస్థను నిలబెట్టాలన్నది నా సంకల్పం. కలసి ఉంటే కలదు సుఖం అని పెద్దలు అన్నారు కదా. అందుకే కుటుంబాలను కలిపి ఉంచేందుకు ఓపిక ఉన్నంతవరకూ కృషి చేస్తాను."

• హనుమా

అనాలోచితంగా...

పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కాదు, ప్రేమించి, కొన్నేళ్ల సహజీవనం తరువాత చేసుకున్న పెళ్లిళ్ల కూడా ఎక్కువ కాలం నిలబడడంలేదు. విడాకులకు వెళ్లేవాటిలో ప్రేమ పెళ్లిళ్లే ఎక్కువగా ఉంటున్నాయి. ఇందుకు కారణం... తమకు ఏంకావాలో కూడా స్పష్టత లేకుండా జంటలవుతున్నారు. తేడా వస్తే కుటుంబం మొత్తాన్నీ కేసుల్లోకి లాగుతున్నారు. సంబంధాలు కలుపుకొనేటప్పుడు గుణగణాల గురించి ఆలోచించకుండా కేవలం డబ్బు కోణంలోనే అన్నిటినీ బేరీజు వేసుకొంటున్నారు. సమస్య వచ్చినప్పుడు ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడంవల్లే కాదు, వారికి అర్థమయ్యేట్టు చెప్పేవాళ్ల లేక కూడా బంధాలు బలహీనపడుతున్నాయి.

అభిరుచే ఆదాయ వనరుగా...

మనలో చాలామంది చిన్నప్పుడు పేపర్లతో రకరకాల వస్తువులు చేసే ఉంటారు. కానీ వాటిపై మక్కువ పెంచుకొని.. దానినే ఆదాయ వనరుగా మార్చుకొనేవారు తక్కువ మందే కనిపిస్తారు. అది కూడా పర్యావరణహితంగా! ఒడిశాకు చెందిన అలాంటి గిరిజన మహిళ సుధారాణి మరాండి.



చిన్నప్పటి నుంచి సుధారాణికి హస్తకళలంటే ఆసక్తి. ఖాళీ సమయాల్లో పాత పేపర్లను తీసుకొని కట్ చేస్తూ ఉండేది. రకరకాల ఆకృతులు చేసేది. ఇంట్లో వారికి చదువుకోకుండా ఇలా ఆకృతులు చేయటం ఇష్టం ఉండేది కాదు. "నన్ను ఒక అధికారిగా చూడాలనేది నాన్న ఆశ. నాకు హస్తకళలంటే ఇష్టం. ఇంట్లోవాళ్ల నన్ను చదువుకొమ్మని ఒత్తిడి పెడుతూ ఉండేవారు. కానీ నేను చేసిన ఆకృతులు చూసి స్కూల్లో నన్ను ప్రశంసిస్తూ ఉండేవారు. ఇంట్లో అమ్మ, నాన్నలకు తెలియకుండా క్విల్లింగ్ పేపర్ కొని ఆకృతులు తయారుచేసేదాన్ని" అంటారు సుధారాణి. స్కూలు నుంచి కాలేజీకి వచ్చిన తర్వాత కూడా ఈ అభిరుచి కొనసాగింది. కాగితంతో ఆకృతులు ఎక్కువ కాలం నిలవవు. అందుకని చెట్ల నారుతో కూడా ఆకృతులు తయారుచేసేది. "చెట్ల నారుతో తయారు చేయటం అంత సులభం కాదు. కానీ చూడటానికి చాలా బావుంటాయి. ఈ మధ్యకాలంలో నారుతో తయారుచేసే రకరకాల ఆకృతులకు మంచి డిమాండ్ ఉంది" అంటారు సుధారాణి. మొదట్లో తన స్నేహితులకు ఈ ఆకృతులను బహుమతులుగా ఇచ్చేది. తర్వాత కొందరు వీటిని కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. ఇలా సుధారాణి ప్రస్థానం ముందుకు సాగింది. 2106లో ఎంబీఏలో చేరిన తర్వాత సుధారాణికి ఈ తరహా ఉత్పత్తులకు ఉన్న అవకాశాల గురించి తెలిసింది. స్థానికంగా ఉన్న ఫైబర్ బోర్డు సహకారంతో రకరకాల టిష్యూ బాక్సులు తయారుచేయటం.. వాడిపడేసిన కార్డ్‌బోర్డులు, టెట్రాప్యాక్‌లతో అందమైన కళాకృతులు రూపొందించటం మొదలుపెట్టింది. "ప్రతి వారి ఇంట్లో బాక్సులు ఉంటాయి. టెట్రాప్యాక్‌లు కూడా ఉంటాయి. వీటిని బయట పడేస్తూ ఉంటాం. ఇలాంటి వాటిని సేకరించి వాటిని ఆదాయ వనరులుగా మార్చుకోవచ్చు" అంటారు సుధారాణి.

నెమ్మదిగా...

మొదట్లో ఇంటి నుంచే కళాకృతులు విక్రయించిన సుధారాణి 2018లో 'రునుక్ క్రాఫ్ట్స్'ను ప్రారంభించింది. మార్కెట్లో మిషన్లపై తయారు చేసే రకరకాల ఆకృతులు అందుబాటులో ఉండటంతో సుధారాణికి మొదట్లో వ్యాపారం అనుకున్నంత విజయవంతమవ్వలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఆన్‌లైన్ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. దీనితో తనతో పాటుగా మరి కొంత మంది మహిళలకు ఉపాధి కల్పించటం ప్రారంభించింది. "ప్రస్తుతం నా ఆదాయం లక్షల్లో ఉంది. ఆదాయం కన్నా నేను చిన్నప్పుడు ఆకృతులు చేస్తుంటే అడ్డుకున్న నాన్న నన్ను పొగుడుతున్నారు. అంతే నేను ఎంచుకున్న మార్గం విజయవంతమయినట్లే కదా.." అంటారు సుధారాణి.

కొంతమంది ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూస్తూ అతిగా ఆలోచిస్తూ ఉంటారు. దీనివల్ల మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. అనవసరమైన ఆలోచనలను దూరం చేసేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే...

అతిగా ఆలోచించవద్దు..!



- మనసుకు నచ్చిన పని చేస్తూ అందులో లీనమైతే అనవసరమైన ఆలోచనలు రావు. ఏదైనా హాబీ, సృజనాత్మక కార్యక్రమాలు, చేతి పనులు లాంటి వాటి మీదికి దృష్టి మరలిస్తే ఆందోళన అనేదే ఉండదు.
- భయం, ఆందోళనలను మౌనంగా భరించకుండా స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో పంచుకుంటే ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.
- ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం కొద్దిసేపు ధ్యానం చేస్తూ ఉంటే భావోద్వేగాలపై నియంత్రణ పెరుగుతుంది. ఆలోచనలు నిశ్చలంగా ఉంటాయి.
- ప్రతికూలంగా మాట్లాడుతూ నిరుత్సాహపరచేవారి నుంచి దూరంగా ఉండడం మంచిది. దీనివల్ల మానసిక ఆందోళన తగ్గుతుంది.
- మనసులోని భావాలను కాగితం మీద రాయడం అలవాటు చేసుకుంటే భారమైన భావోద్వేగాలు బయటికి వ్యక్తమవుతాయి. మనసు తేలిక పడుతుంది.
- ప్రకృతిని ఆస్వాదిస్తూ విహారయాత్రలకు వెళ్లడం వల్ల మనసు ఉపశమనం పొందుతుంది. కొత్త ప్రదేశాలు చూసినప్పుడు కలిగే అనుభూతులు... అనవసరమైన ఆలోచనలను దూరం చేస్తాయి.
- గతం, భవిష్యత్తుల గురించి మాత్రమే కాకుండా ప్రస్తుతానికి కూడా ప్రాధాన్యమిస్తే ఎటువంటి ఆలోచనలూ లేకుండా మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.
- విపరీతంగా ఆలోచించడం వల్ల మనసు అలసిపోతుంది. ఇలాంటప్పుడు గాలి బాగా వీచే ప్రదేశంలో ప్రశాంతంగా కూర్చోవాలి. నాలుగు సెకన్ల పాటు గాలిని నెమ్మదిగా లోపలికి పీల్చి నాలుగు సెకన్లు పట్టి ఉంచాలి. తరవాత నాలుగు సెకన్ల పాటు గాలిని నెమ్మదిగా వదలాలి. ఇలా రెండు లేదా మూడుసార్లు చేస్తే అనవసరమైన ఆలోచనల నుంచి మనసు మరలుతుంది.
- తేలికపాటి వ్యాయామం, సైకిల్ తొక్కడం, ఆటలు ఆడడం, నడకలను దినచర్యలో భాగం చేసుకుంటూ సమయానుసారం ప్రశాంతంగా నిద్రిస్తే అనవసరమైన ఆలోచనలు దరిచేరవు.



ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీ

2028 లాస్ ఏంజిల్స్ క్రీడల్లో చోటు

న్యూఢిల్లీ: దేశ కాంపౌండ్ ఆర్చర్ల సుదీర్ఘ ఎదురు చూపులు ఫలించాయి. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీని ప్రవేశపెట్టనున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బుధవారం వెల్లడించింది. అయితే కేవలం మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనే పోటీలు నిర్వహిస్తారు. 1972 విశ్వ క్రీడల్లో ఆర్చరీని పునఃప్రవేశపెట్టాక రికర్వ్ ఆర్చరీలో మాత్రమే పోటీలు జరుగుతున్నాయి. కాంపౌండ్ విభాగాన్ని కూడా ఒలింపిక్స్‌లో చేర్చాలని వరల్డ్ ఆర్చరీ ఎంతో కాలంగా ఐఓసీని డిమాండ్ చేస్తోంది. విశ్వ క్రీడల్లో మొత్తం ఐదు విభాగాలు..పురుషులు, మహిళలు వ్యక్తిగత, పురుషులు, మహిళలు టీమ్, మిక్స్‌డ్‌లో పోటీలు జరుగుతున్నాయి. ఇప్పుడు.. కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంతో కలిపి ఆరుకు చేరతాయి.

జ్యోతి సురేఖ హర్షం: కాంపౌండ్ వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాలలో తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతిసురేఖ ప్రపంచ పోటీలలో అద్భుతంగా రాణిస్తోంది. వరల్డ్ కప్, వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడల్లో ఆమె ఈ విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టింది. ఒలింపిక్స్‌లో కూడా కాంపౌండ్ ఆర్చరీని ప్రవేశపెడితే స్వర్ణం గెలవగలనన్న ధీమాతో ఆమె ఉంది. ఈనేపథ్యంలో ఓఐసీ నిర్ణయంతో 28 ఏళ్ల జ్యోతి సురేఖ హర్షం వ్యక్తంజేసింది.

నకమురతో అర్జున్ గేమ్ డ్రా

పారిస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్ టూర్ పారిస్ అంచె..క్వార్టర్ ఫైనల్ మొదటి గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకున్నాడు. అర్జున్-అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ హికరు నకముర మధ్య బుధవారం జరిగిన ఈ గేమ్ 77 ఎత్తులపాటు హోరాహోరీగా సాగింది. తెల్లపావులతో ఆడిన అర్జున్ చివరకు నకమురను నిలువరించాడు. గురువారం జరిగే రెండో గేమ్‌లో నకముర తెల్లపావులతో ఆడతాడు. ఆ గేమ్ కూడా డ్రా అయితే విజేతను తేల్చేందుకు ప్లేఆఫ్స్ నిర్వహిస్తారు. విన్సెంట్ కీమర్-నెపోమ్నియాచి, లగ్రావ్-కరువానా మధ్య క్వార్టర్‌ఫైనల్స్ తొలి గేమ్‌లు కూడా ఫలితం తేలలేదు. అయితే అబ్దుసతొరోవ్‌పై కార్ల్‌సన్ విజయం సాధించాడు.

ఐపీఎల్‌లో నేడు

	వేదిక
బెంగళూరు x ఢిల్లీ	బెంగళూరు
రా.7.30	

గుజరాత్ గెలుపు జోరు

58 పరుగులతో రాజస్థాన్ చిత్తు


వరుస విజయాలతో దుమ్మురేపుతున్న గుజరాత్ టైటాన్స్.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకొంది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను చిత్తు చేసిన టైటాన్స్.. వరుసగా నాలుగో విజయాన్ని తమ ఖాతాలో వేసుకొంది. సాయి సుదర్శన్ క్లాసిక్ ఆటతో భారీ స్కోరు చేసిన గుజరాత్.. బంతితోనూ రాయల్స్ పనిబట్టింది.

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ గెలుపు జోరును కొనసాగిస్తోంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ (53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82)తోపాటు బౌలర్లు సమష్టిగా చెలరేగడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్ గుజరాత్ 58 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను మట్టికరిపించింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 217/6 స్కోరు చేసింది. బట్లర్ (36), షారుక్ ఖాన్ (20 బంతుల్లో 36) రాణించారు. తీక్షణ, తుషార్ దేశ్‌పాండే చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో రాజస్థాన్ 19.2 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. హెట్‌మయర్ (52), సంజూ శాంసన్ (41) శ్రమ వృథా అయింది. ప్రసిద్ధ్ కృష్ణ 3, సాయి కిశోర్, రషీద్ చెరో 2 వికెట్లు తీశారు.

బ్యాటర్లు విఫలం: ఛేదన ఆరంభంలోనే జైస్వాల్ (6), నితీశ్ రాణా (1) వికెట్లను చేజార్చుకొన్న రాజస్థాన్.. ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది. టైటాన్స్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ.. స్కోరుబోర్డుకు పగ్గాలేశారు. జైస్వాల్‌ను అర్షద్ అవుట్ చేయగా.. రాణాను సిరాజ్ బోల్తాకొట్టించాడు. కానీ, కెప్టెన్ శాంసన్, రియాన్ పరాగ్ (26) మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, పరాగ్‌ను కేజ్రోలియా.. ధ్రువ్ జురెల్ (5) రషీద్ వెనక్కిపంపడంతో రాజస్థాన్ 68/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో శాంసన్, హెట్‌మయర్ ఐదో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, వీరిద్దరినీ కృష్ణ అవుట్ చేయడంతో రాజస్థాన్ పోరాటం ముగిసింది.

నడిపించిన సుదర్శన్: ఓపెనర్ సుదర్శన్ కళాత్మక అర్ధ శతకంతో ముందుండి నడిపించడంతో.. గుజరాత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్‌ను ఆర్చర్ ఆరంభంలోనే దెబ్బతీశాడు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (2)ను స్వల్ప స్కోరుకే అవుట్ చేశాడు. కానీ, బట్లర్‌తో కలసి రెండో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ఠ పునాది వేసిన సుదర్శన్.. మూడో వికెట్‌కు షారుఖ్‌తో కలసి 62 పరుగులు జోడించడంతో టైటాన్స్ భారీ స్కోరు చేసింది. దేశ్‌పాండే వేసిన నాలుగో ఓవర్‌లో సుదర్శన్ 18 పరుగులు రాబట్టాడు. కానీ, మరో ఎండ్‌లో బట్లర్ ఆచితూచి ఆడడంతో.. ఆరు ఓవర్లకు టైటాన్స్ 56/1తో నిలిచింది. క్రీజులో కుదురుకొన్న బట్లర్.. ఫరూకీ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో బ్యాట్‌కు పనిచెప్పాడు. అయితే, 10వ ఓవర్‌లో తీక్షణ బౌలింగ్‌లో సింగిల్‌తో సుదర్శన్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నా.. అదే ఓవర్‌లో బట్లర్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ దశలో షారుక్ క్రీజులోకి రావడంతో స్కోరు బోర్డు ఊపందుకొంది. రెండు వరుస బౌండ్రీలతో బ్యాట్‌కు పని చెప్పిన షారుక్.. తుషార్ బౌలింగ్‌లో సిక్స్ బాదాడు. ఇక, తీక్షణ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగిన షారుక్.. డెత్ ఓవర్లలో విజృంభిస్తాడనుకొంటే స్టంపౌటయ్యాడు. రూథర్‌ఫోర్డ్ (6)ను సందీప్ పెవిలియన్ చేర్చగా.. సుదర్శన్, రషీద్ (12)లను దేశ్‌పాండే అవుట్ చేశాడు. కానీ, చివరి ఓవర్‌లో ధాటిగా ఆడిన తెవాటియా (24 నాటౌట్) టీమ్ స్కోరును 220కి చేరువ చేశాడు.

మెరిసిన సుదర్శన్



సాయి సుదర్శన్ (53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	5	4	1	0	8	1.413
ఢిల్లీ	3	3	0	0	6	1.257
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
కోల్‌కతా	5	2	3	0	4	-0.056
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	5	1	4	0	2	-0.889
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) శాంసన్ (బి) దేశ్‌పాండే 82, గిల్ (బి) ఆర్చర్ 2, బట్లర్ (ఎల్బీ) తీక్షణ 36, షారుక్ ఖాన్ (స్టంప్డ్) శాంసన్ (బి) తీక్షణ 36, రూథర్‌ఫర్డ్ (సి) శాంసన్ (బి) సందీప్ 7, తెవాటియా (నాటౌట్) 24, రషీద్ (సి) జైస్వాల్ (బి) దేశ్‌పాండే 12, అర్షద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 217/6; వికెట్ల పతనం:** 1-14, 2-94, 3-156, 4-163, 5-187, 6-201; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-30-1, ఫరూఖీ 4-0-38-0, తుషార్ దేశ్‌పాండే 4-0-53-2, సందీప్ శర్మ 4-0-41-1, తీక్షణ 4-0-54-2.

రాజస్థాన్: జైస్వాల్ (సి) రషీద్ (బి) అర్షద్ 6, సంజూ శాంసన్ (సి) సాయి కిషోర్ (బి) ప్రసిద్ధ్ 41, నితీశ్ రాణా (సి) ఖేజ్రోలియా (బి) సిరాజ్ 1, పరాగ్ (సి) బట్లర్ (బి) ఖేజ్రోలియా 26, జురెల్ (సి) సాయి సుదర్శన్ (బి) రషీద్ 5, హెట్‌మయెర్ (సి) సాయి కిషోర్ (బి) ప్రసిద్ధ్ 52, శుభమ్ దూబే (ఎల్బీ) రషీద్ 1, ఆర్చర్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 4, తీక్షణ (సి) సాయి సుదర్శన్ (బి) సాయి కిషోర్ 5, తుషార్ దేశ్‌పాండే (సి) రషీద్ (బి) సాయి కిషోర్ 3, సందీప్ శర్మ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.2 ఓవర్లలో 159 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-10, 2-12, 3-60, 4-68, 5-116, 6-119, 7-144, 8-145, 9-150, 10-159; **బౌలింగ్:** సిరాజ్ 4-0-30-1, అర్షద్ 2-0-19-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-24-3, కుల్వంత్ ఖేజ్రోలియా 3-0-29-1, రషీద్ 4-0-37-2, సాయి కిషోర్ 2.2-0-20-2.

రుద్రాంక్ష్ జోడీకి రజతం

షూటింగ్ వరల్డ్ కప్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్/ఆర్య బోర్సే ద్వయం రజతం సాధించింది. ఫైనల్లో భారత జోడీ 9-17తో చైనా జంట జీఫీ వాంగ్/బుహన్ సాంగ్ చేతిలో ఓడి పసిడి పతకాన్ని చేజార్చుకుంది. ఇక, కాంస్య పతక పోరులో భారత్‌కే చెందిన అర్జున్/నర్మద జంట 13-17తో అర్జెంటీనాకు చెందిన ఫెర్నాండ రూసో/మార్సెలో చేతిలో ఓటమిపాలైంది. ఇక, భారత కాలమాన ప్రకారం మంగళవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ విజయ్‌వీర్ సిద్ధు స్వర్ణం దక్కించుకున్నాడు.

ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత్‌కు కాంస్యం

అబన్‌డేల్ (అమెరికా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1 పోటీల్లో భారత పురుషుల కాంపౌండ్ జట్టు కాంస్య పతకం సాధించింది. బుధవారం ఇక్కడ జరిగిన కాంస్య పతక పోరులో అభిషేక్, ఓజాస్, రిషభ్‌లతో కూడిన భారత బృందం 230-223తో డెన్మార్క్‌పై గెలిచింది.

నీ కోసమే వచ్చాం..



న్యూఢిల్లీ: ప్రముఖ యూట్యూబర్, ఆర్జే మహ్‌వశ్ ఐపీఎల్‌లో ఇప్పుడు సందడి చేస్తోంది. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌తో డేటింగ్‌లో ఉందన్న వార్తలకు బలం చేకూరుస్తూ అతనాడే ప్రతి మ్యాచ్‌కూ హాజరవుతోంది. చండీగఢ్‌లో మంగళవారం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లోనూ కనిపించిన మహ్‌వశ్.. ఇక్కడికి నీకోసమే వచ్చానంటూ చాహల్‌తో దిగిన సెల్ఫీతో పాటు స్నేహితులతో కలిసి మ్యాచ్‌ను ఎంజాయ్ చేస్తున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'నీ వెనకాల ఉండి మద్దతిచ్చే వారిలో మేమున్నాం. నీకోసమే ఇక్కడికి వచ్చాం' అని ఆ ఫొటోల కింద రాసుకొచ్చింది. ఈ పోస్టును లైక్ చేసిన చాహల్.. మీరే నా వెన్నెముక అంటూ ఆ ఫొటోలకు కామెంట్ పెట్టాడు. గతంలో కొరియోగ్రాఫర్, యూట్యూబర్ ధనశ్రీ వర్మను పెళ్లాడిన చాహల్.. ఇటీవలే ఆమెకు విడాకులిచ్చిన సంగతి తెలిసిందే.

సింధు ముందుకు

ప్రణయ్, లక్ష్య, ఆకర్షి ఇంటికి

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సింధు 21-15, 21-19తో ఎస్తర్ వర్దాయో (ఇండోనేసియా)పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ పోరాటం తొలిరౌండ్‌కే పరిమితమైంది. ప్రణయ్ 16-21, 21-12, 11-21తో జు గువాంగ్ లూ (చైనా) చేతిలో, లక్ష్య సేన్ 18-21, 10-21తో లీ చియా హావో (చైనా) చేతిలో ఓడారు. కాగా, యువ షట్లర్లు కిరణ్ జార్జ్ 21-16, 21-8తో దిమిత్రీ పనారిన్ (కజకిస్థాన్)పై, ప్రియాన్షు రజావత్ 20-22, 21-12, 21-10తో కంటపాన్ వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

పంత్.. దొంగనొప్పి!

» నటన అద్భుతం అంటున్న నెటిజన్లు



న్యూఢిల్లీ: కోల్‌కతాతో మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడంటూ నెట్‌లో విమర్శల వర్షం కురుస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 పరుగుల తేడాతో కోల్‌కతాపై గెలిచింది. అయితే, ఈ మ్యాచ్‌లో రహానె (61) దూకుడుగా ఆడుతుండడంతో ఒక దశలో కోల్‌కతా 149/2తో గెలుపు దిశగా దూసుకెళ్తోంది. విజయానికి 8 ఓవర్లలో 90 పరుగులు కావాలి. ఈ క్రమంలో 13వ ఓవర్ బౌల్ చేయడానికి శార్దూల్ సిద్ధమైన సమయంలో.. పంత్ నడుం నొప్పి అంటూ మెడికల్ టైమవుట్ తీసుకొన్నాడు. దీంతో కోల్‌కతా బ్యాటర్ల ఏకాగ్రత చెదిరింది. మరోవైపు వ్యూహాత్మకంగా వైడ్‌లు వేసిన శార్దూల్.. రహానెను అవుట్ చేయడంతో తడబడిన కోల్‌కతా గెలుపు వాకిట బోల్తాపడింది. అయితే, పంత్ దొంగ నొప్పితో కోల్‌కతా లయను దెబ్బతీశాడని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా జోరును అడ్డుకోవడానికి పంత్ ఇలాగే మోకాలి నొప్పి అంటూ నాటకం ఆడాడని గుర్తు చేస్తున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

కల్యాణ్‌రామ్ నట విశ్వరూపం చూస్తారు

విజయశాంతి




'కల్యాణ్‌రామ్ విలువలున్న మనిషి. ఎన్టీ రామారావు గారి మనవడు. ఆ క్రమశిక్షణ ఎక్కడికి పోతుంది. అతను చేసే ప్రతి పనిలోనూ ఆ సంస్కారం కనిపిస్తుంది 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రంలో ఆయన నట విశ్వరూపం చూస్తారు' అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో 'ముచ్చటగా బంధాలే' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయశాంతి, కల్యాణ్ రామ్, హీరోయిన్ సాయి మంజ్రేకర్, నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'ఈ నెల 12న మన సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉంది. ఆ కార్యక్రమానికి తమ్ముడు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వస్తున్నాడు' అని చెప్పారు.

యోగిని కలసిన కన్నప్ప టీమ్




'కన్నప్ప' చిత్రబృందం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. వారిని సాదరంగా ఆహ్వానించిన యోగి.. ఈ సినిమా విడుదల తేదీతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూన్ 27న 'కన్నప్ప' సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయనకు ప్రముఖ చిత్రకారుడు రమేశ్ గిరిజాల గీసిన ఓ పెయింటింగ్‌ను డా.మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా బహూకరించారు. కాగా, ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ప్రీతీ ముకుందన్ కథానాయిక. మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, కాజల్ ఇందులో నటిస్తున్నారు.

ఎన్టీఆర్ అడుగు పెడుతున్నారు



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూట్ ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. "ఎన్టీఆర్-నీల్ సినిమా కీలక షెడ్యూల్‌కు సిద్ధమైంది. ఈనెల 22 నుంచి సినిమా సెట్స్‌లోకి ఎన్టీఆర్ అడుగుపెడుతున్నారు" అని పేర్కొంది. వచ్చే ఏడాది జనవరి 9న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.

లక్షల్లో ఒక్కరికి మాత్రమే లభించే అవకాశం ఇది



ప్రదీప్ మాచిరాజు హీరోగా నటించిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రదీప్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు. 'యాంకర్ నుంచి నటుడిగా మారడం చాలా లక్కీగా ఫీల్ అవుతున్నాను. ఇప్పుడు నా పై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను. లక్షల్లో ఒక్కరికి మాత్రమే లభించే అవకాశం ఇది' అని చెప్పారాయన. హీరోగా తన రెండో సినిమా గురించి మాట్లాడుతూ 'తొలి సినిమా తర్వాత మంచి కంటెంట్‌తో మరో సినిమా చేయాలని ప్లాన్ చేశాం. ఆసక్తి, ఫ్యాషన్ ఉన్న వాళ్లందరం కలసి ఈ సినిమా చేశాం. మంచి కథ దొరకడానికి ఇంత కాలం పట్టింది' అని వివరించారు. సినిమాలో తన పాత్ర గురించి వివరిస్తూ 'ఇందులో కృష్ణ అనే పాత్ర పోషించాను. సినిమాలో నేను ఎంత చిరాకు పడతానో ప్రేక్షకులు అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఫ్యామిలీ అంతా కూర్చుని సమ్మర్‌లో హ్యాపీగా చూసే సినిమా ఇది. పవన్‌కల్యాణ్ తొలి సినిమా టైటిల్‌తో ఈ చిత్రం చేయడం మాపై బాధ్యతను మరింత పెంచింది. అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకుని సినిమా తీశాం. మా కథకు సరిపోయే టైటిల్ ఇది. దర్శకులు నితిన్, భరత్ నాతో ఎప్పటినుంచో జర్నీ చేస్తున్నారు. నా టైమింగ్ వారికి తెలుసు. దానికి తగ్గట్లుగా ఈ కథను అందంగా తెరపై మలిచారు' అని చెప్పారు.

నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు



'బాషా' చిత్రం శతదినోత్సవంలో నాటి ముఖ్యమంత్రి జయలలితపై తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ చేసిన తీవ్ర విమర్శలు అప్పట్లో సంచలనం సృష్టించడంతో పాటు తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలకు కారణమయ్యాయి. ఈ పరిణామాల్లో మొదటిది ఆ వేడుకలో వేదికపైనున్న అన్నాడీఎంకేకు చెందిన సీనియర్ నేత ఆర్ఎం వీరప్పన్ జయ ఆగ్రహానికి గురవడంతో పాటు మంత్రి పదవిని కోల్పోవాల్సివచ్చింది. ఆ తరువాత ఆయన కన్నుమూసేవరకూ రాజకీయంగా కోలుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆర్ఎం వీరప్పన్‌పై 'ఆర్ఎంవీ ది కింగ్ మేకర్' పేరుతో రూపొందిన ఓ డాక్యుమెంటరీలో రజనీ తమ స్నేహం గురించి గుర్తు చేసుకున్నారు. 'బాషా' చిత్రం వందరోజుల వేడుకల్లో నేను రాష్ట్రంలో బాంబుల సంస్కృతి గురించి ప్రస్తావించాను. వేదికపై ఆర్ఎం వీరప్పన్‌ను ఉంచుకొని నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు. నాకు అప్పుడు అంత పరిజ్ఞానం లేదు. అప్పుడు ఆయన అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. 'నువ్వు మంత్రిగా వేదికపై వుండగా, నా ప్రభుత్వానికి వ్యతిరేకంగా రజనీ ఎలా మాట్లాడారు?' అంటూ దివంగత ముఖ్యమంత్రి జయ ఆర్ఎం వీరప్పన్‌ను పదవి నుంచి తొలగించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే నేను షాక్‌కు గురయ్యాను. ఇలా జరగడానికి నేనే కారణమని తెలిసి, ఎంతో బాధపడ్డాను. ఆ రాత్రంతా నిద్రపోలేకపోయాను. ఆయన్ని కలిసి క్షమాపణ చెప్పాను. కానీ, ఆయన ఏమీ జరగనట్లు మాట్లాడారు. చాలా సాధారణంగా వున్నారు. జయకు వ్యతిరేకంగా మాట్లాడడానికి కొన్ని కారణాలు ఉన్నప్పటికీ, ఆ వేదికపై అలా మాట్లాడివుండాల్సింది కాదు. 'నేను జయతో మాట్లాడనా?' అని ఆయన్ని అడిగాను. కానీ నీ ఆత్మగౌరవం కోల్పోవద్దని నాకు సలహా ఇచ్చారు. అంతేగాక 'మీ చేత చెప్పించుకుని అక్కడకు పోయి చేరాల్సిన అవసరం నాకు లేదు. ఈ విషయం ఇంతటితో వదిలేయండి' అన్నారు. అలాంటి ఒక గొప్ప మనిషి ఆయన. వీరప్పన్ 'కింగ్ మేకర్...రియల్ కింగ్ మేకర్' అని రజనీ పేర్కొన్నారు.

రుణగ్రహీతలకు ఊరట

తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణ రేట్లు.. ఈఎంఐ చెల్లింపుల భారం కూడా..

రెపో రేటు 0.25 శాతం తగ్గింపు.. 6.25% నుంచి 6 శాతానికి దిగివచ్చిన రెపో

- కీలక వడ్డీ రేట్లపై భవిష్యత్ వైఖరి తటస్థం నుంచి అనుకూల స్థాయికి మార్పు
- ముున్ముందు మరింత తగ్గిస్తామని సంకేతాలు
- 2025-26 ఆర్థిక సంవత్సర వృద్ధి అంచనా 6.7 శాతం నుంచి 6.5 శాతానికి కుదింపు
- ద్రవ్యోల్బణం అంచనా 4 శాతానికి తగ్గింపు
- పరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన ఆర్‌బీఐ
- జూన్ 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష నిర్వహణ



ముంబై: రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు ఇక తగ్గుముఖం పట్టనున్నాయి. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారిపై నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల భారం కాస్త తగ్గనుంది. ఎందుకంటే, బ్యాంకుల రుణ రేట్లకు ప్రామాణికాల్లో ఒకటైన రెపో రేటును మరో పావు (0.25) శాతం తగ్గిస్తున్నట్లు ద్రవ్య పరపతి సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. దాంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు, కీలక వడ్డీ (రెపో) రేటుపై భవిష్యత్ వైఖరిని కూడా 'తటస్థం' నుంచి 'సర్దుబాటుకు అనుకూల' స్థాయికి మార్చింది. అంటే, ముున్ముందు సమీక్షల్లో మరింత తగ్గించే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చింది. సర్దుబాటుకు అనుకూల స్థాయి వైఖరితో రిజర్వ్ బ్యాంక్ అవసరాన్ని బట్టి వడ్డీ రేట్లను తగ్గించడం లేదా యథాతథంగా కొనసాగిస్తుంది. అంతే తప్ప పెంచదు. ఆర్‌బీఐ 'రెపో'ను తగ్గించడం వరుసగా ఇది రెండోసారి. 2020 మే తర్వాత తొలిసారిగా ఈ ఫిబ్రవరి సమీక్షలోనూ పావు శాతం తగ్గించింది. తాజా రెపో తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంకులు పూర్తిగా కస్టమర్లకు బదిలీ చేసిన పక్షంలో (రెపో ప్రామాణిక) రుణాలపై వడ్డీ రేట్లు 2022 నవంబరు నాటి కనిష్ఠ స్థాయికి తగ్గే అవకాశం ఉంది.

ఏకగ్రీవ నిర్ణయం

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో నిర్వహించిన తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు (ఈ నెల 7-9 తేదీల్లో) సమావేశమైంది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి మబ్బులు కమ్ముకున్న నేపథ్యంలో మన జీడీపీ వృద్ధికి ఊతమిచ్చేందుకు రెపో రేటును పావు శాతం తగ్గించాలని సభ్యులు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఎందుకంటే, భారత ఎగుమతులపై ట్రంప్ విధించిన 26 శాతం సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇది మన ఎగుమతులతో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధికి సైతం 0.20-0.40 శాతం మేర గండికొట్టవచ్చన్న అంచనాలున్నాయి.

పీ2ఎం చెల్లింపుల పరిమితి పెంపు

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా విక్రేతలకు వ్యక్తులు జరిపే చెల్లింపుల (పీ2ఎం పేమెంట్స్) పరిమితిని పెంచేందుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆర్‌బీఐ అనుమతిచ్చింది. మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పరిమితులను సడలించేందుకు వెసులుబాటు కల్పించింది. ప్రసుతం ఒక వ్యక్తి మరో వ్యక్తికి (పీ2పీ), వ్యక్తి విక్రేతకు (పీ2ఎం) గరిష్ఠంగా రూ.లక్ష వరకు చెల్లింపు జరపవచ్చు.

బ్యాంకింగ్ వ్యవస్థ సుస్థిరం

మన బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితంగా, భద్రంగా, పటిష్ఠంగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ఇండస్ఇండ్ బ్యాంక్ సహా కొన్ని బ్యాంకింగ్, హౌసింగ్ ఫైనాన్సింగ్ కంపెనీల్లో సంక్షోభాలు కేవలం వ్యవస్థలో కొన్ని అంకాలే తప్ప పూర్తి వైఫల్యం కాదన్నారు. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఇండస్ఇండ్ బ్యాంక్ ఈ మధ్యనే ప్రకటించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది. అలాగే, ముంబైకి చెందిన న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్, అవియోమ్ ఇండియా హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దివాలా తీశాయి. అయితే, ఇవన్నీ వ్యక్తిగత ఉదంతాలేనని బ్యాంకింగ్ వ్యవస్థ సుస్థిరతకు ముప్పేమీ లేదన్నారు.

నేను సంజయ్.. భారతంలో సంజయుడిని కాను..

- నాకు దివ్య దృష్టి లేదు..
- వడ్డీరేట్లు ఇంకెంత తగ్గుతాయో ఇప్పుడే చెప్పలేనన్న ఆర్‌బీఐ గవర్నర్

ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాల ప్రకటన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయా..? అన్న ప్రశ్నకు ఆర్‌బీఐ గవర్నర్ తనదైన శైలిలో జవాబిచ్చారు. నా పేరు సంజయ్. కానీ, మహాభారతంలో సంజయుడిని కాను. ఆయన లాగా దివ్యదృష్టి లేదన్నారు. "జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. ఆర్థిక వృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో మూలధన పెట్టుబడుల పెంపు, భారీగా పన్ను మినహాయింపు వంటి చర్యలను చేపట్టింది. మేం రెపో రేటును తగ్గించడంతో పాటు రేట్లపై భవిష్యత్ వైఖరిని అనుకూలంగా మార్చాం. భవిష్యత్‌లో వడ్డీ రేట్లు ఇంకెంత తగ్గుతాయనేది నేనిప్పుడే చెప్పలేను. నేను సంజయ్. కానీ, మహాభారతంలోని సంజయుడిని కాను. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూడగలిగే దివ్యదృష్టి నాకు లేదు" అని ఆయన చమత్కరించారు. రుణగ్రహీతలకు రెపో తగ్గింపు ప్రయోజనాలు త్వరితగతిన బదిలీ అయ్యేందుకు వీలుగా బ్యాంకింగ్ వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యతను నిర్వహిస్తామని గవర్నర్ అన్నారు.

సుంకాలతో ఎగుమతులకు గండి

- ఆర్థిక ప్రగతిపై అనిశ్చితి మబ్బులు

ట్రంప్ సుంకాలతో అన్ని దేశాల ఆర్థిక ప్రగతిపై అనిశ్చితి మబ్బులు కమ్ముకున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ వృద్ధి, ధరల నియంత్రణకు కొత్త అవరోధంగా పరిణమించవచ్చని ఆయన హెచ్చరించారు. సుంకాలతో వాణిజ్య యుద్ధాలు తీవ్రతరమైతే, మన ఎగుమతులు గణనీయంగా తగ్గే ప్రమాదమూ ఉందన్నారు. అంతేకాదు, ట్రంప్ సుంకాలు ద్రవ్యోల్బణం కంటే జీడీపీ వృద్ధిపైనే అధిక ప్రభావం చూవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

వృద్ధి అంచనాల్లో కోత

ట్రంప్ సుంకాలు వాణిజ్య ఉద్రిక్తతలతో పాటు ఆర్థిక అనిశ్చితిని పెంచటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి అంచనాను ఈ ఫిబ్రవరిలో ప్రకటించిన 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈసారి వ్యవసాయ రంగ పనితీరు ఆశాజకంగా ఉండవచ్చని, తయారీ రంగం తిరిగి కోలుకుంటోందని సేవల రంగం చురుకుగా ముందుకు సాగుతోందని మల్హోత్రా అన్నారు. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులూ పుంజుకుంటున్నాయని, ముున్ముందు మరింత పెరగవచ్చన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై భారీగా ఖర్చు చేస్తోందని.. కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకులు ఆర్థికంగా పరిపుష్టిగా ఉండటం వృద్ధికి దోహదపడగలవన్నారు. ట్రంప్ సుంకాలతో వాణిజ్య అవరోధాలు ఆర్థిక ప్రగతికి ప్రతికూలంగా పరిణమించవచ్చన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనాలు (%)

త్రైమాసికం	వృద్ధి	ద్రవ్యోల్బణం
తొలి	6.5	4.0
రెండు	6.7	3.6
మూడు	6.6	3.8
నాలుగు	6.3	4.4

వడ్డీ రేట్లు తగ్గించిన 4 బ్యాంకులు

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించడంతో బ్యాంకులూ వడ్డీ రేట్ల తగ్గింపునకు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తమ రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటు 0.35 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. మిగతా బ్యాంకులూ ఇదే బాటలో నడుస్తాయని భావిస్తున్నారు. తమ రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటును ఈ నెల 11 నుంచి 9.05 శాతం నుంచి 8.7 శాతానికి కుదిస్తున్నట్టు ఇండియన్ బ్యాంక్ తెలిపింది. పీఎన్‌బీ, బీఓఐ కూడా తమ రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటును 9.10 శాతం 8.85 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. యూకో బ్యాంక్ కూడా ఇదే బాటలో నడిచింది. తన రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటును గురువారం నుంచి 8.8 శాతానికి తగ్గించింది.

మళ్లీ నష్టాల్లోకి సూచీలు

ముంబై: ఈక్విటీ మార్కెట్లు బుధవారం మళ్లీ తిరోగమనం బాట పట్టాయి. ఆర్‌బీఐ వరుసగా రెండో సారి రెపో రేటు తగ్గించిందన్న ఆనందం స్టాక్‌మార్కెట్‌ను ఏ మాత్రం ఉత్తేజితం చేయలేకపోయింది. అంతకన్నా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పోటు భయాలే ఇన్వెస్టర్ల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఫలితంగా ఒక రోజు విరామం అనంతరం ఈక్విటీ మార్కెట్లు తిరిగి బుధవారం నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాలు ఇందుకు ఆజ్యం పోశాయి. ఈ ప్రభావంతో ఇంట్రాడేలో 554 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి నష్టాన్ని 379.93 పాయింట్లకు పరిమితం చేసుకుని 73,847.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 136.70 పాయింట్ల నష్టంతో 22,399.15 వద్ద ముగిసింది.

మార్కెట్లకు నేడు సెలవు: మహావీర్ జయంతి సందర్భంగా గురువారం మార్కెట్లకు సెలవు. స్టాక్‌మార్కెట్‌తో పాటు ఫారెక్స్, బులియన్ మార్కెట్లన్నీ మూసి ఉంటాయి. శుక్రవారం తిరిగి ట్రేడింగ్ ఉంటుంది.

మార్కెట్లోకి పోకో సీ71 స్మార్ట్‌ఫోన్

స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ పోకో ఇండియా మార్కెట్లోకి సరికొత్త పోకో సీ71 స్మార్ట్‌ఫోన్‌ను తీసుకువచ్చింది. ఈ ఫోన్ ప్రారంభ ధర రూ.6.499. 6.88 హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, ట్రిపుల్ ఐ ప్రొటెక్షన్, ఆక్టా-కోర్ ప్రాసెసర్, 32 ఎంపీ డ్యూయల్ రియర్ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రత్యేకతలు. 4జీబీ రామ్ ప్లస్ 64 జీబీ స్టోరేజీతో కూడిన ఫోన్ ధర రూ.6,499గా ఉండగా 6జీబీ రామ్ ప్లస్ 128 జీబీ స్టోరేజీతో కూడిన సీ71 ధర 7,499గా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	78
కర్నూలు	100	నెల్లూరు	83
విశాఖపట్నం	109	అనంతపురం	83
గోదావరి	115		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,440 ▲	82,900 ▲	1,02,000 ▼
విజయవాడ	93,000 ▲	87,500 ▲	93,000 ▲
విశాఖపట్నం	90,380 ▲	82,850 ▲	90,990 ▲
రాజమండ్రి	90,440 ▲	82,900 ▲	92,200 ▲
ప్రొద్దుటూరు	88,900 ▲	81,790 ▲	93,000 ▲
ముంబై	90,161 ▲	82,588 ▲	90,669 ▲

ఈఎంఐలు ఎంత తగ్గుతాయంటే..



ప్రస్తుతం బ్యాంకులు, హెచ్‌ఎఫ్‌సీలు మంచి పరపతి స్కోరు ఉన్నవారికి ఇచ్చే 20 ఏళ్ల కాలపరిమితి గృహ రుణాలపై 9 శాతం వరకు కనీస వడ్డీ రేటు వసూలు చేస్తున్నాయి. ఆర్‌బీఐ తాజా వడ్డీ రేటు తగ్గింపుతో ఈ వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గనుంది. దీంతో రూ.30 లక్షల నుంచి రూ.1.5 కోట్ల గృహ రుణాలపై ఈఎంఐ ఎంత తగ్గనుందంటే..

రూ.30 లక్షల రుణంపై: 20 సంవత్సరాల చెల్లింపు కాలపరిమితి ఉండే రూ.30 లక్షల గృహ రుణంపై నెలనెలా చెల్లించే ఈఎంఐ భారం రూ.26,247 నుంచి రూ.25,071కి తగ్గుతుంది. అంటే నెలకు రూ.1,176 భారం తగ్గుతుంది. ఈ లెక్కన 20 సంవత్సరాలకు వడ్డీ, అసలు చెల్లింపుల రూపంలో రూ.2.82 లక్షలు ఆదా అవుతాయి.

రూ.50 లక్షల రుణంపై: అదే రూ.50 లక్షల గృహ రుణంపై చెల్లించే ఈఎంఐ భారం రూ.1,960 తగ్గి రూ.43,745 నుంచి రూ.41,785కు తగ్గుతుంది. అంటే 20 ఏళ్ల కాలపరిమితి పూర్తయ్యే సరికి ఆదా అయ్యే సొమ్ము రూ.4.7 లక్షలు.

రూ.70 లక్షల గృహ రుణంపై: తొమ్మిది శాతం వడ్డీ రేటు చొప్పున ప్రస్తుతం చెల్లించే ఈఎంఐ రూ.61,243. వడ్డీ రేటు అర శాతం తగ్గితే చెల్లించే ఈఎంఐ రూ.58,499. అంటే నెలకు రూ.2,744 చొప్పున 20 ఏళ్లలో రూ.6.58 లక్షలు ఆదా అవుతాయి.

రూ.కోటి గృహ రుణంపై: ప్రస్తుతం రూ.కోటి గృహ రుణంపై 9 శాతం వడ్డీ రేటు చొప్పున చెల్లించే ఈఎంఐ రూ.87,490. అదే వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గితే చెల్లించే ఈఎంఐ రూ.83,570 మాత్రమే. అంటే నెలకు రూ.3,920 చొప్పున 20 ఏళ్లలో రూ.9.4 లక్షలు ఆదా అవుతాయి.

రూ.1.5 కోట్ల గృహ రుణంపై: ఈ గృహ రుణంపై 9 శాతం వడ్డీ రేటుతో ప్రస్తుతం నెలనెలా చెల్లిస్తున్న ఈఎంఐ రూ.1,31,235. అదే వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గితే చెల్లించే ఈఎంఐ రూ.1,25,355 మాత్రమే. అంటే నెలకు రూ.5,880 చొప్పున 20 ఏళ్లలో రూ.14.11 లక్షలు ఆదా అవుతాయి.

పసిడి రుణాలపై నియంత్రణ

ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసిన ఆర్‌బీఐ

పసిడి రుణాలు గణనీయంగా పెరిగిపోతుండటంతో వీటిపై ఆర్‌బీఐ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈ రుణాల మంజూరుకు సంబంధించి ముసాయిదా నిబంధనలు జారీ చేసింది. ఈ నిబంధనలతో ఈ రుణాల మంజూరు ప్రక్రియ మరింత పారదర్శకంగా మారి రుణాలు తీసుకునే వారితో పాటు రుణాలు ఇచ్చే సంస్థలకూ మేలు జరుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. పసిడి రుణాలకు సంబంధించి ఏయే మార్పులు చోటు చేసుకోనున్నాయంటే..

చెల్లించే స్థోమతే కీలకం: బ్యాంకులు ఇక దరఖాస్తు చేసిన వెంటనే గతంలోలా ఎడాపెడా పసిడి రుణాలు ఇవ్వవు. దరఖాస్తుదారుడి ఆదాయం, తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే స్థోమత ఉందా? లేదా? అని మదింపు చేసిన తర్వాతే ఇక ఈ రుణాలు మంజూరవుతాయి.

పునరుద్ధరణ, టాప్ అప్స్: బంగారం రుణాల రెన్యువల్, టాప్ అప్ నిబంధనలూ మారనున్నాయి. ఇప్పటికే ఉన్న గోల్డ్ లోన్ ప్రామాణిక తరగతిలో ఉండి.. నిర్ణీత పరిమితికి లోబడి ఉంటేనే రెన్యూవల్స్, టాప్ అప్‌లను అనుమతిస్తారు.

వెలకట్టడంలో పారదర్శకత: రుణం కోసం తాకట్టు పెట్టుకునే నగల స్వచ్ఛత, విలువను లెక్కించే విధానాలు మరింత పారదర్శకంగా, నిలకడగా ఉండాలని స్పష్టం చేసింది.

కలగలుపు విధానానికి చెక్: ప్రస్తుతం ఒక వ్యక్తి ఒకేసారి వ్యక్తిగత, వ్యాపార అవసరాలు రెంటికీ కలిపి ఒకే పసిడి రుణం తీసుకోవచ్చు. ఇకపై ఇది సాధ్యం కాదు.

పర్యవేక్షణ: ఇక ఏ అవసరం కోసం గోల్డ్ లోన్ తీసుకున్నామో, ఆ రుణాన్ని ఆ అవసరం కోసం మాత్రమే ఉపయోగించాలి. వేరే అవసరాలకు ఉపయోగించకూడదు. ఈ రుణ వినియోగం నిర్దేశించిన అవసరానికే వినియోగిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఆ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేస్తాయి.

పరిమితులు

- వ్యక్తిగత వినియోగ అవసరం కోసం బంగారం రుణం తీసుకుంటే దాన్ని 12 నెలల్లోగా చెల్లించాలి.
- ఒక్కో వ్యక్తికి సహకార బ్యాంకులు, ఆర్‌ఆర్‌బీలు మంజూరు చేసే పసిడి రుణాలు రూ.5 లక్షలు మించకూడదు.
- ఒక వ్యక్తికి ఒక కిలో ఆభరణాల వరకు మాత్రమే పసిడి రుణాలకు అనుమతిస్తారు.
- పసిడి నాణేలపై రుణాలు తీసుకోవాలంటే 50 గ్రాముల వరకే అనుమతిస్తారు. ఆ నాణేలు కూడా 22 క్యారట్స్ లేదా అంతకు మించిన స్వచ్ఛత ఉండి ప్రత్యేకంగా ముద్రించినవై, బ్యాంకులు అమ్మినవై ఉండాలి.
- బంగారు, వెండి నగలు, నాణేలపై మాత్రమే ఇక పసిడి రుణాలు లభిస్తాయి. నేరుగా బంగారం లేదా వెండిని కుదువ పెట్టి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉండదు.
- గోల్డ్ ఈటీఎఫ్‌లపైనా పసిడి రుణాలు లభించవు.
- పసిడి రుణాల కోసం వివాదాల్లో ఉన్న ఆభరణాలు, ఇప్పటికే తనఖాలో ఉన్న ఆభరణాలను తిరిగి తనఖా పెట్టేందుకు అనుమతించరు.

పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్

చెల్లింపుల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్

- ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు
- 1.37 కోట్ల ఆదాయం దిశగా కృషి చేయాలని నిర్దేశం

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎలాంటి అవాంతరాలు లేకుండా అమలు చేయడానికి వీలుగా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం సొంతంగా ఆదాయం పెంచుకునేలా, పన్నుల వసూళ్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరిన్ని ఆదాయ మార్గాలను అన్వేషించడంతో పాటు, ఆదాయం తక్కువగా వస్తున్న విభాగాలను, అందుకు గల కారణాలను గుర్తించాలని తెలిపారు. పన్ను చెల్లింపుల నుంచి రశీదులు, నోటీసుల జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని చెప్పారు. మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా బిల్డర్లు అసలు నమోదు చేసుకోలేదని ఏఐ గుర్తించిందని, తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ఎటువంటి అనుమతులైనా ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఏఐ సాంకేతికతతో పకడ్బందీగా పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదని, వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం రావాల్సిన పన్నులన్నీ చెల్లించేలా చూడాలని నిర్దేశించారు. పన్ను చెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీడీ ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను నూరు శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని సీఎం పేర్కొన్నారు.

రాష్ట్ర ఆదాయంలో 2.2% వృద్ధి

2023-24 ఆర్థిక సంవత్సరంలో పోల్చితే 2024-25లో రాష్ట్ర ఆదాయం 2.2% పెరిగింది. పన్నుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 4.1% వృద్ధి నమోదవగా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. జీఎస్టీలో 4.9%, వృత్తి పన్నులో 15.2%, ఎక్సైజ్ ఆదాయంలో 24.3% చొప్పున వృద్ధి నమోదైంది.

ఎక్సైజ్ కొత్త విధానం సక్సెస్

ఎక్సైజ్ కొత్త పాలసీ విజయవంతమైందని, గతంలో కంటే ఆదాయం మరింత మెరుగుపడిందని సీఎం తెలిపారు. 2024 అక్టోబరు నుంచి 2025 మార్చి వరకు రూ.4,330 కోట్ల ఆదాయం వచ్చిందని, పాత విధానంతో పోల్చితే దాదాపు 33% ఆదాయం పెరిగిందని వివరించారు. మున్సిపల్ శాఖలో 2023-24 కంటే 2024-25లో రూ.500 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చింది. పన్నులకు సంబంధించి ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులు, ఖాళీ స్థలాల పన్నులు వసూలు కావాల్సి ఉంది. మార్చిలో ఆస్తి పన్ను చెల్లింపులపై 50శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ఆరు రోజుల్లోనే రూ.240 కోట్లు వసూలైందని అధికారులు వెల్లడించారు.



ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు, ఆయా శాఖల అధికారులు





ఢిల్లీలోని ఏపీ భవన్‌లో దుకాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, (ఇన్‌సెట్‌లో) దుకాణాన్ని సీజ్ చేస్తున్న సిబ్బంది

దుకాణంలో అక్రమాలు

ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి మనోహర్

అక్రమాలు గుర్తింపు.. వెంటనే మూసివేతకు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ భవన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నడుస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ దుకాణాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ మూసివేయించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రికి ఏపీ భవన్ పరిసరాలలో ఉన్న పౌరసరఫరాల శాఖ దుకాణంలో అక్రమాలపై ఫిర్యాదులు అందాయి. దీంతో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, భవన్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ దుకాణం కాకినాడకు చెందిన ఈశ్వర్‌రెడ్డి ఆధీనంలో ఉంది. దీనిలో హెచ్‌ఎంటీ బియ్యం మాత్రమే ఉండడం, ఇతర సరకులు అందుబాటులో ఉంచకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం నాసిరకంగా ఉండడంతోపాటు బస్తా తూకంలో తేడా రావడంతో చర్యలకు ఆదేశించారు. స్టాకు రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు సరిగా లేవు. ఆన్‌లైన్‌లో బిల్లులు జారీ చేయడం లేదని గుర్తించిన మంత్రి వెంటనే షాప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఏపీ భవన్‌లో పౌర సరఫరాల శాఖ ఔట్‌లెట్‌ను ప్రైవేటు వ్యక్తుల ద్వారా నిర్వహిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సివిల్ సప్లయ్ శాఖ ద్వారా ఇక్కడి వినియోగదారులకు బియ్యమే కాకుండా ఇతర సరకులు అందించేందుకు తమకు ఏపీ భవన్ ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలలోపే నాణ్యమైన సరకులు, అందుబాటు ధరలతో వినియోగదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ వ్యవహారంలో ఈశ్వర్‌రెడ్డి పేరు చెబుతున్నారని, సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు.

చంద్రబాబు వల్లే రాష్ట్రానికి నిధులు: మనోహర్

సీఎం చంద్రబాబు కృషి వల్లే రాష్ట్రానికి కేంద్ర నిధులు వస్తున్నాయని మంత్రి మనోహర్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజలు చంద్రబాబునే నమ్ముకున్నారని, అందుకే కూటమికే విజయాన్ని అందించారని అన్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో పౌరసరఫరాల కార్పొరేషన్ అప్పులు రూ.40వేల కోట్లకు పైగా చేరుకున్నాయని, ఈ ఏడాది ఆ మొత్తంలో రూ.500 కోట్లు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి తెలిపారు.

15 నుంచి మన మిత్ర-వాట్సప్‌పై

ఇంటింటా ప్రచారం

9552300009 ద్వారా 250 సేవలు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర-వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు సేవలు అందిస్తోంది. 250కి పైగా ప్రభుత్వ సేవలను అందిస్తున్నా ప్రజల్లో ఇంకా పూర్తిగా అవగాహన రాలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మన మిత్ర-వాట్సప్ గవర్నెన్స్ పాలనా విధానం ప్రజల్లోకి వెళ్లలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించారు. వాట్సప్ గవర్నెన్స్‌ను అందరూ వినియోగించుకుంటే పాలనపై సానుకూలత పెరుగుతుందని భావిస్తున్నారు. దళారుల ప్రమేయంలేకుండా నేరుగా సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటున్న వాట్సప్ గవర్నెన్స్ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశంతో 15 నుంచి ఇంటింటికీ మనమిత్ర-వాట్సప్ యాప్‌పై విస్తృత ప్రచారాన్ని చేపట్టాలని ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్ నిర్ణయించారు. సచివాలయ సిబ్బంది నుంచి సామాన్యుల వరకు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న పౌర సేవల గురించి వివరించాలని నిర్ణయించారు. గ్రామాల్లో కరపత్రాలు, వీడియో సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ మొబైల్‌లో వాట్సప్ గవర్నెన్స్ నంబరు 9552300009ను సేవ్ చేసుకోవాలని కోరనున్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్‌లో 250కి పైగా ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. భవిష్యత్తులో వెయ్యికి పైగా పెంచాలని నిర్ణయించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉన్న చోటనుంచే వాట్సప్‌లో సమస్యలు చెబితే వెంటనే పాలనా యంత్రాంగం స్పందిస్తుందని ప్రజలకు తెలియజెప్పాలని భాస్కర్ సూచించారు. ఫోన్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలని చెప్పాలని కోరారు. ప్రజలు మన మిత్ర-వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకునేలా సేవలు పొందడం లేదు. ఇంకా గ్రామ సచివాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, కలెక్టర్ ఆఫీసులకు ప్రత్యక్షంగా వెళ్లి దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.



కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ఉడకని అన్నం.. అరకొరగా కూర

- మీ పిల్లలకూ ఇలాగే భోజనం పెడతారా?
- కేజీబీవీ నిర్వాహకులపై మంత్రి సంధ్యారాణి ఆగ్రహం

సాలూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'ఉడికీ ఉడకని అన్నం. 152 మందికి కొద్దిగే కూర.. ఏమిటిది?. మీ పిల్లలకూ ఇలాగే పెడతారా?' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం ఖరాసువలసలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలోకి వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఉడికీ ఉడకని అన్నాన్ని చూసి.. 'ఇలాంటి ఆహారం తింటే పిల్లలకు కడుపు నొప్పులు రావా? 152 మందికి ఈ కూర ఎలా సరిపోతుంది?' అని ప్రశ్నించారు. విద్యాలయంలో ప్రత్యేకాధికారి పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

వెలిగొండ ఆయకట్టుకు వచ్చే ఏడాది జూన్ నుంచి నీరివ్వాలి

- పనుల్లో వేగం పెంచాలి.. ఇంజనీర్లకు మంత్రి నిమ్మల ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్ నుంచి వెలిగొండ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీరందించాలని.. ఈ లక్ష్యం నెరవేరేందుకు నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచాలని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. సీఎం చంద్రబాబు నిర్దేశం మేరకు ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులన్నిటినీ పూర్తి చేయాలని, దీనిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని స్పష్టం చేశారు. రూ.వేల కోట్ల విలువైన పనులు మిగిలి ఉండగా.. ఎన్నికల ముందు జగన్ హడావుడిగా ఉత్తుత్తి ప్రారంభోత్సవం చేసి.. ప్రజలను మోసగించారని ధ్వజమెత్తారు. నిర్వాసితులకు రూ.800 కోట్ల వరకు పరిహారం అందించాల్సి ఉండగా.. ఆయన ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని చెప్పారు. 2026 జూన్ నాటికి వెలిగొండ ఆయకట్టు రైతాంగానికి సాగునీరందించేలా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి కమిటీలు

- రాష్ట్ర కమిటీకి చైర్మన్‌గా సీఎస్: రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ ఆస్తుల వేలం నిర్వహించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, సమాచార పౌరసంబంధాల శాఖ కార్యదర్శి, ఐటీ సెక్రటరీ, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు సభ్యులుగా ఏర్పాటైన రాష్ట్రస్థాయి కమిటీలో ఏపీ సీఐడీ డీజీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఆర్థిక నిపుణుడు కుటుంబరావు, అగ్రిగోల్డ్ తరఫున ప్రతినిధికి అవకాశం కల్పించింది. జిల్లా కమిటీల్లో జాయింట్ కలెక్టర్ లేదా ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్, డీపీఆర్వో, జిల్లా ఈ-ఆక్షన్ అధికారి, సీఐడీ అదనపు ఎస్పీ తదితరులు ఉంటారు.



రాజధానిలో సొంత ఇంటికి శ్రీకారం

- శంకుస్థాపన చేసిన చంద్రబాబు దంపతులు
- కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్ దంపతులు
- వారికి పట్టువస్త్రాలు అందించిన రాజధాని రైతులు

అమరావతి, గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సొంత ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. బుధవారం ఉదయం 8.51 గంటలకు సతీమణి భువనేశ్వరి, తనయుడు నారా లోకేశ్ దంపతులు, మనవడు దేవాన్ష్‌తో కలిసి చంద్రబాబు భూమి పూజ నిర్వహించి, ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెలగపూడి సచివాలయం వెనుక ఈ9 రహదారి చెంతనే సుమారు 5 ఎకరాల స్థలంలో సీఎం సొంత ఇంటిని నిర్మించుకుంటున్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని కొద్దిమంది కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. భూమిపూజ సందర్భంగా చంద్రబాబుకు భూమిని విక్రయించిన వెలగపూడి మాజీ సర్పంచ్ కంచర్ల శాంతకుమారి, ఆమె కుమార్తె గీత కలిసి లోకేశ్ దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజధాని రైతులు పాల్గొని చంద్రబాబు, లోకేశ్ దంపతులకు ఘనస్వాగతం పలికారు. మంగళవారం రాత్రే భూమి పూజ జరిగే ప్రదేశాన్ని రాజధాని మహిళా రైతులు రంగవల్లులతో తీర్చిదిద్దారు. శంఖుచక్రాలు తిరునామాలతో వేసిన ముగ్గు చంద్రబాబు దంపతులను విశేషంగా ఆకట్టుకుంది. శంకుస్థాపన అనంతరం రాజధాని రైతులను చంద్రబాబు, లోకేశ్ ఆప్యాయంగా పలకరించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధానిలో ఇల్లు కట్టుకుని తమలో ఒకడు కాబోతుండడం తమకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా రాజధాని రైతులు, ప్రధానంగా మహిళలు హర్షం వ్యక్తంచేశారు.




ఇంటి నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా పూజలు చేస్తున్న చంద్రబాబు, భువనేశ్వరి, దేవాన్ష్

10 కొత్త పట్టణ అథారిటీలకు అభివృద్ధి అనుమతులు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన 10 పట్టణాభివృద్ధి అథారిటీలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అభివృద్ధికి సంబంధించిన అనుమతులు ఇచ్చేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఆదేశాలిచ్చింది. దీంతో ఏలూరు, అన్నమయ్య, కడప ఉడా, ఒంగోలు, చిత్తూరు, పీకేఎం, బొబ్బిలి, శ్రీకాకుళం, పల్నాడు, బాపట్ల, అమలాపురం పట్టణాభివృద్ధి అథారిటీలు ఇకపై మిగిలిన పట్టణాభివృద్ధి అథారిటీల మాదిరిగా అభివృద్ధికి సంబంధించిన అనుమతులు ఇవ్వనున్నాయి. ఈ అథారిటీల 'అభివృద్ధి అనుమతులను' నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

'ఆగస్టు సంక్షోభం'లో

స్పీకర్‌గా చేయాల్సిందే చేశా!



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చంద్రబాబుకు ప్రత్యేకంగా మేలు చేయలేదు.. 'ఆంధ్రజ్యోతి'తో యనమల రామకృష్ణుడు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

"అయిష్టంగానే రాజకీయాల్లోకి వచ్చా. ఎన్నో పదవులు అధిరోహించా. 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 38ఏళ్లపాటు నిరాటంకంగా వివిధ పదవులు, హోదాల్లో క్యాబినెట్ ర్యాంకులో కొనసాగడం టీడీపీలో నాకు తప్ప మరెవరికీ దక్కని అదృష్టం" అని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై కాకినాడ జిల్లా తునిలో గురువారం పుస్తకావిష్కరణ జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. నాటి 'ఆగస్టు సంక్షోభం'లో తన పాత్ర నుంచి నేటి పరిణామాల వరకు యనమల రామకృష్ణుడు చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే...

వారిద్దరికీ అదే తేడా..

ఎన్టీఆర్, చంద్రబాబు ఇద్దరూ సీఎంలుగా పార్టీ సిద్ధాంతాలైన పేదరిక నిర్మూలన, సంక్షేమానికి కట్టుబడి పనిచేశారు. చంద్రబాబు... రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం, పెట్టుబడులు తెచ్చి పరిశ్రమలు వచ్చేలా చేయడం, తద్వారా సంపద సృష్టించి పేదలకు సంక్షేమం అమలు చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఇద్దరి లక్ష్యం ఒకటే అయినా ఆచరించిన విధానాలు వేర్వేరు!

'ఆగస్టు సంక్షోభం' సమయంలో...

తెలుగుదేశం పార్టీ రాజకీయ చరిత్రలో 1995 ఆగస్టు సంక్షోభం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో లక్ష్మీపార్వతి ఆధిపత్య ధోరణి మెజార్టీ ఎమ్మెల్యేలకు నచ్చలేదు. అదే సమయంలో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్‌లో టీడీపీ కీలకంగా ఉంది. కేంద్రంలో 'ఫ్రంట్' అధికారంలోకి వస్తే ఎన్టీఆర్ ఉప ప్రధానిగా వెళ్లిపోవచ్చని, సీఎం కుర్చీ లక్ష్మీపార్వతి లాక్కోవచ్చని చాలామంది ఎమ్మెల్యేలు బలంగా నమ్మారు. దీంతో వారంతా తిరుగుబాటు లేవనెత్తారు. పార్టీని కాపాడుకోవడానికి చంద్రబాబు రంగంలోకి దిగారు. ఆయనను టీడీపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ బులిటెన్‌లో ప్రచురించాల్సిన బాధ్యత మాది. సభ్యులు ఎంతమంది ఎవరివైపు ఉన్నారో లెక్కించి స్పీకర్ అనుమతితో నివేదిక పంపాలని అప్పటి గవర్నర్ అసెంబ్లీ కార్యదర్శికి లేఖ పంపారు. ఇదంతా.. తదుపరి ప్రక్రియను జాప్యం చేయడానికేనని నాకు అర్థమైంది. ఈ నేపథ్యంలో స్పీకర్ హోదాలో ఉన్న నేను అసెంబ్లీ కమిటీ హాల్లో సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల బలాలను పేరుపేరునా మీడియా సమక్షంలో లెక్కించా! 163మంది సభ్యుల బలం చంద్రబాబుకు ఉండడంతో ఆయన టీడీఎల్పీ నేతగా, సీఎంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నాపై కొంతవరకు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మైక్ ఇవ్వకపోవడంతోపాటు బీపీసీ సమావేశానికి ఎందుకు పిలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే... మెజార్టీ సభ్యులు చంద్రబాబు వెంట ఉండడం, వారంతా టీడీఎల్పీ నేతగా చంద్రబాబును ఎన్నుకోవడంతో ఆ హోదా ఉన్నవారినే బీపీసీ సమావేశానికి పిలవాల్సి వచ్చిందని ఎన్టీఆర్‌కు వివరించాను. సభలో అజెండా అంశంపై మాత్రమే మాట్లాడడానికి మైక్ ఇవ్వడం కుదురుతుందని ఎన్టీఆర్‌కు తెలిపాను. ఒకరకంగా సభలో స్పీకర్‌గా నా కర్తవ్యాన్ని మాత్రమే నిర్వర్తించాను. ఇందులో చంద్రబాబుకు నేను ప్రత్యేకంగా చేసిన సాయం ఏదీ లేదు. కానీ... ఎన్టీఆర్‌కు కావాలనే మైక్ ఇవ్వలేదని కాంగ్రెస్‌తో సహా అనేకమంది నాపై దుష్ప్రచారం చేశారు. ఇప్పటికీ ఈ విషయమై నాకు ఆవేదన ఉంది.

అలా ఆయన దృష్టిలో పడ్డా..

కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీనగరంలో జన్మించాను. చదువుకుంటున్న సమయంలో అప్పట్లో కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఐక్య సంఘంలో పనిచేయడానికి నన్ను ఎంపిక చేశారు. అలా అందులో పోరాడుతున్న సమయంలో ఎన్టీఆర్ పార్టీని స్థాపించి రాష్ట్రమంతటా తిరుగుతున్న క్రమంలో నవంబరులో తుని వచ్చారు. అప్పుడే టీడీపీలో చేరాను. ఆ తర్వాత ఎన్టీఆర్‌ను హైదరాబాద్ రామకృష్ణా స్టూడియోలో కలిసి వచ్చిన కొన్ని రోజులకు నా విద్యార్హత, సామాజికవర్గం, పోరాటం గురించి ఆరా తీసి తుని అసెంబ్లీ సీటు ప్రకటించారు. అలా అయిష్టంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టాను. ఆ తర్వాత తొలిసారి ఎమ్మెల్యేగా నెగ్గడం, వెంటనే మునిసిపల్ మంత్రి కావడం... ఒకేసారి రెండు పదవులతో అసెంబ్లీలోకి అడుగుపెట్టాను. ఏదీ కోరుకోకుండానే రాజకీయాల్లో నాకు అన్నీ జరిగిపోయాయి. ఒకదాని వెంట మరో పదవి వరించింది.

రోశయ్య తర్వాత నాదే ఆ ఘనత

స్పీకర్‌గా ఉన్నప్పుడు ముఖ్యమైన రూలింగ్‌లు ఎన్నో ఇచ్చా. ఇప్పటి స్పీకర్‌లకు అవి రిఫరెన్స్‌లుగా మారుతున్నాయి. అసెంబ్లీ కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాన్ని నేనే ప్రవేశపెట్టాను. సభ్యులు చాలామంది నన్ను తిట్టినా ఈ విషయంలో వెనకడుగు వేయలేదు. ఏటా ఎమ్మెల్యేలు తమ ఆస్తులు ప్రకటించాలన్న రూలింగ్ నా హయాంలో ఇచ్చిందే. నా హయాంలోనే జీరోబేస్డ్ బడ్జెట్ విధానం ప్రవేశపెట్టాను. నేను మొత్తం 11 సార్లు రాష్ట్ర బడ్జెట్‌లు ప్రవేశపెట్టాను. రోశయ్య 15 సార్లుతో పోల్చితే ఆ తర్వాత నేనే! నా తొలి అసెంబ్లీ బడ్జెట్ రూ.40వేలకోట్లు.

అందుకే తక్కువగా మాట్లాడతా...

ఎన్ని పదవులు అధిరోహించినా, ఎన్ని బాధ్యతలు నెరవేర్చినా ఒత్తిడికి గురికాను. 1987లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నలుగురు మంత్రులు రాజీనామా చేయాల్సి వచ్చినప్పుడు నా పదవి పోయింది. కానీ, ఆ రెండేళ్లకే కేబినెట్ ర్యాంకుతో పదవి లభించింది. చాలామంది నేను తక్కువగా, పొడిగా మాట్లాడతానని అనుకుంటారు. తక్కువ మాట్లాడి, ఎక్కువగా వింటేనే ప్రజల ఇబ్బందులు తెలుస్తాయి. స్పీకర్‌గా పనిచేసిన సమయంలో కూడా ఎంతవరకు మాట్లాడాలో అంతే మాట్లాడేవాడిని. స్పీకర్ డజంట్ స్పీక్.

రాజ్యసభకు వెళ్లాలనేదే ఆశ..

రాష్ట్రస్థాయిలో ఇన్నేళ్లలో ఎన్నో పదవులు అధిరోహించాను. అందుకే ఇకపై రాజ్యసభలో అడుగుపెట్టాలనేదే నా కోరిక. రాజకీయాలు ఇప్పుడు పూర్తిగా ధనమయమైపోయాయి. ముఖ్యంగా జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు సంపాదించారు. ఆ డబ్బుతో అధికారం సంపాదించి మళ్లీ డబ్బు సంపాదించారు. వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాకపోవడం ప్రజలిచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేయడమే!

రాష్ట్రానికి కేంద్రం వరాలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టనున్నారు. ఇక, 'అమరావతి-హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే'ను వేగంగా పూర్తి చేయడంపై దృష్టి సారించిన కేంద్రం.. ఈ హైవే నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖకు కేంద్ర హోం శాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా త్వరలోనే అమరావతి రింగ్ రోడ్డు, హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులకు అనుమతులు జారీ చేసి పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. అలాగే, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 6 లైన్ల విస్తరణను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించింది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాలను వేగంగా పరిష్కరించాలని కేంద్రం భావిస్తోంది.

ఏపీకి ప్రత్యేకం!

ఏపీలో ఇప్పటికే గ్రీన్ ఫీల్డ్ పెట్రోలియం రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. అయితే, రాష్ట్రంలో మరో పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటు చేయాలని ఏపీ చేసిన ప్రతిపాదనను పరిశీలించాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. విశాఖపట్టణం-విజయవాడ-హైదరాబాద్-కర్నూలు రైలు కారిడార్ ఏర్పాటు అంశాన్ని త్వరగా పరిశీలించాలని రైల్వే శాఖను హోంశాఖ కోరింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా సాగించాలని, రెండేళ్లలో అక్కడ నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అదేవిధంగా.. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) విభజన, విభజన చట్టంలోని షెడ్యూలు 9లో పేర్కొన్న కార్పొరేషన్లు, కంపెనీలు, షెడ్యూలు 10లోని సంస్థల విభజన, విదేశీ రుణ సాయంతో చేపట్టే ప్రాజెక్టులపైనా కేంద్ర హోం శాఖ దృష్టి పెట్టింది. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అప్పుల పంపిణీపై కూడా కేంద్ర హోంశాఖ చర్చించింది. అయితే, వీటిపై అటార్నీ జనరల్(ఏజీ) అభిప్రాయం తీసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇక, ఏపీలో వెనుకబడిన జిల్లాలకు మరో రూ.350 కోట్లను గ్రాంట్ రూపంలో త్వరలో విడుదల చేసేందుకు సిద్ధమైనట్టు తెలిసింది.

తెలంగాణకు..

హైదరాబాద్-మన్నెగూడ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన అపరిష్కృత అంశాలు పరిష్కారం అయ్యాయని అధికారులు గత సమావేశంలో వివరించారు. ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఈ ఏడాది డిసెంబర్ నుంచే ప్రారంభించాలని నిర్ణయించారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు కూడా పెద్ద ఎత్తున చర్యలు ప్రారంభించామని ఆ శాఖ అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు సంబంధించిన నిధులపై నీతి ఆయోగ్‌తో చర్చించాలని హోంశాఖ అధికారులకు సూచించింది. ఖమ్మంలో స్టీల్ ప్లాంట్ సాధ్యం కాదని తేలినందున ప్రైవేట్ సంస్థలతో కలిసి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసే విషయం పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగం అలైన్‌మెంట్ పూర్తయిందని, సమగ్ర ప్రాజెక్టు నివేదిక తుదిదశలో ఉందని తెలిపింది. మరో 4 నెలల్లో డీపీఆర్ పూర్తవుతుందని, ఇప్పటికే టెండర్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపింది.

రాష్ట్రంలో వ్యవసాయ పరిశోధన సంస్థ!

ఏపీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కోసం కేంద్రం ఇప్పటికే రూ.135 కోట్లు విడుదల చేసింది. అదేవిధంగా పూసాలో ఉన్న వ్యవసాయ పరిశోధనా సంస్థ దక్షిణాది క్యాంపస్‌ను రాష్ట్రంలో నెలకొల్పాలని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను పరిశీలించాలని తాజాగా నిర్ణయించింది. అలాగే, రెండేళ్లలో విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, అప్పటి వరకు తాత్కాలిక కార్యకలాపాలను నిర్వహించాలని రైల్వే బోర్డుకు హోం శాఖ సూచించింది.

ఉమ్మడి సమస్యలపై..

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి సమస్యల పరిష్కారం, ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర హోం శాఖ దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా వివిధ మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ప్రాజక్టుల పురోగతిపై సమీక్షించింది. ప్రతి రెండు నెలలకోసారి సమావేశమై విభజనకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన నిధుల పంపిణీ విషయంలో పరిష్కారం కనుగొనేందుకు 'కాగ్'కు లేఖ రాయాలని నిర్ణయించారు. ఉమ్మడి సంస్థల నిర్వహణపై తెలంగాణ చేసిన ఖర్చు తిరిగి చెల్లించే విషయం కూడా కాగ్‌కు నివేదించనున్నారు. కాగా, తదుపరి సమావేశంలో పోలవరం ప్రాజెక్టు, విద్యాసంస్థల ఏర్పాటు, ఏపీలో గ్రేహౌండ్స్ సెంటర్ ఏర్పాటుపై చర్చించాలని నిర్ణయించారు.

నెరవేరిన దశాబ్దాల కల!

తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ లైన్‌కు మోక్షం

(చిత్తూరు/తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుపతి-పాకాల-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలకు దశాబ్దాల కల నెరవేరినట్టయింది. మొత్తం 104 కిలోమీటర్ల మేర రైల్వే డబ్లింగ్ లైన్ అందుబాటులోకి రానుంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంపై చిత్తూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ఇటీవల కొన్నేళ్లుగా ఈ మార్గంలో రైళ్ల రద్దీ పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సింగిల్ లైన్‌తో రైళ్ల రాకపోకలకు తీవ్ర సమయాభావం పడుతోంది. మరోవైపు.. ఇదే లైన్‌లో ఉన్న తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తుల రాక భారీగా పెరిగింది. దీంతో రైళ్ల సంఖ్యను పెంచడంతో సింగిల్ లైన్‌లోనే రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తిరుపతి-పాకాల-కాట్పాడిల మధ్య డబుల్ లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు కొన్నేళ్లుగా కేంద్ర మంత్రులకు విన్నవిస్తున్నారు. పార్లమెంటులోనూ రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఈ విషయంపై పలు మార్లు ఆయన కూడా కేంద్రానికి విన్నవించారు. ప్రస్తుతం తిరుపతి, వేలూరు ప్రాంతాలు విద్య, వైద్య రంగాలకు కీలక కేంద్రాలుగా ఉన్నాయి. ఈ డబ్లింగ్ పనులు పూర్తయితే.. స్థానికులకు, విద్యార్థులకు, రోగులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులో వస్తాయి. మరీ ముఖ్యంగా ఈ 104 కిలోమీటర్ల పరిధిలో రైళ్లకు రద్దీ మరింత పెరగడం ద్వారా.. ఇతర వాహనాల వినియోగం తగ్గి.. ఏటా 20 కోట్ల కిలోల కార్బన్‌మోనాక్సైడ్ విడుదల తగ్గుతుందని అంచనా. అదేవిధంగా 4 కోట్ల లీటర్ల డీజిల్ పొదుపుకానుంది.

బాబు ప్రత్యేక దృష్టి

సీఎం చంద్రబాబు రైల్వే ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు దృష్టి పెడుతూనే ఉన్నారు. భూసేకరణ, కొత్త రైలు మార్గాల నిర్మాణం వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్లు రైల్వే ప్రాజెక్టుల డీపీఆర్‌లను సీఎంకు వివరించారు. తిరుపతి-కాట్పాడి మధ్య డబ్లింగ్‌కు ఆమోదం రాగానే భూసేకరణ వేగవంతం చేస్తామని అప్పట్లో చంద్రబాబుకు తెలిపారు.

అమరావతి నిర్మాణాలకు ఇసుక సిద్ధం చేయండి

- గనుల శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గృహనిర్మాణరంగం, అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకున్నందున ఇసుక నిల్వలు భారీగా పెంచాలని గనుల శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అమరావతి రాజధాని నిర్మాణంతోపాటు, అనేక ఇతర ప్రాజెక్టుల నిర్మాణాలు మొదలవుతున్నందున భారీగా ఇసుక అవసరం ఉందన్నారు. వాటి కోసం ఇసుక కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బుధవారం గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌తో సీఎం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అమరావతిలో ప్రాజెక్టులు దక్కించుకున్న సంస్థలు తమకు కనీసం కోటిన్నర క్యూబిక్ మీటర్ల మేర ఇసుక కావాలని డిమాండ్ నోటీసులు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలం రాకముందే ప్రభుత్వ ప్రాజెక్టుల అవసరాల కోసమే కోటి టన్నుల మేర ఇసుకను రిజర్వ్‌చేయాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. ఈ దిశగా గనుల శాఖ కార్యాచరణ ప్రణాళిక రెడీచేసుకోవాలన్నారు.

రేషన్‌లో రాగులు

- జూన్ నుంచి పంపిణీకి ఏర్పాట్లు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండితో పాటు తృణధాన్యాలను కూడా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే జూన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కార్డుదారులకు రాగులు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రేషన్ బియ్యానికి బదులుగా రాగులు ఉచితంగా పంపిణీ చేయనుంది. అంటే ప్రతినెలా 20 కిలోలబియ్యం తీసుకునే కుటుంబం రెండు కేజీలు రాగులు కావాలనుకుంటే.. ఆ మేరకు బియ్యాన్ని మినహాయిస్తారు. ప్రాథమికంగా సంవత్సరానికి సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల రాగులు అవసరమవుతాయని పౌరసరఫరాల సంస్థ అంచనా వేసింది. ఆ మేరకు రాగులు సేకరించేందుకు తాజాగా టెండర్ నోటీసు జారీ చేసింది.

డబ్లింగ్.. డబుల్ ధమాకా!

ఆంధ్రప్రదేశ్-తమిళనాడు మధ్య ప్రస్తుతం సింగిల్ లైనుగా ఉన్న తిరుపతి-పాకాల-కాట్పాడి రైలు మార్గాన్ని రెండు వరుసలకు(డబ్లింగ్) విస్తరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు రూ.1,332 కోట్లు ఖర్చుకానుంది. మొత్తం 104 కిలో మీటర్ల మేర డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ఢిల్లీలో తెలిపారు. కాగా, తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుతో రాయలసీమ జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది. 104 కి.మీ. మార్గంలో 17 మేజర్ వంతెనలు, 327 మైనర్ బ్రిడ్జిలు, ఏడు ఫ్లైవంతెనలు, 30 అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఈ స్టేషన్ల నడుమ అతిపెద్ద ఆలయం తిరుమలతోపాటు శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట, కాణిపాకం తదితర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభం కానున్నాయి. అదేవిధంగా ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల శ్రీ సిటీ, సిమెంటు పరిశ్రమలు, స్టీల్ ఉత్పత్తుల కంపెనీలు ఈ రైల్వే లైన్ ద్వారా లబ్ధి పొందనున్నాయి. ఏడాదికి 4 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా కానుంది. అంతేకాకుండా ఏటా రూ.449 కోట్ల లాజిస్టిక్ ఖర్చులు మిగులుతాయి. సుమారు 400 గ్రామాలు, 14 లక్షల జనాభాకు ఈ ప్రాజెక్టుతో ప్రయోజనాలు కలగనున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయానికి కనెక్టివిటీతో పాటు, శ్రీ కాళహస్తి, కాణిపాకం ఆలయం, చంద్రగిరి కోట వంటి ప్రముఖ ప్రదేశాలకు రైల్వే కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. కాగా, తిరుపతి-కాట్పాడి రైల్వేలైను డబ్లింగ్‌తో యాత్రికులు, పర్యాటకులకు రైల్వే కనెక్టివిటీ మెరుగుపడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఏపీ, తమిళనాడు మధ్య సరుకు రవాణా సౌకర్యం పెరుగుతుందన్నారు.



మోదీకి బాబు, రామ్మోహన్ ధన్యవాదాలు

తిరుపతి-పాకాల-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. తిరుమల బాలాజీ, శ్రీకాళహస్తి శివయ్య, చంద్రగిరి కోట తదితర ప్రాంతాలకు రవాణాతోపాటు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. కనెక్టివిటీ పురోగతిలో కొత్త శకానికి నాంది పలుకుతుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ప్రధానికి, రైల్వే మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు నవ్యాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

అమరావతి నిధులపై పురందేశ్వరి హర్షం

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు.

'ఆక్వా'పై అధ్యయనానికి కమిటీ

సుంకాలు, సవాళ్లకు పరిష్కారం దిశగా..

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అమెరికా విధించిన సుంకాలతో సహా.. రాష్ట్రంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలు సూచించడానికి ఆక్వా వాటాదారులు, అధికారులతో కూడిన 'ఆక్వా కల్చర్ సలహా కమిటీ'ని ప్రభుత్వం నియమించింది. అమెరికా సుంకాలతో ఉత్పన్నమయ్యే సమస్యలు, వాటిపై తీసుకోవల్సిన చర్యలపై ఈ నెల 7న సీఎం చంద్రబాబు సమక్షంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆక్వా రంగంలో తలెత్తిన సవాళ్లను అధ్యయనం చేసి, పరిష్కారాలు కనుగొనడానికి ఆక్వా భాగస్వాములతో కమిటీని మత్స్యశాఖ ప్రతిపాదించింది. ఈమేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కమిటీ కాలపరిమితి: కేంద్ర ప్రభుత్వం, ఎంపెడా, అధికారులు, ఆక్వా భాగస్వాములతో సమావేశాలు నిర్వహించి అమెరికా సుంకాల ప్రభావం, స్వల్పకాలిక పరిష్కారాలపై ప్రాథమిక నివేదికను ఐదు రోజుల్లో ఇవ్వాలి. మధ్యస్థ, దీర్ఘకాలికంగా తీసుకోవల్సిన చర్యలపై 3వారాల్లోపు వివరణాత్మక నివేదిక సమర్పించాలి.

కమిటీ నిబంధనలు: రొయ్యల ఎగుమతికి ప్రత్యామ్నాయ మార్కెట్లను గుర్తించడం. దేశీయంగా సముద్ర ఆహార వినియోగాన్ని పెంచడం. నేషనల్ ప్రాన్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు. రక్షక దళాల మెనూలో రొయ్యలను ప్రవేశపెట్టడం, ఫీడ్ డైనమిక్ ధరల అమలు... తదితర సమస్యలకు ఈ కమిటీ పరిష్కారాలు కనుక్కుంటుంది.

సలహా కమిటీ సభ్యులు:
ఆక్వా ఎగుమతిదారులు: ఆనంద్ (పశ్చిమగోదావరి), ఆనందకుమార్(కృష్ణా), వెంకట్, దిలీప్ (విశాఖపట్నం)
ఆక్వా రైతులు: రఘు (కాకినాడ), కుమార్ రాజు(కృష్ణా), శ్రీకాంత్(నెల్లూరు), రామరాజు, సుబ్బరాజు (పశ్చిమ గోదావరి),
దాణా కంపెనీలు: సుబ్రహ్మణ్యం(కృష్ణా)
హేచరీస్ నిర్వాహకులు: కుమార్ (అనకాపల్లి), ఎస్ఎన్ రెడ్డి(కాకినాడ)
ప్రభుత్వ ప్రతినిధులు: ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్‌బాబు, మత్స్యశాఖ ఏడీ అంజలి, ఎంపెడా జేడీ విజయ్‌కుమార్, ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ డీడీ అవినాష్ వాధవ

నరికిపారేస్తారు... ఇంట్లోంచి లాగి కొడతారు

- వైసీపీ నేతలను వేధించిన వాళ్లను వదిలే ప్రసక్తే లేదు
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి కారుమూరి వ్యాఖ్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నేతల ఆగ్రహం



ఏలూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మరోసారి నోరుపారేసుకున్నారు. వైసీపీ నేతలను వేధిస్తున్న టీడీపీ నేతలను నరికిపారేస్తామంటూ చెలరేగిపోయారు. ఏలూరులో మంగళవారం వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'నేను పెద్దిరెడ్డి దగ్గరకు వెళ్లాను. కూటమి ప్రభుత్వం ఏం చేసినా వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకే ఓటు వేస్తారని చెప్పాను. ఇప్పటికే తెలుగుదేశం నాయకులు తమపై కక్ష పెట్టుకోవద్దంటూ మమ్మల్ని వేడుకుంటున్నారు. అది ఎన్నటికీ జరగదు. వైసీపీ నాయకులను వేధించిన వాళ్లను గుర్తు పెట్టుకుంటాం. గుంటూరు ఇవతల ఉన్న వాళ్లను ఇంట్లో నుంచి లాగి కొడతారు. గుంటూరు అవతల ఉన్న వారిని నరికి పారేస్తారు. మన ఇంటికి వాళ్ల ఇల్లు ఎంత దూరమో.. వారి ఇంటికి మన ఇల్లూ అంతే దూరం' అని వ్యాఖ్యానించారు. దీనిపై కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు తన తణుకు నియోజకవర్గంలో రైతులను 'ఎర్రి పప్పల్లారా..!' అంటూ వ్యాఖ్యానించి.. ఎర్రిపప్ప అటే బుజ్జి కన్నా అనే కొత్త నిర్వచనం చెప్పారు. ఆయన హయాంలో జరిగిన టీడీఆర్ బాండ్ల దుర్వినియోగం, రూ.వందల కోట్ల అవినీతిపై ప్రభుత్వం విచారణకు సిద్ధమవుతోంది. ఎక్కడ తన అవినీతి బయటపడుతుందో అనే భయంతో కారుమూరి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ, జనసేన నాయకులు విమర్శిస్తున్నారు.

కారుమూరీ... మాట తీరు మార్చుకో: విప్ బొమ్మిడి

'కారుమూరీ.. ఒళ్లు దగ్గర పెట్టుకో. పద్ధతిగా మాట తీరు మార్చుకో. కూటమి నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే తాట తీస్తాం' అంటూ ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ వార్నింగ్ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'పద్ధతి, భాష మార్చుకోవాలి. లేకపోతే గుణపాఠం చెబుతాం. మీ పాలనలో దాడులు, పోలీసు కేసులు భరించాం. ఇప్పుడు ఇంకా అధికారంలో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. అంబటి రాంబాబు, మీరు మాట తీరు మార్చుకోవాలి. లేకపోతే మీ నియోజకవర్గానికి వచ్చి మీ కార్యకర్తల ముందే బుద్ధి చెబుతాం' అని హెచ్చరించారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, 'చట్టబద్ధంగా పనిచేస్తున్న పోలీసులను మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, నరికేస్తామంటూ మాజీ మంత్రి కారుమూరి ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదు. నోరు అదుపులో పెట్టుకోవాలి. జగన్మోహన్ రెడ్డికి చేతనైతే తన చెల్లి, తల్లితోపాటు చిన్నాన్న కూతురు సునీత కన్నీళ్లు తుడవాలి, వారికి న్యాయం చేయాలి' అని సూచించారు.



కారుమూరిపై పలు చోట్ల ఫిర్యాదు

కారుమూరిపై రాష్ట్రంలో పలు చోట్ల టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. బుధవారం గుంటూరు పశ్చిమ డీఎస్పీని కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పలువురు నేతలు విద్వేష వ్యాఖ్యలు చేసిన కారుమూరిని అరెస్టు చేయాలని కోరారు. ఆయనపై తణుకు, ఇరగవరం, అత్తిలి పోలీసు స్టేషన్‌లలో బుధవారం ఎస్సీ, బీసీ నాయకులు ఫిర్యాదు చేశారు. కారుమూరి వ్యాఖ్యలతో తాము భయాందోళనలకు గురవుతున్నామని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అదంతా క్రిమినల్ లీడర్ ప్రీ ప్లాన్

- విచారణ జరుగుతోంది: హోం మంత్రి అనిత



విశాఖపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన మొత్తం డ్రామాలా సాగిందని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శవరాజకీయాలు చేయాలని జగన్ చూస్తున్నారని మండిపడ్డారు. ఆయన్ను తిరిగి తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్.. ఆయన వెళ్లిన 15 నిమిషాల్లోనే ఎలా ఎగిరిందని ప్రశ్నించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ఇదంతా చేశారనిపిస్తోందని, దీనిపై విచారణ జరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం పులివెందుల ఎమ్మెల్యేగా ఉన్న జగన్‌కు.. మాజీ సీఎంగా జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఇస్తున్నామని, ఇది చాలా ఎక్కువన్నారు. పోలీసుల బట్టలూడదీస్తామన్న భాష, పద్ధతి సరైంది కాదని తప్పుబట్టారు. అనంతపురం డీఐజీ, జిల్లా ఎస్పీ ఇద్దరూ మహిళలేననే విషయం గుర్తుందా అని ప్రశ్నించారు. జగన్‌కు కౌంటర్ ఇచ్చిన రామగిరి ఎస్ఐను ఆమె అభినందించారు. జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు వాట్సాప్ ద్వారా రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని, దీంతో ఎస్పీ అప్రమత్తమై సంయమనం పాటించాలని పదేపదే కోరారన్నారు. నిఘా వర్గాల హెచ్చరికతో 1,100 మంది పోలీసులను బందోబస్తుకు నియమించామన్నారు. అయినా కావాలని సీన్ క్రియేట్ చేయాలని చూశారని, క్రిమినల్ నాయకుడు ఎలా ఉంటారో మంగళవారం జగన్ నిరూపించుకున్నారని అన్నారు. హెలిప్యాడ్ వద్దకు అనుమతి ఉన్నవారు తప్ప మిగతావారు వెళ్లకూడదని, అటువంటిది జగన్ హెలికాప్టర్ వద్దకు వైసీపీ నాయకులు భారీగా వచ్చారని, పలువురు పోలీసులు గాయపడ్డారన్నారు. అయినా ఎంతో శ్రమతో విధులు నిర్వహించిన పోలీసులను తప్పుబట్టారని విమర్శించారు. ఇదంతా క్రిమినల్ లీడర్ ప్రీ ప్లాన్ అని ఆరోపించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. కారుమూరి వ్యాఖ్యలపైనా అనిత మండిపడ్డారు. ఇలా రౌడీల్లా మాట్లాడినందుకే 11 సీట్లకు పడిపోయారని, అయినా.. వారికి బుద్ధి రావడంలేదని అన్నారు.

జగన్‌పై పోలీసులకు ఫిర్యాదు

వెంకోజీపాలెం (విశాఖపట్నం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోలీసులను బట్టలు ఊడదీసి నిలబెడతానని జగన్ చేసిన వ్యాఖ్యలపై వీఎంఆర్‌డీఏ చైర్మన్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ అనుచరులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగన్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని కోరారు.

తిట్టించు.. ఇరికించు!



(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి 11 స్థానాలకే పరిమితం చేయడంతో కొన్ని నెలలు బూతులకు విరామం ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ జగన్ తన రాజకీయ వ్యూహం మొదలు పెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగేలా వైసీపీ కార్యకర్తల నుంచి ముఖ్యనేతల దాకా తాడేపల్లి ప్యాలెస్ తర్ఫీదు ఇస్తోంది. పార్టీ అధినేత జగన్ స్వయంగా అధికారులను, పోలీసులను బెదిరించేలా హెచ్చరికలు చేస్తున్నారు. పోలీసు వ్యవస్థను టార్గెట్ చేసుకుని తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని, బట్టలూడదీయిస్తామంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు. పాలనా వ్యవస్థలపై జగన్ హెచ్చరికలు చేస్తుంటే, ప్రత్యర్థులపై దండయాత్ర చేస్తామంటూ ఆ పార్టీ మాజీ మంత్రులు రెచ్చిపోతున్నారు. టీడీపీ వాళ్లను నరికిపారేస్తారంటూ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రెచ్చగొట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ఓ ఎస్ఐను బెదిరిస్తూ మాట్లాడారు. సీఎం చంద్రబాబు, పోలీసులపై వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇక మాజీ మంత్రి పేర్ని నాని మళ్లీ నోరు విప్పుతున్నారు.

భవిష్యత్తుపై ఆందోళన

రాజకీయంగా స్తబ్ధుగా ఉన్న వైసీపీలో చలనం తీసుకువచ్చేందుకు బూతులను ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు. ఇటీవల కాలంలో జగన్ చేపట్టిన ప్రజాందోళనలకు జనం నుంచి స్పందన రాలేదు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ చేసిన పోరాటాలన్నీ విఫలమయ్యాయి. గత ఎన్నికల పరాజయం నుంచి కోలుకోకపోవడం, పార్టీ అధినేత తీరులో మార్పు రాకపోవడం వంటి కారణాలతో వైసీపీని పలువురు నేతలు వీడుతున్నారు. జగన్ పెడుతున్న జిల్లాల సమావేశాలకు పార్టీ నేతల నుంచి స్పందన కరువవుతోంది. జిల్లా సమావేశాలకు చాలామంది నేతలు ముఖం చాటేస్తున్నారు. గతంలో మంత్రులుగా అధికారాన్ని అనుభవించిన వారు కూడా తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయానికి రావడం మానేశారు. సకల శాఖల మంత్రిగా పేరున్న వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితో సహా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం మీడియా సమావేశాల్లో పెట్రేగిపోయిన నేతలు ఇప్పుడు కనిపించడం మానేశారు. దీంతో వైసీపీ భవిష్యత్తుపై జగన్‌లో ఆందోళన మొదలైంది. జిల్లాల పర్యటనలకు వెళ్తానని ప్రకటించిన జగన్ ఇప్పుడు ఆ ఆలోచనను విరమించుకున్నారు. పార్టీ పరిస్థితి నానాటికీ దిగజారిపోతుండటంతో కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం తెచ్చేందుకు రాజకీయ వ్యూహానికి పదును పెట్టారు.

పార్టీ శ్రేణులు చేజారకుండా..

గత ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత ఆ పార్టీ కీలక నేతలు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. పలువురు రాజ్యసభ, శాసన మండలి సభ్యులు పదవులకు, పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోయారు. పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా పార్టీకి దూరమయ్యారు. అధికారంలో ఉండగా ఎలాంటి లబ్ధి పొందని పార్టీ శ్రేణులు కూడా క్రమంగా వైసీపీకి దూరం కావడం మొదలెట్టాయి. వీటిని నివారించేందుకు కూటమి నేతలపైనా, అధికారులపైనా, పోలీసులపైనా యుద్ధం ప్రకటించేలా జగన్ రాజకీయ వ్యూహానికి తెరతీశారని చెబుతున్నారు. పార్టీ నేతలతో తిట్లదండకానికి మళ్లీ తెరలేపారని అంటున్నారు. బూతులు తిట్టించడం వల్ల నేతలు కేసులలో ఇరుక్కుంటారు. దీంతో వైసీపీకి దూరం కావాలన్న ఆలోచన రాదు. మరోవైపు దుర్భాషలాడిన నేతలను కూటమి కూడా దగ్గరకు తీసుకోదు. వైసీపీ నుంచి బయటకు వెళ్లేందుకు దారులు మూసుకుపోతాయి. ఇందుకోసం కూటమి నేతలను తిట్టించి, పార్టీ శ్రేణులు కేసుల్లో ఇరుక్కునేలా జగన్ రాజకీయ క్రీడ మొదలు పెట్టారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఆమెకు జ్ఞాపక శక్తి రావాలని ప్రార్థిస్తున్నా

- డాక్టర్ ప్రభావతి ఎవరి ప్రోద్బలంతోనో మాట్లాడుతున్నారు: రఘురామరాజు



ఉండి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'తెలియదు... గుర్తు లేదు... గాయాలు ఎలా ఉంటాయో తెలియదు. వాటిపై అవగాహన లేదు... అంటూ డాక్టర్ ప్రభావతి చెప్పిన అబద్ధాల ద్వారా ఆమె ప్రవర్తన ఏమిటో అర్థమవుతోంది. తన కింద పనిచేసే వాళ్లు ఫైల్ తెస్తే తాను సంతకం పెట్టానని చెప్పడం దారుణం. ఆమెకు తిరిగి జ్ఞాపక శక్తి రావాలని, మంచిగా ఉన్నది వున్నట్టు చెప్పాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. తనను కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో అప్పటి గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతున్న తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కేసుల విచారణకు ఎవరైనా సహకరిస్తుంటారు. కానీ ఆమె మహిళై ఉండీ అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారు. ఎంబీబీఎస్ డాక్టర్‌కు కనీసం అవగాహన ఉండదా? ఎవరి ప్రోద్బలంతోనో మాట్లాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె తీరు మార్చుకుని విచారిస్తున్న అధికారులకు ఉన్నది ఉన్నట్టు చెబితే అన్నీ బయటకు వస్తాయి. హైకోర్టు సీనియర్ డాక్టర్లను నియవిస్తే వారెవరూ సంతకం పెట్టలేదు. అప్పుడు జూనియర్ డాక్టర్లను నియమించి డా.ప్రభావతిపై వత్తిడి చేసి సంతకాలు తీసుకున్నట్లు సుప్రీంకోర్టులో ఫైల్ చేసిన దానిలో వుంది. ఈ నెల 15న కోర్టు నంబరు 5లో ఐటెం 6గా ఈ మేటర్ లిస్ట్ అయింది. సుప్రీంకోర్టు తాత్కాలిక ఊరట కల్పించే వరకూ డాక్టర్ ప్రభావతి ఎంతో చాకచక్యంతో ఎవరి కంటికీ కనిపించకుండా తప్పించుకున్న విషయం అందరికీ తెలుసు' అని రఘురామ ఎద్దేవా చేశారు.

భాష మార్చుకోకపోతే రాజకీయ సమాధి చేస్తాం: పల్లా



గాజువాక (విశాఖపట్నం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ తన భాషను మార్చుకోకపోతే వైసీపీని రాజకీయ సమాధి చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు. విశాఖలో బుధవారం నిర్వహించిన కేడర్ విత్ లీడర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలీసులపై జగన్ వాడిన భాష అభ్యంతరకరమన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రశాంత వాతావరణాన్ని కోరుకుంటున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు.

రాజకీయ అశాంతికి ఆజ్యం పోశారు: కేశవ్



బెళుగుప్ప, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకే జగన్మోహన్‌రెడ్డి పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా బెళుగుప్పలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న శ్రీసత్యసాయి జిల్లాలో జగన్ పర్యటించి కులాలు, వర్గాల మధ్య చిచ్చుపెడుతున్నారని, అశాంతి రేపేందుకు, రాజకీయ కుట్రకు ఆజ్యం పోశారని మండిపడ్డారు. ఓ గ్రామంలో జరిగిన సంఘటనను రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ మాట్లాడటం దారుణమన్నారు. పోలీసు శాఖపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమన్నారు.

పోలీసులు లేకుంటే గడప దాటగలవా: సవిత



పెనుకొండ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'పోలీసులే లేకుంటే నీ ఇంటి గడపైనా దాటగలవా? సీఎం సీటులో కూర్చుని పాలించిన నీకు పోలీసులతో ఎలా మాట్లాడాలో తెలియదా' అని జగన్‌పై మంత్రి సవిత మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పోలీసులను బట్టలూడదీసి కొడతామనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రజలను రెచ్చగొట్టేలా, వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదన్నారు. జగన్‌కు శవ రాజకీయాలు అలవాటుగా మారిందని, తన తండ్రి మరణాన్ని కూడా రాజకీయంగా వాడుకున్నారని అన్నారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటన బాధాకరమని, బాధ్యులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న పోలీసు అధికారుల సంఘం నేత శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు

జగన్‌ది ప్రజాస్వామ్యంపై దాడే

- క్షమాపణ చెప్పకుంటే న్యాయ పోరాటం: రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

అమరావతి, విజయవాడ (గాంధీనగర్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పర్యటనలో 'పోలీసుల బట్టలు ఊడదీస్తా' అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యల్ని రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 'జగన్ చేసిన వ్యాఖ్యలు పోలీసుల మనోభావాలు, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. పోలీసులు రాజకీయ, వర్గ, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తూ.. రూల్ ఆఫ్ లాను పారదర్శకంగా అమలు చేస్తున్నారు. జగన్ తన రాజకీయ లబ్ధి కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు. పోలీసులను బెదిరించడం.. ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే. ప్రజాస్వామ్యంపై ఆయనకు కనీస గౌరవ లేకపోవడం శోచనీయం' అని అన్నారు. 'మీ తండ్రి ప్రభుత్వంలో.. మీ పాలనలోనూ పని చేశాం.. మా ఉద్యోగం మేం చేస్తే తప్పా? మా యూనిఫామ్ మాకు ఉక్కు కవచం. తొలగించడం అంత సులభం కాదు. రాజకీయ మైలేజీ కోసం ఊగిపోతూ మమ్మల్ని అంటే ఊరుకోం. బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే కచ్చితంగా న్యాయ పోరాటం చేస్తాం' అని హెచ్చరించారు. మహిళా పోలీసుల మనోభావాలను దెబ్బతీసేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు.

ఊడదీసేందుకు అరటి తొక్కా: రామగిరి ఎస్ఐ



పుట్టపర్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'జగన్.. పోలీసుల బట్టలు ఊడదీస్తానంటున్నావ్. అవి నువ్విచ్చినవి కాదు. మేం కష్టపడి సంపాదించుకున్నవి' అని శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ అన్నారు. పాపిరెడ్డిపల్లిలో జగన్ వ్యాఖ్యలపై ఆయన మంగళవారం రాత్రి సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. కష్టపడి చదువుకుని, రన్నింగ్ రేస్‌లో వేలాది మందితో పోటీపడి పోలీసు ఉద్యోగాన్ని సంపాదించుకున్నామన్నారు. 'నువ్వెవడో వచ్చి ఊడదీయడానికి ఇదేమీ అరటి తొక్క కాదు. మేం ప్రజల పక్షాన నిజాయితీగా నిలబడతాం. నిజాయితీగానే ఉద్యోగం చేస్తాం. నిజాయితీగానే చస్తాం. అడ్డమైన దారులు తొక్కం. జగన్ జాగ్రత్తగా మాట్లాడాలి' అని హెచ్చరించారు.

ఎవరి ప్రలోభాలకు లోబడి పనిచేయం: అనంత సంఘం

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'పోలీసు వ్యవస్థ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తుంది. ఎవరి ప్రలోభాలకు లోబడి పనిచేయదు' అని ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ధర్మవరంలో వారు విలేకరులతో మాట్లాడారు. 'మేం ఎంతో కష్టపడి తెచ్చుకున్న ఉద్యోగాలను ఊడగొడతాం, బట్టలు ఊడదీస్తామని జగన్ అనడం దురదృష్టకరం. మీ ప్రభుత్వంలో పనిచేసింది కూడా మేమే. అప్పుడు మంచివారిగా కనిపించిన మేం ఇప్పుడెందుకలా కనిపించడం లేదు' అని ప్రశ్నించారు.

జగన్‌పై విచారణ జరపాలి

- ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు
- పోలీసులను దుర్భాషలాడుతున్నారు
- వైసీపీ కేడర్‌ను హింసకు ప్రేరేపిస్తున్నారు
- గద్దె దించేసినప్పటి నుంచీ ప్రజలను రెచ్చగొడుతున్నారు
- అమిత్ షాకు ఎంపీ లావు ఫిర్యాదు



గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తనను అధికారంలో నుంచి దించేసినప్పటి నుంచి జగన్ రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని నరసరావుపేట ఎంపీ, టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మండిపడ్డారు. పోలీసులను దుర్భాషలాడుతూ.. వైసీపీ కేడర్‌ను హింసకు ప్రేరేపిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయనకు లేఖ రాశారు. జగన్ తరచుగా పోలీసులను తిడుతూ హెచ్చరికలు జారీ చేయడం, తనకు సెక్యూరిటీగా ఉన్న పోలీసులనే బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. 'గత ఏడాది జూలై 22న అసెంబ్లీ గేటు వద్ద అధికారులను దూషించారు. 2024 నవంబరు 7న డీజీపీతో పాటు పోలీసు అధికారులెవరినీ వదిలిపెట్టనని, సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకొచ్చి శిక్షిస్తామని బెదిరించారు. ఈ ఏడాది జనవరి 13న పులివెందుల హెలిప్యాడ్ వద్ద డీఎస్పీ మురళీ నాయక్‌ను హెచ్చరించారు. ఫిబ్రవరి 18న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైలులో పరామర్శించడానికి వెళ్లి.. పోలీసు అధికారులెవరినీ వదిలిపెట్టను. వాళ్లు రిటైరైనా లాక్కొచ్చి శిక్షిస్తామన్నారు.. గత నెల 25న వైసీపీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తకు అభయమిస్తూ.. అధికారంలోకి రాగానే డీఎస్పీ, సీఐతో నీకు సెల్యూట్ చేయిస్తానని చెప్పారు. ఈ మంగళవారం (8న) శ్రీ సత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లికి వెళ్లి పోలీసుల దుస్తులు ఊడదీయిస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాల దృష్ట్యా జగన్ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలి. రాజ్యాంగాన్ని కాపాడాలి' అని షాను కోరారు.





మంగళవారం జగన్ వచ్చిన హెలికాప్టర్‌ను చుట్టుముట్టిన వైసీపీ శ్రేణులు, హెలిప్యాడ్ వద్ద పోలీసులపై తిరగబడుతున్న వైసీపీ కార్యకర్తలు (ఫైల్)

అసలేం జరిగింది?

- జగన్ పరామర్శ పర్యటనపై పోలీసు దర్యాప్తు ప్రారంభం
- హెలికాప్టర్ విండ్ షీల్డ్ నిజంగానే దెబ్బతిందా?
- బారికేడ్లను, పోలీసులను తోసేసింది ఎవరు?
- బెంగళూరు వెళ్లిన సీఐ బృందం
- హెలికాప్టర్ కంపెనీ నిర్వాహకులతో భేటీ
- వివరాలు చెప్పేందుకు సంస్థ నిరాకరణ
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి సహకారానికి పోలీసుల యత్నాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనలో భద్రతకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై పోలీసులు విచారణ ప్రారంభించారు. పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ మంగళవారం రావడం.. కుంటిమద్దిలో హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణుల హల్‌చల్.. హెలికాప్టర్‌ను చుట్టుముట్టి వీరంగం వేయడం.. పోలీసులు వలయంగా ఏర్పడి జగన్‌ను అక్కడి నుంచి పాపిరెడ్డిపల్లికి పంపించడం తెలిసిందే. అయితే తమ నేతకు పోలీసులు తగిన భద్రత కల్పించలేదని, హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినడంతో ఆయన రోడ్డు మార్గాన బెంగళూరు వెళ్లాల్సి వచ్చిందని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఇది పోలీసుల వైఫల్యమని విమర్శించారు. ఈ నేపథ్యంలో జగన్ పర్యటనపై ఉన్నతాధికారులు పోలీసులను నివేదిక కోరినట్లు తెలిసింది. దీంతో హెలిప్యాడ్ వద్ద జరిగిన సంఘటనపై శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు దర్యాప్తునకు శ్రీకారం చుట్టారు. ధర్మవరం, పుట్టపర్తి డీఎస్పీల ఆధ్వర్యంలో విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. జగన్ పర్యటనకు ఉపయోగించిన హెలికాప్టర్ పరిస్థితేంటో తెలుసుకునేందుకు హిందూపురం డివిజన్‌లోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో పోలీసుల బృందం బుధవారం బెంగళూరు వెళ్లింది. హెలికాప్టర్ ఏర్పాటు చేసిన కంపెనీ, నిర్వాహకులు, పైలట్ల వివరాలను సేకరించినట్లు సమాచారం. జగన్ ఎక్కడి నుంచి హెలికాప్టర్ ప్రయాణం ప్రారంభించారు.. ఎన్ని గంటలకు బయల్దేరారు.. తిరుగు ప్రయాణం షెడ్యూల్‌లో హెలికాప్టర్ ఉందా.. ఎంత అద్దె చెల్లించారు తదితర వివరాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినడం నిజమేనా.. మరమ్మతులు చేయకుండానే హెలికాప్టర్ తిరిగి ఎలా వెళ్లగలిగిందో ఆరా తీస్తున్నారు. వైసీపీ కార్యకర్తలు హెలికాప్టర్ డోర్ లాగారని, పైలట్ బ్యాగ్‌ను తస్కరించారనే అంశాలపైనా విచారణ జరుపుతున్నారు. అయితే పోలీసులు కోరిన వివరాలను చెప్పేందుకు హెలికాప్టర్ సంస్థ నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర పౌరవిమానయన మంత్రి రామ్మోహన్‌నాయుడి సహకారం కోరేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

పోలీసులు ముందే సూచించినా..

కుంటిమద్దికి హెలికాప్టర్ రాగానే వైసీపీ శ్రేణులు దాని వద్దకు దూసుకువెళ్లాయి. అడ్డుకున్న పోలీసులను పక్కకు తోసేశాయి. దీంతో జగన్‌ను అక్కడి నుంచి పాపిరెడ్డిపల్లికి పంపేందుకు పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామమని, జన సమీకరణ చేపట్టవద్దని పోలీసులు వైసీపీ నేతలకు ముందే సూచించారు. అయినా ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వైసీపీ కార్యకర్తలను భారీగా సమీకరించారు. హెలిప్యాడ్ వద్దకూ భారీగా పంపించారు. హెలిప్యాడ్ చుట్టూ బారికేడ్లను వైసీపీ నాయకులే ఏర్పాటు చేయించారు. హెలికాప్టర్ రాగానే ఒక్కసారిగా వాటిని తోసేసుకుని, పోలీసులను పక్కకు నెట్టి వైసీపీ కార్యకర్తలు దానిని చుట్టుముట్టారు. ఇలా వెళ్లినవారిలో రాప్తాడు నాయకులు, కార్యకర్తలు ముందున్నారని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. హెలిప్యాడ్ నుంచి జగన్ పాపిరెడ్డిపల్లి వైపు వెళ్లగానే సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిన్నదని, వీవీఐపీని తీసుకెళ్లడం సాధ్యం కాదని పైలట్ చెప్పారని, జగన్ రోడ్డుమార్గాన బెంగళూరు వెళ్తారని క్షణాల్లో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. వీటిపైనా దర్యాప్తు జరుగుతోంది.

తలుపు తట్టిన అదృష్టం!

‘ఆంధ్రజ్యోతి’ లక్కీ డ్రాలో నెల్లూరు వాసికి మారుతి స్విఫ్ట్ కారు



‘ఆంధ్రజ్యోతి’ కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా తీస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు

- పాఠకుడికి ఫోన్‌లో అభినందనలు తెలిపిన మంత్రి సత్యప్రసాద్
- 18 ఏళ్లుగా ‘ఆంధ్రజ్యోతి’ మా ఇంటి సభ్యుడిగా మారిపోయింది
- కార్ అండ్ బైక్ రేస్ విజేత జొన్నాదుల కోటేశ్వరరావు హర్షం

గుణదల/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ‘ఆంధ్రజ్యోతి’ కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో నెల్లూరు వాసి విజేతగా నిలిచి, స్విఫ్ట్ కారును సొంతం చేసుకున్నారు. ‘ఆంధ్రజ్యోతి’ 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన డ్రాలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన కూపన్ల నుంచి మంత్రి ఒకదాన్ని డ్రా తీశారు. ఇందులో నెల్లూరుకు చెందిన ‘ఆంధ్రజ్యోతి’ పాఠకుడు జొన్నాదుల కోటేశ్వరరావు కారును గెలుచుకున్నారు. మంత్రి ఆయనకు ఫోన్ చేసి అభినందనలు తెలిపి, కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం అనగాని మాట్లాడుతూ ‘అక్షరం మీ ఆయుధం’ నినాదంతో పాఠకులతో మమేకమవుతున్న ‘ఆంధ్రజ్యోతి’ యాజమాన్యం 22 సంవత్సరాల నుంచి కార్ అండ్ బైక్ రేస్ పేరుతో పాఠకులకు పురస్కారాలు అందజేస్తోందని కొనియాడారు. ఇంతవరకు ఏ పత్రిక కూడా రూ.కోటి విలువైన బహుమతులను పాఠకులకు అందించలేదని చెప్పారు. ఎండీ వేమూరి రాధాకృష్ణ మంచి మంచి కార్యక్రమాలు చేపడుతున్నారనడానికి ఇదో నిదర్శనమని పేర్కొన్నారు. ఇకపై తాను కూడా ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చే కూపన్లు నింపి పంపుతానని, డ్రాలో బహుమతి వస్తే పేదలకు అందజేస్తానని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ‘ఆంధ్రజ్యోతి’ సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, ఏజీఎం పి.వాసు, అడ్వర్టైజ్‌మెంట్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇంకా నమ్మలేకపోతున్నా



‘నేను రైల్వేశాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశాను. ఉద్యోగం చేస్తున్నప్పటి నుంచీ ప్రతిరోజూ ‘ఆంధ్రజ్యోతి’ చదవడం నా హాబీ. గత 18 ఏళ్లగా ‘ఆంధ్రజ్యోతి’ మా కుటుంబసభ్యుడిగా మారింది. లక్కీడిప్ కూపన్‌లు ప్రవేశపెట్టినప్పటి నుంచి కూపన్లు పూర్తి చేసి పంపిస్తున్నాం. ఇన్నాళ్లకు ‘ఆంధ్రజ్యోతి’ మెగా డ్రాలో నాకు కారు వచ్చిందని ఫోన్ రావడం ఇంకా నమ్మలేకపోతున్నా. నాకు సైకిల్ తొక్కడం మాత్రమే వచ్చు. నా వయసు 79ఏళ్లు. ఇప్పటికీ సైకిల్ తొక్కుతాను. ఇప్పుడు ‘ఆంధ్రజ్యోతి’ వారు అందిస్తున్న కారులో నా కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ముందు సీట్లో కూర్చొని ‘ఆంధ్రజ్యోతి’ చదువుతూ ఆనందిస్తాను. ఒక పాఠకుడికి పత్రికా యాజమాన్యం ఈ తరహా పురస్కారం అందించడం గొప్ప విషయం. ఇది నా జన్మలో మర్చిపోలేను.’

- కార్ అండ్ బైక్ రేస్ విజేత జొన్నాదుల కోటేశ్వరరావు

జగన్ పత్రికవి తప్పుడు రాతలు

- చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి టీడీపీ ఫిర్యాదు



డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు నక్కా ఆనందబాబు, అశోక్‌బాబు తదితరులు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రిక తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి తెలుగుదేశం నేతలు ఫిర్యాదు చేశారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్, చిట్టిబాబు బుధవారం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఆయన కార్యాలయంలో కలిశారు. జగన్ మీడియా ఎడిటర్లు, డైరెక్టర్లపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ‘రాజకీయ లబ్ధి కోసం జగన్ తన పత్రికను అడ్డం పెట్టుకుని రాష్ట్రానికో తీరున అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. తప్పుడు కథనాలతో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా రాతలు రాస్తున్న జగన్ మీడియాపై తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరాం’ అని టీడీపీ నేతలు తెలిపారు.

జోగి రమేశ్‌కు సీఐడీ నోటీసులు



అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు జోగి రమేశ్‌ను సీఐడీ అధికారులు శుక్రవారం(11న) విచారణకు పిలిచారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన రమేశ్ భారీ కాన్వాయ్‌తో ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిపై దాడి చేయడం అప్పట్లో కలకలం సృష్టించింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించింది. విజయవాడలోని తమ కార్యాలయంలో హాజరు కావాలని రమేశ్‌కు సీఐడీ నోటీసులు జారీ చేసింది.

వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



విజయవాడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు న్యాయస్థానాల్లో వరుస షాకులు తగులుతున్నాయి. గన్నవరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో భూమిని కబ్జా చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వడానికి విజయవాడలోని 12వ అదనపు జ్యుడీషియల్ కోర్టు నిరాకరించింది. వంశీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు కొట్టివేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. కాగా, గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వంశీతో పాటు పదిమంది నిందితులకు 23వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి

ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీ రెండోసారి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను న్యాయాధికారి హిమబిందు 11కు వాయిదా వేశారు.

‘హత్య’ బృందానికి హైకోర్టులో ఉపశమనం

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): హత్య సినిమా డైరెక్టర్, రైటర్ శ్రీవిద్య, నిర్మాత ప్రశాంత్‌రెడ్డికి హైకోర్టులో ఉపశమనం లభించింది. కేసు ఆధారంగా వారిరువురిపై తదుపరి చర్యలు నిలుపుదల చేసింది. సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు సర్టిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేసింది. ఫిర్యాదుదారుడు సునీల్‌యాదవ్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

మేడా కుటుంబం చెరలో 109 ఎకరాల ప్రభుత్వ భూమి!

- పేదల పేరిట ఆక్రమణ.. జాయింట్ కలెక్టర్ నోటీసులు

రాయచోటి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదల పేరుతో ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారనే ఆరోపణలతో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబానికి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలం లేబాకలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 109.23ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ కుటుంబం ఆక్రమించుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో గయాలు భూములుగా ఉన్నవాటిని అక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. సర్వే నం.121-5లో 3.50 ఎకరాలు ఉన్న రఘునాథరెడ్డి మరో చిన్నాన్న మేడా సుబ్బరామిరెడ్డికి నోటీసులు ఇచ్చారు. ఈ ఆక్రమిత భూములను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో వారంలోగా వివరణ ఇవ్వాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ 4న నోటీసులు జారీచేశారు. సకాలంలో వివరణ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంబీబీఎస్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీ కొడుతూ ముగ్గురు విద్యార్థులు పట్టుబడ్డారు. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో బుధవారం ఎంబీబీఎస్ చివరి ఏడాది జనరల్ మెడికల్, ఎంబీబీఎస్ రెండో ఏడాది ఫార్మకాలజీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో ముగ్గురు విద్యార్థులు కాపీ కొడుతూ పట్టుబడ్డారు. వారిపై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు సిద్ధం అవుతున్నారు. కాపీ కొడుతూ దొరికిన వారిలో మంగళగిరిలోని ప్రముఖ మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు, ఇబ్రహీంపట్నంలోని మరో మెడికల్ కాలేజీకి చెందిన విద్యార్థి ఉన్నట్లు తెలుస్తోంది.

పంచాయతీరాజ్ ప్రక్షాళనలో తొలి అడుగు

- ఉద్యోగుల సర్వీసు విషయాల్లో పలు మార్పులు
- ఒకే కేడర్‌గా ఎంపీడీఓ, డీఎల్‌పీఓలు
- ఎంపీడీఓల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు చెక్
- కేడర్‌లు నిర్ధారిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ ప్రక్షాళన కోసం ఆ శాఖ చేసిన మొదటి ప్రతిపాదనపై రాజముద్ర పడింది. పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రక్షాళన కార్యక్రమాల్లో మొదటగా ఉద్యోగుల కేడర్ విషయంలో తారతమ్యాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. అతిముఖ్యమైన సర్వీసు విషయాలపై ముందు దృష్టిసారించారు. మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఎంపీడీఓ), డివిజనల్ పంచాయతీ అధికారులు(డీఎల్‌పీఓ)లను ఒకే కేడర్‌గా నిర్ధారించారు. పదోన్నతితో వారు డివిజనల్ అభివృద్ధి అధికారులు (డీఎల్‌డీఓ)లు అవుతారు. అసిస్టెంట్ డైరెక్టర్ కేడర్‌లో ఉన్న జిల్లా పంచాయతీ అధికారులు(డీపీఓ)లకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డిప్యూటీ డైరెక్టర్ హోదా) కల్పించారు. ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్(ఈటీసీ) ప్రిన్సిపాళ్లకు డిప్యూటీ కమిషనర్ (అడిషనల్ డైరెక్టర్) హోదా కల్పించారు. డీడీఓలు, డిప్యూటీ సీఈఓలు, డీపీఓలను ఒకే కేడర్ కిందకు చేర్చారు. వారు పదోన్నతి పొంది జెడ్పీ సీఈఓలు అవుతారు. డీడీఓ/డీపీఓ/డిప్యూటీ సీఈఓలు మూడోవంతు మందిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో తీసుకోనున్నారు. 50 శాతం జెడ్పీ సీఈఓ పోస్టులను ఐఏఎస్ అధికారులతో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఆయా పోస్టులకు సంబంధించి ఐఏఎస్ అధికారులు లేకపోతే ఆ ఖాళీలను పంచాయతీరాజ్‌శాఖలో ఫీడర్ కేటగిరినుంచి భర్తీ చేయాలని నిర్ణయించారు. లేకపోతే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై నియమించుకునే వెసులుబాటు కల్పించారు. అంతర్గత కేడర్ బదిలీ సమయంలో కచ్చితంగా శిక్షణ అందివ్వాలని నిర్ణయించారు. డీఎల్‌డీఓలను ఇకపై గ్రూప్-1లో మూడోవంతు పోస్టులకు డైరెక్ట్ నియామకం ద్వారా చేపడతారు. అలాగే డీపీఓ పోస్టులకు ఇకపై నేరుగా నియామకం చేపట్టరు. ప్రస్తుతమున్న డీఎల్‌పీఓలు, డీపీఓలకు జాబితా పూర్తయ్యే వరకు ఒక నిర్దిష్ట నిష్పత్తిలో పదోన్నతి కల్పిస్తారు.

శిక్షణ పొందిన వారికే పదోన్నతులు

తాజా సంస్కరణల్లో భాగంగా ఎంపీడీఓలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కాకుండా పదోన్నతులతో భర్తీ చేయనున్నారు. ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ, సూపరింటెండెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు వేల మంది ఉన్నందున వారికి పదోన్నతుల అవకాశాలు దక్కేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ కేడర్‌ను డిప్యూటీ ఎంపీడీఓలుగా పరిగణిస్తారు. ఎంపీడీఓ, డీడీఓ, డీపీఓ, సీఈఓ తదితర పోస్టులకు కచ్చితంగా శిక్షణ అందించి నియమిస్తారు. శిక్షణ పొందిన వారికే పదోన్నతులు లభిస్తాయి. నేరుగా నియామకం పొందిన అధికారులు పదోన్నతి పొందిన తర్వాత కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి చేశారు. పదోన్నతి పొందిన ప్రతి అధికారి నెల రోజులు శిక్షణ తీసుకోవాలి. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన డీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు ఏడాది పాటు పంచాయతీరాజ్ శిక్షణ కేంద్రాల్లో శిక్షణపొందాల్సి ఉంటుంది. ఇంటర్ కేడర్ బదిలీల్లో భాగంగా ఒక ఏడాది పాటు ఆన్‌జాబ్ ట్రైనింగ్ తప్పనిసరి చేశారు.

వక్ఫ్ జోలికి ఎందుకెళ్లారు?

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ప్రకటించింది. ‘వక్ఫ్‌భూములకు ఎసరు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’ బుధవారం వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. ఓ కీలక అధికారిని ముఖ్యమంత్రి పిలిచి ఈ వార్తపై వివరణ కోరారని తెలిసింది. “డిసెంబరులో జరిగిన సమావేశంలో వక్ఫ్ భూముల గురించి స్పష్టత ఇచ్చాను. ముస్లిం వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికే ఆ భూములు ఉపయోగించాలని, వ్యాపారాలకు తావులేదని ఆదేశించాను. నాకు తెలియకుండా ఆ భూముల జోలికి ఎందుకు వెళ్లారు? వక్ఫ్ బోర్డు ఇచ్చిన నోటీసు గురించి మైనారిటీ సంక్షేమశాఖ నివేదించిన విషయాన్ని కూడా నాకు ఎందుకు చెప్పలేదు? ఆ శాఖ ఇచ్చిన సమాచారంపై తక్షణమే స్పందించి ఆ నోటీసు ఎందుకు రద్దుచేయలేదు? సంబంధిత వ్యక్తులను ఎందుకు పిలిచి మాట్లాడలేకపోయారు? ఇదేం పద్ధతి? వక్ఫ్‌భూముల్లో గజం భూమి చేయిదాటినా ఊరుకునేది లేదు. తక్షణమే ఆ శాఖ అధికారులను పిలిచి మాట్లాడండి. వక్ఫ్‌బోర్డు సీఈవో ఎవరిని అడిగి ఆ నోటీసు ఇచ్చారు? మైనారిటీ శాఖ మంత్రి, కార్యదర్శికి సమాచారం ఎందుకు ఇవ్వలేదు? పిలిచి మాట్లాడండి. వెంటనే ఆ నోటీసును రద్దుచేయండి. భూముల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి” అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అనంతరం సీఎంవో.... మైనారిటీ సంక్షేమశాఖ అధికారులను పిలిచి మాట్లాడినట్లు తెలిసింది. తర్వాత పలు పరిణామాలు చకచకా జరిగిపోయాయి. ‘ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి, ఆమోదం లేకుండా వక్ఫ్‌బోర్డు సీఈవో నోటీసులు ఇవ్వడం సముచితం కాదు” అని మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు సీఎంవోకు నివేదించినట్లు తెలిసింది. మైనారిటీ సంక్షేవశాఖ కార్యదర్శి చిత్తూరు శ్రీధర్ ఓ ప్రకటన జారీ చేశారు వక్ఫ్ బోర్డు ఇచ్చిన వాణిజ్యప్రకటనను ఉపసంహరించాలని ఆదేశించినట్లు వివరించారు. కాగా, వక్ఫ్ భూములను కాజేసే ఇంటిదొంగలు 50మంది ఉన్నారని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఇంటిదొంగలను గుర్తించి ఏరిపారేస్తామని ప్రకటించారు. హిందూ ఆలయాల ఆస్తులు ఎలా కాపాడతారో, వక్ఫ్ ఆస్తులనూ అలాగే కాపాడాలని సీఎం చెప్పారని తెలిపారు. వక్ఫ్ భూములపై నలుగురు ఇంటిదొంగలు కన్నేశారని ‘ఆంధ్రజ్యోతి’ తన వార్తలో పేర్కొంది. అయితే, అంతకుమించి దొంగలు ఉన్నారని ఆయన కొత్త సంగతి చెప్పారు. మరి ఆ దొంగలను ఎలా గుర్తిస్తారు.. ఎలా ఏరివేస్తారనేది వక్ఫ్‌బోర్డుకే స్పష్టత ఉండాలి.

కాకాణికి షాక్


- క్వార్ట్జ్ కేసులో అరెస్టు నుంచి రక్షణకు హైకోర్టు నిరాకరణ
- ఎఫ్ఐఆర్, రికార్డులు పరిశీలిస్తే ఆయన పాత్ర స్పష్టమవుతోంది
- న్యాయమూర్తి స్పష్టీకరణ
- అనుబంధ వ్యాజ్యం కొట్టివేత



అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. క్వార్ట్జ్ ఖనిజం అక్రమ తవ్వకం కేసులో అరెస్టు నుంచి ఆయనకు రక్షణ కల్పించేందుకు నిరాకరించింది. తదుపరి చర్యలు నిలిపివేయాలని.. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆయన వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేసింది. అలాగే ఆ కేసును కొట్టివేయాలని దాఖలుచేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉందనే కారణంతో కాకాణి విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించడం సరికాదు. ఎఫ్ఐఆర్, రికార్డులను పరిశీలిస్తే కాకాణి పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా స్పష్టమవుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో లోతైన, సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. వాస్తవాలు ఏమిటనే దానిపై స్పష్టత లేదు. పూర్తి స్థాయి ఆధారాలు మా ముందు లేవు. ఈ నేపథ్యంలో కాకాణి అరెస్టును నిలువరిస్తూ.. ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోకుండా ఆపడం సరికాదు. బీఎన్ఎస్ఎస్ చట్టనిబంధన ప్రకారం కాగ్నిజబుల్ నేరాల విషయంలో దర్యాప్తు చేసే చట్టబద్ధమైన హక్కు, విధి పోలీసులకు ఉన్నాయి. ఈ నేరాల్లో దర్యాప్తును కోర్టులు అడ్డుకోవడానికి వీల్లేదు. దర్యాప్తు దశలో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను నిలువరించడం సరికాదు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వడమంటే దర్యాప్తు సంస్థకు ఉన్న అధికారాలను హరించడమే అవుతుంది’ అని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాకాణి వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం వరదాపురం గ్రామపరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదలకూరు పోలీసులు నమోదుచేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ కాకాణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణార్హతపై వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వ్ చేశారు. మరోవైపు.. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కాకాణి క్వాష్ పిటిషన్ కూడా వేశారు. కేసు ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల చేయడంతో పాటు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ అనుబంధ వ్యాజ్యం దాఖలు చేశారు. ఇటీవల జరిగిన విచారణలో అనుబంధ పిటిషన్‌పై వాదనలు విన్న తర్వాత న్యాయమూర్తి తీర్పు రిజర్వ్ చేశారు. బుధవారం నిర్ణయం వెల్లడించారు.

ఐపీఎస్ అయి ఉండీ డబ్బు కోసం ఎలా ఒత్తిడి చేశారు?

- జాషువాకు హైకోర్టు సూటి ప్రశ్నలు
- అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరణ



అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి అయి ఉండీ స్టోన్ క్రషర్ యజమానిని డబ్బుల కోసం ఎలా ఒత్తిడి చేశారని పి.జాషువాను హైకోర్టు ప్రశ్నించింది. రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మలా ఎలా మారారని నిలదీసింది. ప్రాసిక్యూషన్ తరఫు వాదనలు వినకుండా తన నుంచి ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఆశించవద్దని తేల్చిచెప్పింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని ఏసీబీని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలతో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి పి.జాషువా (ఏ2) శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఆధారంగా తదుపరి చర్యలను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ... కేసు మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఐపీఎస్ అధికారి అని, రెండు పొలిటికల్ గ్రూపుల మధ్య వివాదంలోకి తనను లాగారని అన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ... ఇదే వ్యవహారంలో నిందితులు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు విన్నామని గుర్తు చేశారు. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు. ప్రాసిక్యూషన్ తరఫు వాదనలు వినకుండా తన నుంచి ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఆశించవద్దని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

మద్యం స్కాంలో..‘సిట్’ విచారణకు కసిరెడ్డి డుమ్మా

- మూడో నోటీసుకూ స్పందించని జగన్ బంధువు
- సహకరించాలని హైకోర్టు ఆదేశించినా గైర్హాజరు
- వైసీపీ పెద్దలే ఆయన్ను దాచారని అనుమానం!



అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి.. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు డుమ్మా కొట్టారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న సిట్ కార్యాలయంలో బుధవారం విచారణకు రావాలని సిట్ నోటీసివ్వగా.. ఆయన రాలేదు. మాజీ సీఎం జగన్‌కు బంధువు, అత్యంత సన్నిహితుడైన ఈయన.. ఆయన హయాంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. మద్యం తయారీదారుల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్లకు తగ్గకుండా వసూలు చేసి.. సుమారు రూ.3 వేల కోట్లను తాడేపల్లి ప్యాలెస్‌కు ఆయన చేర్చినట్లు ఆరోపణలున్నాయి. అంతేగాక లంచాల నెట్‌వర్క్‌ను రూపొందించి.. వైసీపీ ప్రభుత్వంలో పెద్దరెడ్డిగా పేరున్న నాయకుడితో కలిసి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని దందా నిర్వహించినట్లు ఆధారాలు లభించాయి. ఏ మద్యం కంపెనీ నుంచి ఎంత మద్యం కొనుగోలు చేయాలి.. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎంత మేరకు విక్రయించాలో కసిరెడ్డే ఖరారుచేసేవారని సమాచారం. లిక్కర్ స్కాంను వెలికితీసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్.. కీలక సమాచారాన్ని సేకరించింది. దర్యాప్తులో భాగంగా కసిరెడ్డిని ప్రశ్నించేందుకు సమాయత్తమైంది. దీంతో ఆయన విచారణకు హాజరైతే మొత్తం కక్కించేస్తారని, తాడేపల్లి ప్యాలెస్ గుట్టు రట్టవుతుందన్న ఉద్దేశంతో కొందరు వైసీపీ పెద్దలు కసిరెడ్డిని దాచేసినట్లు పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. బుధవారం ఆయనకు సిట్ అధికారులు పదే పదే ఫోన్ చేయడానికి ప్రయత్నించినా.. స్విచ్ఛాఫ్ చేసి ఉంది. వాస్తవానికి మార్చి 28న విచారణకు రావాలని ఆ నెల 25న మొదటిసారి సిట్ అధికారులు నోటీసులిచ్చారు. మరుసటి రోజు (26న) హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉంటున్న ఆయన తల్లికి నోటీసు అందజేశారు. మార్చి 29న విజయవాడలోని సిట్ కార్యాలయానికి కసిరెడ్డి రావాలని సూచించారు. దీంతో మెయిల్ ద్వారా స్పందించిన ఆయన కారణం చెబితేనే వస్తానని మెలిక పెట్టారు. సాక్ష్యం చెప్పేందుకు రావాలని సిట్ బదులివ్వడంతో తనకు స్కాంతో ఎలాంటి సంబంధం లేదంటూ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 4న విచారణ జరిపిన కోర్టు.. సిట్ నోటీసులకు చట్టబద్ధత ఉందని, విచారణకు సహకరించాలని స్పష్టం చేయడంతో గత శనివారం సిట్ అధికారులు మూడో నోటీసు పంపారు. బుధవారం విచారణకు రావాలన్నారు. అయినా ఆయన హాజరుకాలేదు.

కోలుకుంటున్న మార్క్ శంకర్

- మరో మూడు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలోనే
- సింగపూర్‌లో ఆస్పత్రికి డిప్యూటీ సీఎం పవన్
- కుమారుడి ఆరోగ్యంపై వైద్యుల వద్ద ఆరా

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ నెమ్మదిగా కోలుకుంటున్నాడు. ప్రమాద వార్త తెలిసి మంగళవారం రాత్రి సింగపూర్ బయల్దేరి వెళ్లిన పవన్ కల్యాణ్ బుధవారం నేరుగా తన కుమారుడు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మార్క్ శంకర్‌ను చూసిన అనంతరం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మార్క్ శంకర్ కోలుకొంటున్నాడని.. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరడం వలన మూడు రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించాల్సి ఉంటుందని వారు పవన్ కల్యాణ్‌కు సూచించారు. కాగా, బుధవారం ఉదయం మార్క్‌ను ఐసీయూ నుంచి సాధారణ రూమ్‌కి తరలించారు. పవన్ చిన్న కుమారుడు సింగపూర్‌లో సమ్మర్ క్యాంప్‌లో ఉండగా మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో అతని చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో అతన్ని ఐసీయూలో ఉంచి చికిత్స అందించిన సంగతి తెలిసిందే.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.